అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 12-09-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 254 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



కెన్యాలో అదానీకి షాక్

నైరోబి ఎయిర్‌పోర్ట్ కాంట్రాక్టుపై ఆందోళనలు

విమాన రాకపోకల్లో జాప్యం

తాత్కాలికంగా ఒప్పందం నిలిపివేసిన కోర్టు

వివరాలు 13లో..



డ్రగ్స్ రహిత తెలంగాణను రూపుదిద్దుదాం

చెరువులు, కుంటలు, నాలాల కబ్జాదారులపై కఠిన చర్యలు

నిరుద్యోగుల ఉపాధి కోసమే విదేశీ పెట్టుబడులు తెస్తున్నాం

సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతాం :

ఎస్సైల పాసింగ్ అవుట్ పరేడ్‌లో సీఎం రేవంత్ ఉద్ఘాటన

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి /గండిపేట

రాష్ట్రంలో గంజాయి, ఇతర మాదక పదార్థాలను విక్రయించేవారి వెన్నులో దడ పుట్టేలా ప్రతి పోలీసూ వ్యవహరించాలనీ, రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా రూపుదిద్దుదామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలీసులకు పిలుపునిచ్చారు. బుధవారం హిమాయత్‌సాగర్‌లోని ఆర్‌బీవీఆర్ పోలీసు అకాడమీలో నూతనంగా శిక్షణ పొందిన ఎస్సైల శిక్షణానంతర పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎస్సైల నుంచి ఆయన గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగం పెరిగిపోవటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. వాటిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. వ్యసనాల బారిన పడుతున్న యువతను ఆకర్షించటానికి డ్రగ్స్ మాఫియా నిరంతరం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నదనీ, దీనికి కొత్తగా విధుల్లో చేరబోతున్న ఎస్సైలు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. మరోవైపు, చెరువులు, కుంటలు, నాలాలను ఇష్టం వచ్చినట్టుగా ...5లో..

ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్

- మరోసారి తెరపైకి మంత్రివర్గ విస్తరణ 5లో..
- నేడు అధిష్టానంతో చర్చలు
- ఆశావహుల్లో ఉత్కంఠ
- వరదసాయంపై మోడీ, అమిత్ షాను కలవనున్న సీఎం



కార్మిక సంక్షేమం బీమాకు తాకట్టు

ఇన్సూరెన్స్ కంపెనీల లాభాల కోసం టెండర్లు | కార్మికుల సంక్షేమ బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకునే కుట్ర

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలకు మంగళం

సెస్సు వసూలు, నిధి భద్రత గాలికి..



టెండర్లను రద్దు చేయాలని కోరుతూ 23న కార్మిక సంక్షేమ శాఖ ఎదుట ధర్నా : సీఐటీయూ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఉనికే ప్రశ్నార్థకం కానుంది. కార్మికులు, వారి సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వెల్ఫేర్ బోర్డు నిర్వహణ బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకోచూస్తున్నది. బోర్డు అధికారాల్ని తగ్గించి ప్రయివేట్ కార్పొరేట్ కంపెనీలకు లాభాలు కట్టబెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయి. వెల్ఫేర్ బోర్డు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని నీరుగార్చేందుకు బీమా కంపెనీలకు ఆ బాధ్యతను అప్పజెప్పాలని టెండర్లకు సిద్ధమయ్యారు. ఇప్పటికే వెల్ఫేర్ బోర్డు ద్వారా అందాల్సిన పథకాలు, సౌకర్యాలు లేకుండా పోయాయి. కొద్దిపాటి ప్రమాద, సహజ మరణ, వికలత్వానికి అందుతున్న ఆర్థిక సాయాన్ని కూడా లేకుండా చేయాలని చూస్తున్నారు. టెండర్లు పిలవడాన్ని సీఐటీయూ, ఇతర కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

1996లో అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో తీసుకొచ్చిన భవన, ఇతర నిర్మాణ కార్మికుల చట్టంలోని సెక్షన్ 18 కింద ఉన్న భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును.. తెలంగాణ ఏర్పడిన అనంతరం 2014 సెప్టెంబర్ 17 నుంచి వెల్ఫేర్ బోర్డుగా మార్పుచేశారు. వెల్ఫేర్ బోర్డు అనేది కార్మికుల ప్రతినిధులు, యజమాన్య ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో కూడిన త్రైపాక్షిక సంస్థ. ఈ సంస్థ కార్మిక శాఖ ద్వారా బోర్డులో నమోదైన సభ్యుల కుటుంబాలకు వివిధ రకాల సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్నారు.

పదేండ్లలో కార్మికులకు ఆర్థిక సాయం అరకొరే

వెల్ఫేర్ బోర్డు ఏర్పడిన ఈ పదేండ్ల కాలంలో కార్మిక కుటుంబాలకు అందిన ఆర్థిక సహాయం అరకొరే అని చెప్పాలి. 2014 నుంచి 2024 జులై చివరి నాటి రాష్ట్ర వ్యాప్తంగా 57,113 మంది భవన, ఇతర నిర్మాణ కార్మికులు చనిపోయారు. ఐదు లక్షలకు పైగా అంగ వైకల్యం చెందిన వాళ్లు ఉన్నా ప్రభుత్వ వైద్యులు ధృవీకరించకపోవడం వల్ల కేవలం 627 మంది మాత్రమే బోర్డు ద్వారా శాశ్వత, పాక్షిక వికలాంగులుగా ఆర్థిక సహాయం పొందారు. ఇప్పటివరకు రూ.771.14 కోట్ల మేరకు కార్మికుల కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందింది. వెల్ఫేర్ బోర్డులో 25.72 లక్షల మంది కార్మికులు ...13లో..

దోపిడీ కోసమే

కార్మికుల సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసి బడా బీమా కంపెనీలకు లాభాలు తెచ్చి పెట్టాలని మోడీ ప్రభుత్వం గతంలోనే మిషన్‌మోడ్ పథకం పేరిట ప్రయత్నించింది. తాజాగా కేంద్రం మార్గదర్శకంలో రాష్ట్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు అమలు చేసే పథకాల్ని బీమా కంపెనీలకు అప్పజెప్పాలని చూస్తున్నది. ఇటీవల టెండర్లు కూడా పిలిచారు. ఐఆర్‌డీఏ నిబంధన ప్రకారం ప్రభుత్వ, ప్రయివేట్ బీమా కంపెనీలు టెండర్లలో పాల్గొనే అవకాశముంది. ప్రస్తుతం బోర్డులో 15.9 లక్షల మంది కార్మికులు నమోదై ఉన్నారు. వీరు సగటున ఏటా రూ.450 కోట్ల వరకు ప్రీమియం చెల్లిస్తారు. ప్రీమియం ...13లో..



నువ్వా..నేనా..!

కీలకాంశాలపై కమలా హారిస్, ట్రంప్‌ల మధ్య ఘర్షణ

వ్యక్తిగత దాడులకూ వెనుకాడని నేతలు

వివరాలు 3లో..



కొనసాగుతున్న చికిత్స

నిలకడగా ఉన్నా.. విషమంగానే

ఏచూరి ఆరోగ్యం : ఎయిమ్స్

వివరాలు 3లో..

ఆరోపణలపై నోరు విప్పరే



మాధబిని ప్రశ్నించిన హిండెన్ బర్గ్

వివరాలు 13లో..



మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు, ఎండీ జహంగీర్



బునాదిగాని కాల్వ నిర్మాణంపై నిర్లక్ష్యం వీడాలి

నిధుల మంజూరుకు స్థానిక ఎమ్మెల్యేలు చొరవ చూపాలి

గోదావరి జలాల కోసం డీపీఆర్ రూపొందించాలి:

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

యాదాద్రి కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

ఎనిమిది మండలాలకు ఉపయోగపడే బునాదిగాని కాల్వ నిర్మాణంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని, నిధుల మంజూరు కోసం స్థానిక ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవ చూపాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు కోరారు. బునాదిగాని కాలువ నిధుల మంజూరు కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన రెండ్రోజుల బైక్ ర్యాలీ ముగింపు సందర్భంగా యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూ.. భువనగిరి జిల్లాకు ఆధారంగా ఉన్న చిన్న నీటి వనరులపై చేపట్టిన బునాదిగాని కాలువ నిర్మాణంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. దశాబ్దాలు గడుస్తున్నా పాలకుల మాటలు తప్ప చేతలు లేవన్నారు. 2006లో ప్రారంభమైన కాలువ పనులు.. ఇప్పటికీ పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీబీనగర్ మండలం మక్తానంతారం నుంచి వలిగొండ మండలం పహిల్వాన్‌పురం గ్రామం మీదుగా.. అడ్డగూడూరు మండలం ధర్మారం వరకు 98 కిలోమీటర్లు కాలువ పూర్తి చేయాల్సి ఉందన్నారు. కానీ, 18 సంవత్సరాల్లో 34 కిలోమీటర్లు మాత్రమే పూర్తి చేశారని, ఇప్పటివరకు రూ.34 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని అన్నారు. కాలువ నిర్మాణానికి మొత్తం రూ.269 కోట్ల ప్రతిపాదనలను అధికారులు పంపినా ప్రభుత్వం నేటికీ బడ్జెట్ ప్రకటించలేదని తెలిపారు. వెంటనే నిధుల విడుదల కోసం భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, కాల్వ పూర్తి కోసం చొరవ చూపాలని కోరారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి. జహంగీర్ మాట్లాడుతూ.. మూసీ కాలుష్యాన్ని నిర్మూలించడానికి అవకాశం ఉందన్నారు. శామీర్‌పేట చెరువు నుంచి గోదావరి జలాలను వడపర్తి కత్వ వద్ద ఎడమ కాలువ ద్వారా తీసుకురావాలని కోరారు. అదేవిధంగా, కాళేశ్వరం కాలువకు తూము ఏర్పాటు చేసి పహిల్వాన్‌పురం, బునాదిగాని చెరువు నింపడం ...13లో..

పంట పొలాల్లో ఇసుక మేటలు

వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందాల పర్యటన | ఆదుకోవాలని రైతుల వేడుకోలు

- వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఫొటో ఎగ్జిబిషన్
- ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో పర్యటన
- క్షేత్రస్థాయిలో పరిశీలన



నవతెలంగాణ -కూసుమంచి/ ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం/మరిపెడ

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, వరదలకు ఖమ్మం జిల్లా కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మంరూరల్ మండ లాలు, మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. బుధవారం కేంద్రం నుంచి ఆరుగురు సభ్య లతో కూడిన రెండు బృందాలు ఈ మండ లాల్లో పర్యటించాయి. గ్రామాల్లో ఇసుక మేటలు, మట్టితో నిండిన పొలాలు, ...5లో..

వరద నష్టం ప్రాథమిక అంచనా

రూ.5,438 కోట్లు

కేంద్ర బృందానికి విన్నవించిన సీఎస్ శాంతి కుమారి

వివరాలు 13లో



ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2 పోస్టుల భర్తీ

1,284 పోస్టులకు ఎంహెచ్ఎస్ఆర్బీ నోటిఫికేషన్ విడుదల

వివరాలు 13లో..

దేశంలో ప్రజాస్వామ్యం దెబ్బతింది

ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది

ఎన్నికల ఫలితాలు దానికి జీవం పోశాయి

చిల్లిగవ్వ లేకుండానే బరిలో దిగాము

రాజ్యాంగాన్ని మోడీ ధ్వంసం చేశారు

వాషింగ్టన్‌లో పాత్రికేయులతో రాహుల్



వివరాలు 3లో..

పేదవిద్యార్థులకు కార్పొరేట్ విద్య

విద్యపై ఖర్చు దేశ భవిష్యత్తుకు పెట్టుబడి : ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



విద్యపై ఖర్చుపెట్టే ప్రతిపైసా దేశ భవిష్యత్తుకు పెట్టుబడి అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. తమ ప్రజా ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదని చెప్పారు. ప్రతి పేద విద్యార్థికీ కార్పొరేట్ స్థాయిలో అత్యున్నతస్థాయిలో విద్యను అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని మరోమారు స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాల యంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షి యల్ స్కూల్స్, స్కిల్ యూని వర్సిటీ భవన నమూ నాలను ఆయన పరిశీలిం చారు. ప్రతి నియోజకవర్గంలో ఇంట 'గ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి అనుగుణంగా స్థల సేకరణ అంశంపై అధికారుల వద్ద ఆరా తీశారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షిల్ స్కూల్స్ ద్వారా రాష్ట్రంలోని దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలతో పాటు ప్రతి పేద విద్యార్థికి అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందిం చేందుకు ప్రజాప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. కేవలం విద్యతోనే జీవన ప్రమాణాలు పెరుగుతాయని అన్నారు. సమీక్షా సమావేశంలో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఎస్సీ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి, ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ శరత్, గురుకులం కార్యదర్శి సైదులు, ఐఏఎస్ సీతాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా హైస్పీడ్

పైరవీలు, ఒత్తిళ్లు బేఖాతర్

262 అక్రమ నిర్మాణాల కూల్చివేత



వివరాలు 5లో

మండలిలో ప్రతిపక్ష నేతగా మధుసూదనాచారి



వీర తెలంగాణ పోరాటం..

యువతకు ఆదర్శం

శౌర్యయాత్రలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ప్రజానాట్యమండలి శౌర్యయాత్ర మంగళవారం రాత్రి జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయనతో పాటు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ ...3లో..

చరిత్రను వక్రీకరిస్తే ప్రజలే బుద్ధి చెబుతారు

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్

ఇప్పగూడెం, జఫర్‌గఢ్‌లో జరిగిన సభల్లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ.. ఏ స్వార్థం లేకుండా పేద ప్రజల కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం, దున్నేవాడికే భూమి కావాలని పోరు చేసిన అమరులను గుర్తు చేసుకుని, వారి బాటలో పయనిస్తూ భూ పోరాటాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజలు వాస్తవ చరిత్రను తెలుసుకోవాలనే ప్రజానాట్య మండలి శౌర్యయాత్ర ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా కళారూపాల ప్రదర్శన చేపట్టినట్టు తెలిపారు. ఉద్యమాలకు పురుడు పోసిన గడ్డ ఈ ప్రాంతమని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఈ ప్రాంతం నుంచి అనేకమంది పేద ప్రజలు ప్రాణాలు అర్పించారన్నారు. ఈ పోరాట స్ఫూర్తితో నేటికీ కమ్యూనిస్టుల అండతో ప్రజలు అనేక ఉద్యమాలు చేస్తున్నారని అన్నారు. ఎప్పటికీ కమ్యూనిస్టు పార్టీ ప్రజల ...3లో..

సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ఫార్స్‌గా మార్చిందే మీరే

- మీ నిర్వాకంతోనే 34వ స్థానంలో తెలంగాణ విద్యారంగం :

కేటీఆర్ ట్వీట్ పట్ల సీతక్క ఆగ్రహం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ఫార్స్‌గా మార్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేననీ, ఆ ప్రభుత్వం నిర్వాకంతోనే తెలంగాణ విద్యారంగం 34వ స్థానంలో ఉందని మాజీ మంత్రి కేటీఆర్‌కు మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్ అబద్ధాలకు అంబాసిడర్‌గా మారారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో ఏనాడూ ప్రభుత్వ పాఠశాల పిల్లల ఆకలిని పట్టించుకోలేదని పేర్కొన్నారు. బడ్జెట్ కేటాయింపులు లేకుండానే ఎన్నికల లబ్ధి కోసం హడావుడిగా సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రవేశపెట్టి నయా పైసా ఖర్చు చేయలేదని విమర్శించారు. ఏజెన్సీలకు బీఆర్ఎస్ ప్రభుత్వం పడ్డ రూ.3.5 కోట్ల బాకీని ప్రజా ప్రభుత్వం చెల్లించిందని గుర్తుచేశారు. విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించి ఇప్పుడు ప్రేమ ఒలకపోయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ సిఫార్సు చేసిందని తెలిపారు. బ్రేక్ ఫాస్ట్ స్కీంను ప్రవేశ పెట్టాలని కేంద్రాన్ని కోరితే కేటీఆర్‌కు వచ్చిన అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రాల నుంచి పన్నులు, శిస్తుల రూపంలో కేంద్రానికి నిధులు వెళుతున్నప్పుడు, కేంద్రం నుంచి నిధులు అడిగితే మీకెందుకు ఉలికి పాటు అని నిలదీశారు.

ఎన్ఎంఎంఎస్ఎస్ దరఖాస్తు గడువు 25 వరకు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్ఎంఎంఎస్ఎస్)కు 2024-25 విద్యాసంవత్సరంలో ఎంపికైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 25వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (ఎన్ఎస్‌పీ) ద్వారా దరఖాస్తుల పునరుద్ధరణ, ఆన్‌లైన్‌లో దరఖాస్తులను అప్‌లోడ్ చేసే గడువు ఈనెల 25 వరకు ఉందని తెలిపారు. సకాలంలో దరఖాస్తు చేసేలా విద్యార్థులకు వివరించాలని సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలను కోరారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు http://bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు నేడు నోటిఫికేషన్ : టీజీపీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిపార్ట్‌మెంటల్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన నోటిఫికేషన్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) గురువారం విడుదల చేయనుంది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. దరఖాస్తుల సమర్పణకు తుది గడువు వచ్చేనెల 25 వరకు ఉందని పేర్కొన్నారు. పరీక్షల తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని వివరించారు. రాతపరీక్షలు హెచ్ఎండీఏ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

నేటినుంచి ఎడ్‌సెట్ రెండోవిడత కౌన్సెలింగ్

- షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఎడ్ కోర్సులో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎడ్‌సెట్ రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ఎడ్‌సెట్ ప్రవేశాల కన్వీనర్ పి రమేష్‌బాబు బుధవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈనెల 17 వరకు రిజిస్ట్రేషన్‌తోపాటు ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని తెలిపారు. అదేనెల 18న అర్హులైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని పేర్కొన్నారు. అదేనెల 19, 20 తేదీల్లో వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముందని వివరించారు. ఈనెల 25న ఎడ్‌సెట్ రెండో విడత సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఈనెల 26 నుంచి 30 వరకు కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు.

మెస్‌చార్జీల పెంపుకోసం23న చలో సంక్షేమ భవన్

- వాల్ పోస్టర్ ఆవిష్కరించిన కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లల్లో చదువుతున్న విద్యార్థుల మెస్ చార్జీలను రూ.2,500లకు పెంచాలనీ, డీఏహెచ్ హాస్టల్ విద్యార్థులకు ప్యాకెట్ మనీ రూ.2,500 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న చలో సంక్షేమ భవన్ కార్యక్రమాన్ని తలపెట్టామని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లి కేవీపీఎస్ రాష్ట్ర కార్యాలయం వద్ద చలో హైదరాబాద్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో నిరుపేద విద్యార్థులు అనేక సమస్యలతో ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారీగా పెరుగుతున్న నిత్యావసర ధరలు, కూరగాయల ధరల వల్ల ప్రస్తుతం ఇస్తున్న మెస్ చార్జీలు రూ.1,250 సరిపోవడం లేదన్నారు. దీంతో నాణ్యమైన ఆహారానికి నోచుకోవటం లేదని చెప్పారు. ధరల పెరుగుదలతో నాసిరకమైన భోజనం పెట్టడం వల్ల విద్యార్థులు పౌష్టికాహార లోపానికి గురవుతున్నారని అన్నారు. మెస్ చార్జీలను రూ.2,500, కాస్మోటిక్ చార్జీలను బాలికలకు రూ.500, బాలురకు రూ.300లకు పెంచాలని డిమాండ్ చేశారు. కళాశాల స్థాయి కలిగిన హాస్టల్ విద్యార్థులకు ప్యాకెట్ మనీ రూ.500 కేవలం నాలుగు నెలలు ఇచ్చారని గుర్తు చేశారు. ప్యాకెట్ మనీని రూ.2,500లకు పెంచాలని కోరారు. అరకొర సౌకర్యాలతో ఇరికిరుకు గదులతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు తక్షణమే సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకి మెడికల్ చెకప్‌లు నిర్వహించాలన్న నిబంధన ఉన్నప్పటికీ అది అమలుకు నోచుకోవటం లేదన్నారు. క్రీడా సామగ్రి చాలా హాస్టళ్లలో అందలేదని చెప్పారు. విద్యార్థులకు గ్రంథాలయాల ద్వారా సాహిత్యం కొనుగోలు చేసి ఇవ్వాలన్న నిబంధన ఉన్నా గైడు, టెస్ట్ పేపర్లు వంటివి అందుబాటులో ఉంచడం లేదని అన్నారు. హాస్టల్ విద్యార్థుల సమస్యలపై సామాజిక సంఘాలు, విద్యార్థి సంఘాలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న చేపట్టే చలో హైదరాబాద్ కార్యక్రమానికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తిప్పారపు సురేష్, ఎం ప్రకాష్ కరత్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం దశరథ్, నాయకులు రజనీకాంత్, పూజ, వినయ్ సాగర్, వినోద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

70 ఏండ్ల వృద్ధులకు ఆయుష్మాన్ భారత్

- రూ.3,435 కోట్ల వ్యయంతో 38,000కు పైగా ఈ-బస్సులు
- కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

70 ఏండ్ల వృద్ధులందరికీ ఆయుష్మాన్ భారత్ కింద వైద్యం అందించేందుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదించింది. దేశవ్యాప్తంగా 4.5 కోట్ల కుటుంబాల్లో 6 కోట్ల సీనియర్ సిటిజన్లకు లబ్ధి జరగనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఆయుష్మాన్ భారత్ కింద రూ.5 లక్షల వరకు వైద్య సాయం అందించనున్నట్టు పేర్కొంది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రి వర్గ సమావేశం జరిగింది. అనంతరం నేషనల్ మీడియా సెంటర్ (ఎన్ఎంసి)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీల ద్వారా ఈ-బస్సుల సేకరణ, నిర్వహణకు పీఎం-ఈ బస్ సేవా -చెల్లింపు భద్రతా యంత్రాంగం (పీఎస్ఎం) స్కీమ్‌ను మంత్రివర్గం ఆమోదించిందని తెలిపారు. రూ.3,435 కోట్ల వ్యయంతో 38,000కుపైగా ఈ-బస్సులను అందుబాటులోకి తేనున్నారు. కాలుష్యాన్ని తగ్గించడంలో, పర్యావరణ పరిరక్షణలో మైలురాయిగా నిలుస్తుందని తెలుపారు. హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల కోసం మౌలిక సదుపాయాలను ప్రారంభించే ఖర్చు కోసం బడ్జెట్ మద్దతు పథకాన్ని సవరించడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదించిందని అన్నారు. 2024-25 నుంచి 2031-32 వరకు రూ.12,461 కోట్ల వ్యయం చేయనున్నట్టు తెలిపారు. 31,359 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యమని చెప్పారు. రెండేండ్లలో రూ.2,000 కోట్లతో మరింత వాతావరణ అనుకూలమైన, వాతావరణ-స్మార్ట్ భారత్‌ను రూపొందించడానికి 'మిషన్ మౌసం'కు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. తీవ్ర వాతావరణ సంఘటనలు, వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కోవడంలో మిషన్ అదనపు అంచును పెంచుతుందని అన్నారు. ఆధునిక సెన్సార్లు, అధిక-పనితీరు గల సూపర్ కంప్యూటర్లతో తదుపరి తరం రాడార్లు, ఉపగ్రహ వ్యవస్థలు చేర్చబడతాయని తెలిపారు. 2024-25 నుంచి 2028-29 వరకు ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన (పీఎంజీఎస్ వై-క్మీఎ) అమలుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఈ పథకానికి రూ.70,125 కోట్లు ఖర్చు చేయనున్నట్టు తెలిపారు. 25,000 అనుసంధానం లేని ఆవాసాలు, కొత్త కనెక్టివిటీ రోడ్లపై వంతెనల నిర్మాణం, అప్‌గ్రేడేషన్ చేయనున్నామని అన్నారు.

రెండేండ్ల వ్యవధిలో రూ.10,900 కోట్లతో ఇన్నోవేటివ్ వెహికల్ ఎన్‌హాన్స్‌మెంట్ (పీఎం ఈ-డ్రైవ్) పథకంలో పీఎం ఎలక్ట్రిక్ డ్రైవ్ విప్లవాన్ని క్యాబినెట్ ఆమోదించినట్టు తెలిపారు. స్కీమ్ ఇప్పుడు ఇ-వోచర్‌లను కలిగి ఉందని, ఈవీ కొనుగోలు ప్రక్రియను గతంలో కంటే సులభంగా క్రమబద్ధీకరిస్తుందని పేర్కొన్నారు. ఈ పథకం ఎలక్ట్రిక్ అంబులెన్స్‌లకు మార్గం సుగమం చేస్తుందని, ఆరోగ్య రంగంలో ఈవీలను ఏకీకృతం చేసే దిశగా కీలక అడుగు అన్నారు. పచ్చని ఆరోగ్య సంరక్షణ పరిష్కారాల కోసం ముఖ్యమైన ఎత్తుగడని, పాత ట్రక్కును స్క్రాప్ చేసిన తరువాత ఈ-ట్రక్కును కొనుగోలు చేయడానికి అదనపు ప్రోత్సాహకాలు ఇస్తామని అన్నారు. టెస్టింగ్ ఏజెన్సీల అభివృద్ధికి రూ.780 కోట్ల నిధులతో వాహన పరీక్ష మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ఈ పథకం లక్ష్యమని అన్నారు. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల కదలికను మెరుగుపరుస్తుందని తెలిపారు.

సాయుధ పోరాటాన్ని అధికారికంగా జరపాలి

- హైదరాబాద్‌లో స్మారక చిహ్నం నిర్మించాలి : సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- ఎంఐఎంకు ప్రభుత్వాలు భయపడుతున్నాయని వ్యాఖ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ డిమాండ్ చేశారు. ఆ చరిత్రను భావితరాలకు అందించేందుకు హైదరాబాద్‌లో స్మారక చిహ్నం నిర్మించాలని కోరారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమై 76 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాటయోధులకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ట్రస్ట్ అధ్యక్షులు కందిమళ్ల ప్రతాపరెడ్డి ఈ సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఎంఐఎంకు భయపడి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వాలు జంకుతున్నాయని విమర్శించారు. తాను ఎవరికీ భయపడనంటున్న సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 17న తెలంగాణ విలీనం దినోత్సవ వేడుకలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సాయుధ పోరాటంతో ఎలాంటి సంబంధం లేని బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులు చరిత్రను పూర్తిగా వక్రీకరిస్తున్నాయని విమర్శించారు. ఎవరికో భయపడి ప్రభుత్వం విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించపోతే అది రాజకీయంగా కాంగ్రెస్‌కు నష్టమని అన్నారు. మీడియా అకాడమి చైర్మెన్ కె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టులంతా ఏకం కావాలనే తపన దేశంలోని అన్ని వర్గాల ప్రజల్లో నిత్యం పెరుగుతోందన్నారు. వారి ఆకాంక్షలను నెరవేర్చిన నాడే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులకు ఘన నివాళి అర్పించినవారమవుతామని అన్నారు. ఇప్పటికైనా కమ్యూనిస్టులంతా ఏకం కావాలని ఆయన ఆకాంక్షించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం జరిగి ఉండకపోతే హైదరాబాద్ సంస్థానం మరో పాకిస్తాన్ అయ్యేదన్నారు. నాటి నిరంకుశ నిజాం రాజు అరాచక పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాటం చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ బాలమల్లేష్, కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ సభ్యులు ఉజ్జిని రత్నాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావుతోపాటు సీపీఐ నాయకులు, వివిధ ప్రజాసంఘాల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధులు బత్తిని యాదగిరి, కందిమళ్ల ప్రతాపరెడ్డిలను ఘనంగా సన్మానించారు.

ఆకట్టుకున్న ప్రజానాట్యమండలి ఆట, పాట, మాట

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా ప్రజానాట్యమండలి ఆధర్యంలో నిర్వహించిన కళాకారుల ఆట, పాట, మాట ఆకట్టుకుంది. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులను స్మరిస్తూ ఆలపించిన గీతాలు ఉత్తేజాన్ని నింపాయి. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా నేతృత్వంలో వివిధ కళాకారులు తమ ఆట పాటలతో సభను హోరెత్తించారు.

నేడు తిరువనంతపురంలో రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశం

- హాజరుకానున్న డిప్యూటీ సీఎం భట్టి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదహారో ఆర్థిక సంఘం వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తున్న నేపథ్యంలో కేరళ ప్రభుత్వం గురువారం ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనుంది. ఆ రాష్ట్ర ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో తిరువనంతపురంలో జరిగే ఈ సమావేశానికి వివిధ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు హాజరుకానున్నారు. అందులో పాల్గొనేందుకు వీలుగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం రాత్రే కేరళకు బయల్దేరి వెళ్లారు.

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రారంభించే ఈ సమావేశంలో తమిళనాడు, కర్నాటక, పంజాబ్ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, ఆయా రాష్ట్రాల ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శులు, పలువురు ఆర్థికవేత్తలు, ఆ రంగానికి చెందిన నిపుణులు పాల్గొంటారు. సహకార సమాఖ్య వ్యవస్థ బలోపేతానికి రాష్ట్రాలు అనుసరించాల్సిన వ్యూహాలపై వారు కూలంకుషంగా చర్చిస్తారు.

రామప్ప ఘనతను ప్రపంచ దేశాలకు చాటేలా అభివృద్ధి

- పనులను త్వరగా పూర్తి చేయాలి
- ఏ సమస్య వచ్చినా సంప్రదించండి : సమీక్ష సమావేశంలో మంత్రి డాక్టర్ సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) అధికారులను ఆదేశించారు. యునెస్కో ప్రమాణాలకు అనుగుణంగా పనులను పూర్తి చేయాలని సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి సీతక్క అధ్యక్షతన ప్రపంచ వారసత్వ సంపద రామప్ప దేవాలయం రాష్ట్ర స్థాయి మేనేజ్‌మెంట్ కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. అందులో యువజన, సాంస్కృతిక, టూరిజం శాఖ కార్యదర్శి వాణిప్రసాద్, టూరిజం కార్పొరేషన్ ఎమ్‌డీ ప్రకాశ్‌రెడ్డి, ములుగు కలెక్టర్ దివాకర్, పురావస్తు, దేవాదాయ శాఖ అధికారులు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ...గొప్ప చరిత్రతో అద్భుతమైన కళా సంపద రామప్ప దేవాలయం సొంతమన్నారు. అందుకే ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించిందని చెప్పారు. అన్ని శాఖలు సమన్వయంతో గడువులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో అలసత్వం వహిస్తే చరిత్ర, ప్రజలు క్షమించరని హెచ్చరించారు. రామప్ప చుట్టుపక్కల లక్నవరం, బొగత, సమ్మక్క సారలమ్మ దేవాలయం వంటి ఎన్నో చారిత్రక ప్రాంతాలు, అటవి సంపద, ప్రకృతి సౌందర్యం పుష్కలంగా ఉన్నందున టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలని ఆదేశించారు. పర్యాటకులు బసచేసేందుకు వీలుగా టూరిజం కార్పొరేషన్ అన్ని హంగులతో హోటళ్లను నిర్మించాలని సూచించారు. రామప్ప చుట్టుపక్కల సహజత్వాన్ని కాపాడుకుంటూనే అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. రామప్ప వారసత్వ సంపద గొప్పతనాన్ని భవిష్యత్ తరాలకు ప్రపంచ దేశాలకు చాటి చెప్పే యజ్ఞం లో అన్ని శాఖలు భాగస్వామ్యం కావాలని సూచించారు. రామప్ప అభివృద్ధి విషయంలో ఏ చిన్న సమస్య వచ్చినా తనను సంప్రదించాలని అధికారులకు సూచించారు.

రామప్ప చెరువు, దేవాలయానికి ఆటంకం కలిగించే మైనింగ్, ఇతర పనులకు అనుమతులు ఇవ్వబోమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.



దేశంలో ప్రజాస్వామ్యం దెబ్బతింది

వాషింగ్టన్‌లో పాత్రికేయులతో రాహుల్

వాషింగ్టన్ : గడచిన పది సంవత్సరాలుగా దేశంలో ప్రజాస్వామ్యం దెబ్బతిన్నదని, ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. వాషింగ్టన్‌లోని నేషనల్ ప్రెస్ క్లబ్‌లో ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. 'మహారాష్ట్రలో మా ప్రభుత్వాన్ని లాక్కున్నారు. మా నుండి ప్రభుత్వాన్ని లాక్కోవడాన్ని నా కళ్లతో చూశాను. మా శాసనసభ్యులను కొనుగోలు చేశారు. బంధించారు. అకస్మాత్తుగా వారు బీజేపీ శాసనసభ్యులు అయ్యారు. ఇదంతా నేను చూశాను. అందుకే భారత ప్రజాస్వామ్యం దాడికి గురైంది. చాలా బలహీనమై పోయింది. ఇప్పుడిప్పుడే పుంజుకుం టోంది. తిరిగి పూర్వ స్థితికి చేరుకుంటుందన్న నమ్మకం నాకు ఉంది' అని ఆయన చెప్పారు.

భారత్‌లో ఎన్నికల ఫలితాలు ప్రజాస్వామ్యానికి మరింత జీవం పోశాయని మీరు భావించడం లేదా అని రాహుల్ పాత్రికేయులను ప్రశ్నించారు. 'నేను మాత్రం అలాగే అనుకుంటున్నాను. అయితే భారతీయ ఓటరు కష్టాల నుండి బయటపడ్డాడని చెప్పడానికి ఇది చాలదు' అని అన్నారు. 'మా బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేశారు. చేతిలో చిల్లిగవ్వ లేకుండానే ఎన్నికల బరిలో దిగాము. ఏ ప్రజాస్వామ్య వ్యవస్థలో అయినా ఇలా జరుగుతుందని నేను అనుకోను. కానీ ఎన్నికల సమయంలో అక్షరాలా అదే జరిగింది. మా కోశాధికారిని అడిగితే డబ్బు లేదని చెప్పారు. మా ఓటరు అప్పటికే చేదు అనుభవాలు, కష్టాలను చవిచూశాడు. మేమేమో ప్రచారం చేసుకోవాల్సిన పరిస్థితి. సంప్రదింపులు జరపాల్సి ఉంది. సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. వీటన్నింటికీ నిధులు అవసరం కదా' అని తెలిపారు.

తనపై 20కి పైగా కేసులు పెట్టారని రాహుల్ గుర్తు చేసుకున్నారు. 'భారత చరిత్రలో పరువు నష్టం కేసులో జైలు శిక్ష పడిన ఏకైక వ్యక్తిని నేనే. మా దేశంలో ఓ ముఖ్యమంత్రి ఇప్పటికీ జైలులోనే ఉన్నారు. ఎన్నో కష్టాలు చవిచూసిన భారతీయ ఓటరు ఓ శిలగా మారిపోయాడు. నిజంగా...అలాగే నిలిచాడు. అయితే దానికి జీవం పోసేందుకు ఓ శిల్పి అవసరం. కానీ లేడు' అని వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోడీపై ఆయన విమర్శలు సంధిస్తూ '21వ శతాబ్దంలో ఆధునిక దేశంలో ఉన్న ఓ ప్రధానమంత్రి తాను దేవుడితో మాట్లాడానని ప్రజలకు చెబుతాడు. అందరి కంటే తాను భిన్నమైన వ్యక్తినని అంటాడు. మీరు జీవులని, తాను కానని చెబుతుంటాడు. తనకు దేవుడితో నేరుగా సంబంధాలు ఉన్నాయని అంటుంటాడు. అయితే ఆయన అట ముగిసిందని మేము అనుకుంటాము. మాకు పరాజయం పాలైన ప్రధాని ఉన్నాడని తెలుసు' అని ఎత్తిపొడిచారు.

'ఆయన చేసిన అద్భుతమైన పని ఏమిటంటే లోక్‌సభలో ప్రవేశించి, ప్రమాణస్వీకారం చేయడం. భారత రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని, తలపై ఉంచుకోవడం. ఇది చాలా ఆసక్తికరమైన పరస్పర విరుద్ధ స్వభావం. ఓ వైపు ఆయన రాజ్యాంగాన్ని ధ్వంసం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి చేశారు. ప్రజలేమో అదే రాజ్యాంగాన్ని తలపై పెట్టుకునేలా చేశారు' అని మోడీపై రాహుల్ వ్యంగ్యోక్తులు విసిరారు.

రిజర్వేషన్లపై తన వ్యాఖ్యలను కొందరు వక్రీకరించారని కాంగ్రెస్ నేత వివరణ ఇచ్చారు. 'నేను మీకు స్పష్టంగా చెబుతున్నాను. నేను రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదు. మేము రిజర్వేషన్ల పరిమితిని పెంచుతాము. యాభై శాతానికి పైగా రిజర్వేషన్లు ఇస్తాము' అని చెప్పారు. ప్రజలందరికీ భాగస్వామ్యం కల్పించే విషయంలో తీవ్రమైన సమస్య ఉన్నదని, తాము దానిని పరిష్కరిస్తామని తెలిపారు. 'ఇది మండల్ వర్సెస్ కమండల్ వ్యవహారంగా నేను భావించడం లేదు. కేవలం రిజర్వేషన్లు మాత్రమే సమస్యకు పరిష్కారం అనే ఆలోచనకు భిన్నమైన దానిని మేము చెబుతున్నాము. అసలు ఏం జరుగుతోంది అనే దానిపై సమగ్ర అవగాహన ఏర్పరచుకోవాలని మేము అనుకుంటున్నాము. ఆ తర్వాత లోపాలను సరిదిద్దేందుకు అనేక విధానాలు అమలు చేస్తాము. వాటిలో రిజర్వేషన్లు ఒకటి' అని రాహుల్ వివరించారు.

ఎన్ఆర్ఐలకు మోడీ షాక్

చిన్న మొత్తాల మదుపుదారులపైనా ఆంక్షలు

- స్టాక్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులకు ఊతం
- పీపీఎఫ్ పథకంలో కీలక మార్పులు
- అక్టోబర్ 1 నుంచి అమలు

నిన్న మొన్నటి వరకూ ఎన్ఆర్ఐలపై అపరిమిత ప్రేమ కురిపించిన ప్రధాని నరేంద్ర మోడీ ఎందుకో అకస్మాత్తుగా యూటర్న్ తీసుకున్నారు. అధిక వడ్డీని అందించే పీపీఎఫ్ ఖాతాలలో పెట్టుబడులు పెట్టకుండా వారిని నిరుత్సాహ పరిచారు. నూతన విధానం ద్వారా వారి పెట్టుబడులు అస్థిరమైన స్టాక్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్స్ వైపు మళ్లేలా చేశారు. ప్రభుత్వ నిర్ణయం ఎన్ఆర్ఐలకే కాదు... చిన్న మొత్తాల మదుపరులకు కూడా అశనిపాతంలా మారింది. అక్టోబర్ 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చే నూతన పీపీఎఫ్ విధానం ఎన్ఆర్ఐల పెట్టుబడులపై ఆంక్షలు విధిస్తోంది. ఇకపై వారు పీపీఎఫ్ ఖాతాలలో పెట్టుబడులు పెట్టినా రూపాయి కూడా వడ్డీ రాదు. చిన్నారుల భవిష్యత్తు కోసం మధ్య తరగతి ప్రజలు ప్రారంభిస్తున్న డీ ఫ్యాక్టో ఖాతాలకు సైతం ప్రభుత్వం మంగళం పాడబోతోంది.



న్యూఢిల్లీ : గత పది సంవత్సరాలుగా నరేంద్ర మోడీ ప్రభుత్వం హిందూ జాతీయతావాదం ఆధారంగా ఓ విధమైన డయాస్పోరా దౌత్యాన్ని పాటిస్తోంది. డయాస్పోరాలు అంటే ఇతర దేశాలలో నివసిస్తున్న భారతీయులు. ఈ విధానం సహజంగానే భారత సంతతికి చెందిన విదేశీయులను (ఎన్ఆర్ఐలు) ఆకట్టుకుంటోంది. అయితే అనూహ్యమైన విషయమేమంటే తనను ఎంతో అమితంగా అభిమానించే ఎన్ఆర్ఐల ప్రయోజనాలను దెబ్బతీసేలా మోడీ నూతన పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) విధానాన్ని తీసుకొచ్చారు. ఎన్ఆర్ఐలు ఇప్పటి వరకూ మన దేశంలో దీర్ఘకాలిక చిన్న మొత్తాల పథకాలలోనూ, పీపీఎఫ్ ఖాతాలలోనూ పెట్టుబడులు పెడుతున్నారు. పీపీఎఫ్‌లో పెట్టుబడి పెడితే 7.1 శాతం వార్షిక వడ్డీ రేటు లభిస్తుంది. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానం కారణంగా వారు పీపీఎఫ్‌లో పెట్టుబడులకు స్వస్తి చెప్పి స్టాక్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్స్ వైపు మరలుతారు. అయితే వీటిలో పెట్టే పెట్టుబడులకు గ్యారంటీ ఉండదు. గ్యారంటీ రిటర్న్‌లను ఊహించడం కష్టం.

వడ్డీ రాని పెట్టుబడులు

కేంద్ర ప్రభుత్వం 1979 జనవరిలో దేశంలోని అన్ని ప్రధాన పోస్టాఫీసుల్లో పీపీఎఫ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పోలిస్తే ఇందులో అధిక వడ్డీ రావడమే కాకుండా దానికి ఆదాయపన్ను మినహాయింపు కూడా ఉంటుంది. అందుకే ఈ పథకం బహుళ ప్రాచుర్యం పొందింది. అయితే మోడీ ప్రభుత్వం తాజాగా ఈ పథకం నిబంధనలను సవరించింది. దీని ప్రకారం 2024 అక్టోబర్ 1వ తేదీ నుండి ఎన్ఆర్ఐల పీపీఎఫ్ ఖాతాలకు ఒక్క రూపాయి కూడా వడ్డీ లభించదు. దీనికి సంబంధించి తపాలా శాఖకు చెందిన ఫైనాన్షియల్ సర్వీసుల విభాగం గత నెల 21న ఆదేశాలు జారీ చేసింది. ఇది కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో ఉంటుంది. దానికి ఫిరాయింపుదారుడైన జ్యోతిరాదిత్య సింధియా అధిపతి.

మైనారిటీ తీరిన తర్వాతే...

పీపీఎఫ్ పథకం అందిస్తున్న గ్యారంటీ ఫిక్స్‌డ్ రిటర్న్‌ల నుండి స్టాక్ మార్కెట్లకు, మ్యూచువల్ ఫండ్స్‌కు ఎన్ఆర్ఐ పెట్టుబడులను మళ్లించేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నదని అర్థమవుతోంది. ఈక్విటీ వాటాలు, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెడితే వచ్చే ఆదాయం పీపీఎఫ్ ఖాతాలో పెట్టే పెట్టుబడుల కంటే అధికంగానే ఉంటుంది. అయితే ఈక్విటీ వాటాలు అనేవి కార్పొరేట్ లాభాలు, అస్థిరమైన స్టాక్ మార్కెట్లపై ఆధారపడి ఉంటాయి. జాతీయ చిన్న మొత్తాల పొదుపు (ఎన్ఎస్‌ఎస్) పథకాలకు సంబంధించిన నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఖాతాలను నియంత్రించేందుకు ప్రభుత్వం పీపీఎఫ్ నిబంధనలను మార్చి పలు మార్గదర్శకాలను జారీ చేసింది. వీటి ప్రకారం మైనర్ పేరిట ఉన్న పీపీఎఫ్ ఖాతాలకు పోస్టాఫీసులోని ఇతర సాధారణ ఖాతాలకు వర్తించే వడ్డీయే లభిస్తుంది. అంటే నాలుగు శాతం వార్షిక వడ్డీ రేటు మాత్రమే అందుతుంది. మైనారిటీ తీరిన తర్వాత మాత్రమే కొత్తగా పీపీఎఫ్ ఖాతాలు ప్రారంభించి, తద్వారా అధిక వడ్డీ రేటు పొందవచ్చు. అంటే పీపీఎఫ్ ఖాతా ప్రారంభించాలంటే కనీసం 18 సంవత్సరాలు నిండి ఉండాలి.

ఎన్ఆర్ఐ ఖాతాలపై ఆంక్షలు

ఎన్ఆర్ఐలకు సంబంధించి పీపీఎఫ్ ఖాతాలలో పెట్టుబడుల విషయంలో గతంలో ఎలాంటి ఆంక్షలు ఉండేవి కావు. కొత్తగా పీపీఎఫ్ ఖాతాలు ప్రారంభించడం మాత్రం ఇకపై సాధ్యం కాదు. భారత పౌరులుగా ఉన్నంత వరకూ ఎన్ఆర్ఐలు తాము ప్రారంభించిన పీపీఎఫ్ ఖాతాలలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రస్తుతం అవకాశం ఉంది. ఎన్ఆర్ఐ హోదా పొందిన తర్వాత కూడా వారు ఖాతాలలో పెట్టుబడులు పెట్టవచ్చు. ఖాతాను ప్రారంభించిన పదిహేను సంవత్సరాల వరకూ వడ్డీ పొందవచ్చు. ఇప్పుడు మారిన నిబంధనల ప్రకారం అక్టోబర్ 1వ తేదీ నుండి పీపీఎఫ్ ఖాతాలపై ఎన్ఆర్ఐలకు వడ్డీ రాదు.

డీ ఫ్యాక్టో ఖాతాలకు మంగళం

తమ పిల్లల భవిష్యత్ ఆర్థిక అవసరాల కోసం అనేక మంది తల్లిదండ్రులు యాభై సంవత్సరాలుగా మైనర్ పేరిట డీ ఫ్యాక్టో ఖాతాలు తెరిచారు. నిర్దీత జీతం కానీ, ఆదాయ వనరులు కానీ లేని అనేక మధ్య తరగతి కుటుంబాలు గతంలో డీ ఫ్యాక్టో పీపీఎఫ్ ఖాతాలలో డిపాజిట్లు చేశారు. భవిష్యత్తులో తలెత్తే ఆర్థిక అస్థిరతల నుండి తమ పిల్లలకు రక్షణ లభిస్తుందని వారు ఆశించారు. అయితే ఇది ఇక ఎంతో కాలం సాధ్యపడదు. అనేక పీపీఎఫ్ ఖాతాలను కలిగి ఉండడాన్ని నూతన నిబంధనలు నిషేధిస్తున్నాయి. ఎవరైనా రెండు ఖాతాలను మాత్రమే ఎంచుకోవచ్చు. ఒకటి ప్రైమరీ ఖాతా. ఇందులో లక్షన్నర రూపాయల వరకూ డిపాజిట్ చేయవచ్చు. ఇది పీపీఎఫ్ ఖాతాలో పెట్టుబడికి వార్షిక పరిమితి. రెండవది సెకండరీ ఖాతా. దీని నుండి ప్రైమరీ ఖాతాకు నగదు బదిలీ చేసుకోవచ్చు. పీపీఎఫ్ ఖాతాలపై ప్రస్తుతం ఇస్తున్న వడ్డీ రేటే ప్రైమరీ ఖాతాలకూ వర్తిస్తుంది. సెకండరీ ఖాతాలోని బ్యాలెన్స్ మొత్తానికి వడ్డీ రాదు. అదే వ్యక్తి పేరిట ఉన్న ఇతర పీపీఎఫ్ ఖాతాలకు కూడా అవి ప్రారంభించిన తేదీ నుండి వడ్డీ లభించదు.

కారణం ఏమిటో ?

ప్రధానిగా మూడోసారి ఎన్నికైన నెలల వ్యవధిలోనే పీపీఎఫ్ ఖాతాలలో ఎన్ఆర్ఐ పెట్టుబడులపై మోడీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. డయాస్పోరాలను ఆకర్షించేందుకు మోడీ ప్రభుత్వం 2014 నుండి అనేక సామాజిక-సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించింది. ప్రవాసి భారతీయ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. విదేశాలలో నివసిస్తున్న ఎన్ఆర్ఐలకు మరిన్ని ఓవర్‌సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డులు జారీ చేశారు. 2015 మేలో బ్రిటన్ దినపత్రిక ది గార్డియన్‌తో ముచ్చటించిన బీజేపీ సిద్ధాంతవేత్త రాం మాధవ్ చెప్పిన మాటలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సి ఉంది. 'దౌత్య రూపాలను మారుస్తున్నాం. విదేశాలలో భారత ప్రయోజనాలను బలోపేతం చేసేందుకు నూతన మార్గాలను పరిశీలిస్తున్నాము. ఎన్ఆర్ఐలు ఆయా దేశాలకు విధేయులైన పౌరులే అయినప్పటికీ మన గొంతుకను వినిపిస్తున్నారు. అమెరికాలో ఇజ్రాయిల్ ప్రయోజనాలను యూదులు ఏ విధంగా కాపాడుతున్నారో ఇదీ అలాంటిదే'...ఇవి రాం మాధవ్ చెప్పిన మాటలు.

2014లో ప్రధానిగా ఎన్నికైన తర్వాత నరేంద్ర మోడీ న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో పెద్ద సంఖ్యలో హాజరైన ఎన్ఆర్ఐలను ఉద్దేశించి ప్రసంగిస్తూ వారిని పొగడ్తలతో ముంచెత్తారు. గత సంవత్సరం మేలో ఆస్ట్రేలియాలో పర్యటించినప్పుడు సిడ్నీలోని కుడోస్ బ్యాంక్ అరేనాలో జరిగిన కార్యక్రమంలో ప్రసంగించారు. అప్పుడు ఆయనను ఎన్ఆర్ఐలు 'రాక్ స్టార్'గా అభివర్ణించారు. మూడోసారి ప్రధానిగా ఎన్నికైన తర్వాత అమెరికాలో పర్యటించినప్పుడు వాషింగ్టన్ డీసీలో ఉన్న రొనాల్డ్ రీగన్ సెంటర్‌లో మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడంలో ఇండియన్-అమెరికన్ డయాస్పోరా నిర్వహించిన కీలక పాత్రను గుర్తు చేశారు. వీటన్నింటినీ చూస్తుంటే ప్రభుత్వ డయాస్పోరా దౌత్యంలో ఆకస్మికంగా వచ్చిన ఈ మార్పుకు కారణమేమిటో అంతుచిక్కడం లేదు.

తోషిబాలో 4వ సారి

బీఎంఎస్, ఐఎన్‌టీయూసీ కూటమిపై 404 ఓట్ల మెజార్టీతో గెలుపు

సీఐటీయూ విజయ దుందుభి

- కూటమిగా ఏర్పడినా.. విజయం ఎర్రజెండాదే : సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు, పరిశ్రమ కార్మిక సంఘం అధ్యక్షులు జే మల్లికార్జున్
- కార్మికులకు విజయం అంకితం



నవతెలంగాణ-పటాన్‌చెరు

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం శివారులో ఉన్న తోషిబా పరిశ్రమలో బుధవారం జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూ నాలుగోసారి విజయ దుందుభి మోగించింది. సీఐటీయూ తరఫున ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, పరిశ్రమ గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షులు మల్లికార్జున్ బరిలో నిలవగా.. బీఎంఎస్, ఐఎన్టీయూసీ కూటమిగా ఏర్పడి ఎన్నికల బరిలో దిగాయి. పరిశ్రమలో మొత్తం 1143 ఓట్లకు గాను అన్ని ఓట్లు పోలయ్యాయి. అందులో 21 ఓట్లు చెల్లలేదు. కాగా మిగిలిన ఓట్లలో ఐఎన్‌టీయూసీకి 359 ఓట్లు, సీఐటీయూకు 763 ఓట్లు వచ్చాయి. దాంతో ఐఎన్‌టీయూసీపై సీఐటీయూ అధ్యక్షులు మల్లికార్జున్ 404 ఓట్ల మెజార్టీతో భారీ విజయం సాధించారు. ఈ సందర్భంగా పరిశ్రమలో కార్మికులు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పటాన్‌చెరు పట్టణంలో కార్మికులు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకొని సంబురాలు చేసుకున్నారు. అనంతరం మల్లికార్జున్ మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఐటీయూ ఎర్రజెండాను భారీ మెజార్టీతో గెలిపించిన తోషిబా కార్మికులకు ఈ విజయాన్ని అంకితం చేస్తున్నట్టు చెప్పారు. కార్మికులకు ఇచ్చిన హామీలన్నిటిని రాబోయే రోజుల్లో నెరవేర్చే విధంగా కృషి చేస్తామన్నారు. ఎన్ని యూనియన్లు కూటములుగా ఏర్పడినా.. ఎన్ని ఎత్తులు పన్నినా కార్మికుల విజయం ముందు బోసిపోయాయన్నారు. సీఐటీయూను నాలుగోసారి భారీ మెజారిటీతో గెలిపించిన కార్మికులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు రాజయ్య, యూనియన్ ప్రధాన కార్యదర్శి అనంతరావు, నాయకులు, తిరుపతి, శ్రీధర్, శ్రీనివాస్ రెడ్డి, భారీ సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన పవన్ కళ్యాణ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో బుధవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో భేటీ అయ్యారు. వరదలు, తాజా రాజకీయ పరిస్థితులపై భేటీలో చర్చించినట్టు సమాచారం. ఈ సందర్భంగా వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి పవన్ రూ. కోటి విరాళాన్ని రేవంత్‌కు అందించారు.

తెలంగాణ, ఏపీలో వరద నష్టం పట్ల

అమిత్ షాకు నివేదిక

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడి



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ, ఏపీలో భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టంపై రూపొందించిన ప్రాథమిక నివేదికను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు అందజేసినట్టు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ఈ విషయాన్ని బుధవారం ఆయన వెల్లడించారు. వర్షాలు, వరదలతో రెండు తెలుగు రాష్ట్రాల్లో నీట మునిగిన ప్రాంతాలను శివరాజ్‌సింగ్ ఇటీవల పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా స్థానికంగా జరిగిన నష్టంపై రూపొందించిన ఆ నివేదికను హోం మంత్రి అమిత్ షాను కలిసి అందజేశారు. త్వరలోనే కేంద్ర బృందాలు ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి నష్టాన్ని అంచనా వేయనున్నాయని పేర్కొన్నారు. మరోవైపు తెలంగాణలో వరద నష్టంపై సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రుల బృందం గురువారం కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసి వివరించనుంది. ఈ విపత్కర పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రానికి భారీగా ఆర్థిక సాయం అందించాలని కోరనున్నట్టు సమాచారం.

కొనసాగుతున్న చికిత్స

నిలకడగా ఉన్నా.. విషమంగానే ఏచూరి ఆరోగ్యం : ఎయిమ్స్

న్యూఢిల్లీ : సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోగ్యం విషమంగానే వున్నా నిలకడగా వుందని ఎయిమ్స్ ఆస్పత్రి సంబంధికులు తెలిపారు. ప్రస్తుతం ఆయనకు ఐసీయూలోనే చికిత్స కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్య బృందం ఆయన పరిస్థితిని నిరంతరాయంగా పర్యవేక్షిస్తోందని తెలిపారు. ఎయిమ్స్‌లో ఏచూరి తీవ్రమైన శ్వాసకోశ సంబంధిత ఇన్ఫెక్షన్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్నారని సీపీఐ(ఎం) మంగళవారం తెలిపిన సంగతి విదితమే. న్యుమోనియా తరహాలో ఛాతిలో ఇన్ఫెక్షన్ రావడంతో ఆగస్టు 19న ఆయన ఎయిమ్స్‌లో చేరారు.

28న జాతీయ లోక్‌అదాలత్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ నెల 28న రాష్ట్ర వ్యాప్తంగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ సభ్య కార్యదర్శి సీహెచ్ పంచాక్షరి తెలిపారు. ఈ మేరకు బుధవారం హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర లీగల్ సెల్ ఎగ్జిక్యూటివ్ చైర్మెన్ జస్టిస్ సుజోయ్‌పాల్ అధ్యక్షతన వర్చువల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా జిల్లాల్లోని జిల్లా న్యాయ సేవా సంస్థల సభ్యులు దీనిలో పాల్గొన్నారు. జాతీయ లోక్ అదాలత్ షెడ్యూల్‌లో భాగంగా రాష్ట్రంలో ఈనెల 28న ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సాధ్యమైనన్ని ఎక్కువ కేసుల్ని లోక్ అదాలత్‌లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జీ కళార్చన తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తే ప్రజలే బుద్ధి చెబుతారు



(మొదటిపేజీ తరువాయి)

పక్షాన ఉంటుందని స్పష్టం చేశారు. ఓటు బ్యాంకు రాజకీయాలు కాకుండా ప్రజా సమస్యలపై గళమెత్తి అలుపెరగని పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ సీపీఐ(ఎం) అని తెలిపారు. అనంతరం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో కళాకారులు.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో జరిగిన అనేక సన్నివేశాలను కళారూపాల్లో ప్రజల ముందుంచారు. వారి కళారూపాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, పీఎన్ఎం రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు వేముల ఆనంద్, కట్టా నర్సింహ, ప్రజానాట్యమండలి జిల్లా మాజీ కార్యదర్శి మాలోత్ సాగర్, స్టేషన్ ఘన్‌పూర్ మండల కార్యదర్శి మునిగెల రమేష్, జిల్లా కమిటీ సభ్యులు కొడేపాక యాకయ్య, సీపీఐ(ఎం) ఇప్పగూడెం గ్రామ శాఖ కార్యదర్శి గట్ల మల్లారెడ్డి, జఫర్‌గడ్ నాయకులు కాట సుధాకర్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీర తెలంగాణ పోరాటం.. యువతకు ఆదర్శం

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులు ఎండీ. అబ్బాస్ కలిసి.. రైతాంగ పోరాటంలో పాల్గొన్న యోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యోధుల కుటుంబ సభ్యులను సన్మానించారు. అక్కడి నుంచి యాత్ర జఫర్‌గడ్ మండల కేంద్రానికి బుధవారం చేరుకుంది. ఇప్పగూడెంలో జరిగిన సభలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. నాడు భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ పోరాటాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా సాగించిన పోరాటాల చరిత్రను బీజేపీ వక్రీ కరించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ముస్లీం, హిందువులకు మధ్య జరిగిన పోరా టంగా చిత్రీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కమ్యూనిస్టుల సారథ్యంలో సాగిన ఈ మహోన్నత పోరాటంలో ఎందరో అమరుల య్యారని తెలిపారు. తెలంగాణరైతాంగ పోరాటం దేశంలో భూసంస్కరణలకు దారిచూపిందన్నారు.

నువ్వా..నేనా..!

వ్యక్తిగత దాడులకూ వెనుకాడని నేతలు

కీలకాంశాలపై ఘర్షణ పడ్డ కమలా హారిస్, ట్రంప్

ఫిలడెల్ఫియా : అమెరికా అధ్యక్ష ఎన్నికల సందర్భంగా మొట్టమొదటిసారిగా డెమొక్రాట్, రిపబ్లికన్ పార్టీల అభ్యర్థులు కమలా హారిస్, డొనాల్డ్ ట్రంప్ మంగళవారం రాత్రి ముఖాముఖి చర్చలో పాల్గొన్నారు. 90నిముషాల పాటు సాగిన ఈ చర్చలో ఆర్థిక వ్యవస్థ, అబార్షన్, ఇమ్మిగ్రేషన్, విదేశాంగ విధానాలు సహా కీలకమైన అంశాలపై ఇరువురు ఘర్షణ పడ్డారు. వ్యక్తిగత దాడులకు కూడా దిగారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు, జీవన వ్యయాన్ని తగ్గించేందుకు తమకు గల ప్రణాళికల గురించి ఇరువురు నేతలు వెల్లడించారు. అవకాశాలు కలిగిన ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తామని కమలా హారిస్ ప్రతిన చేశారు. గృహ నిర్మాణాన్ని మరింత అందుబాటు ధరల్లోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఇతర దేశాలపై టారిఫ్‌లను వేస్తామని ట్రంప్ చెప్పారు. బైడెన్ హయాంలో అధిక ద్రవ్యోల్బణం నమోదైందని విమర్శించారు. కాగా గర్భస్రావం అంశాన్ని ఇరువురు అభ్యర్థులు కీలకమైనదిగా భావించారు. అబార్షన్‌ను రాష్ట్రానికి సంబంధించి అంశంగా వుంచాలని ట్రంప్ పునరుద్ఘాటించారు. కాగా ట్రంప్ హయాంలో అబార్షన్‌పై నిషేధాన్ని ప్రస్తావిస్తూ కమలా హారిస్, దీనివల్ల అత్యాచారానికి గురైన మహిళలు గర్భస్రావాలు చేయించుకోలేకపోయారని విచారాన్ని వ్యక్తం చేశారు.

ఇజ్రాయిల్-పాలస్తీనా ఘర్షణలు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఆఫ్ఘన్ నుండి అమెరికా బలగాలు వైదొలగడం ఇలా పలు విదేశాంగ విధానాలకు సంబంధించిన అంశాలపై కూడా వారు ఘర్షణ పడ్డారు. ట్రంప్ పదే పదే అధ్యక్షుడు బైడెన్ అంటూ ప్రస్తావించడంపై హారిస్ అభ్యంతరం తెలిపారు. "మీరు పోటీ చేస్తోంది బైడెన్‌పై కాదు, నాపై" అని వ్యాఖ్యానించారు.

జూన్‌లో జరిగిన మొదటి డిబేట్‌లో బైడెన్, ట్రంప్ పాల్గొన్నారు. వృద్ధాప్య సంబంధమైన సమస్యలతో బైడెన్ పోటీ నుండి తప్పుకోవడంతో ఉపాధ్యక్షురాలు కమలాహారిస్‌ను పార్టీ బరిలోకి దింపింది.

సంపాదకీయం

కమిషన్లతో పనయ్యేనా..?

'మా ఇంటికొస్తే ఏం తెస్తరు..? మీ ఇంటికొస్తే ఏమిస్తరు..?' అన్నట్టుంది కేంద్ర ప్రభుత్వ తీరు. రాష్ట్రంలో పర్యటించిన పదహారో ఆర్థిక సంఘం అదే కోవలో వ్యవహరించింది. అప్పుల భారాన్ని మోయలేక పోతున్నాం.. వడ్డీలు కట్టలేక సచ్చిపోతున్నాం.. ఆదుకోండి మహాప్రభో అని రాష్ట్ర ప్రభుత్వం వేడుకుంటే.. ఠాఠ్... అలా కుదరదంటే కుదరదు, కచ్చితంగా నియమ నిబంధనల ప్రకారమే ముందు కెళతాం, తలసరి ఆదాయం, జనాభా ప్రాతిపదికన్నే నిధుల కేటాయింపులపై కేంద్రానికి సిఫారసులు చేస్తామంటూ బల్లగుద్ది మరీ చెప్పారు ఆర్థిక సంఘం చైర్మెన్ డాక్టర్ అరవింద్ పనగారియా. అంతకు మించి ఆయన ఏం చెప్పగలరులే పాపం... విధానపరమైన నిర్ణయాలన్నీ కేంద్ర ప్రభుత్వం తీసుకుని, ఆ తర్వాత ఏదో నామ్‌కే వాస్తేగా కమిషన్లను పర్యటనల కోసం పురమాయిస్తున్న తరుణంలో పనగారియా స్థానంలో ఎవరున్నా చేసేదేమీ లేదు.

ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులను ఎగ్గొట్టటం కేంద్రానికి పరిపాటిగా మారింది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం... తెలంగాణకు పీఎంఏవై కింద రూ.1,200 కోట్లు, అదనపు లెవీ బియ్యాన్ని సేకరించినందుకు రూ.1,500 కోట్లు, జాతీయ ఆరోగ్యమిషన్ కింద రూ.323 కోట్లు, ఇవిగాక మిగతా రకరకాల అంశాల కింద మరో రూ.2,200 కోట్లు రావాలని రేవంత్ సర్కార్ చెబుతోంది. వీటిపై మోడీ ప్రభుత్వం నోరు మెదపకపోవటం తెలంగాణ పట్ల దానికున్న చిత్తశుద్ధికి నిదర్శనం.



రెండు రోజులపాటు హైదరాబాద్‌లో భేటీల మీద భేటీలు నిర్వహించిన పనగారియా బృందం... సెస్‌లు, సర్‌ఛార్జీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అనేకాంశాలపై చేతులెత్తేసింది. వాస్తవానికి పన్నులకు కాల పరిమితి అనేదేమీ ఉండదు. ఆ రూపంలో సమకూరిన సొమ్మును ప్రభు త్వాలు తమ అవసరాలకు అనుగుణంగా వాడుకోవచ్చు. కానీ సెస్, సర్‌ఛార్జీల ఉద్దేశం అది కాదు. నిర్ణీత కాల వ్యవధిలో, నిర్దిష్టమైన అంశం కోసం వాటిని విధించి, ఆ తర్వాత ఎత్తేయాలి. ప్రకృతి విపత్తులు, కరువు కాటకాలు సంభవించినప్పుడు ఆయా ప్రత్యేక సందర్భాల కోసం వాటిని వసూలు చేసి, విధిగా వాటి కోసమే వాడాలి. కానీ మన మోడీ సర్కారుకు మాత్రం సెస్‌లు, సర్‌ఛార్జీలు వాడేందుకు ఎలాంటి సందర్భం అక్కర్లేదు, నిర్దిష్ట కాల పరిమితి కూడా అవసరం లేకపోవటాన్నిబట్టి అది ప్రజలను ఏ విధంగా పీడిస్తోందో, రాష్ట్రాలకు వాటాలివ్వకుండా ఎలా తిప్పలు పెడుతుందో అర్థం చేసుకోవచ్చు. 2014 నుంచి ఇప్పటి దాకా సెస్‌లు, సర్‌ఛార్జీల రూపంలో రూ.20 లక్షల కోట్లను కేంద్రం వసూలు చేసినట్టు ప్రాథమిక అంచనా. ఈ మొత్తాన్ని గుండుగుత్తగా కేంద్రం వాడుకోవటం, రాష్ట్రాలకు ఒక్కపైసా విదల్చక పోవటం దాని ఆర్థిక నియంతృత్వానికి నిదర్శనం.

మరోవైపు గత మూడు నాలుగు దశాబ్దాలుగా కుటుంబ నియంత్రణ పద్ధతులను బుద్ధిగా పాటిస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు నిధులు, కేంద్ర పన్నుల్లో వాటాలు, ఆర్థిక సాయాలు, గ్రాంట్లలో కోతలు పెట్టటం మోడీ సర్కారుకే చెల్లింది. అదేమంటే... 'జనాభా ప్రాతిపదికన నిధులిస్తున్నాం...' అని కేంద్రం బుకాయించటం దక్షిణాదిలోని ఇతర రాష్ట్రాలతో పాటు తెలంగాణకు నిజంగా ఆశనిపాతమే. 'జనాభా తక్కువున్న దక్షిణాది రాష్ట్రాలకు తక్కువ నిధులు, ఎక్కువున్న ఉత్తర ప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, మహా రాష్ట్ర లాంటి రాష్ట్రాలకు ఎక్కువ నిధులు...' అని చెప్పటం ఏ న్యాయ సూత్రమో కేంద్ర ప్రభుత్వ పెద్దలే చెప్పాలి. అంటే కు.ని.ఆపరేషన్లను విజయవంతంగా చేసి, కేంద్రం చెప్పినట్టు జనాభాను నియంత్రిం చటం దక్షిణాది రాష్ట్రాలకు వరమా?శాపమా? అర్థంగాని పరిస్థితి. ఈ రకంగా చూస్తే ఉత్తరాది రాష్ట్రా లకు ఏటేటా నిధులు పెరుగుతూ పోతుంటే, దక్షిణాదికి నానాటికీ తగ్గిపోవటం విస్తుగొలిపే అంశం.

వీటితో సంబంధం లేకుండా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులను ఎగ్గొట్టటం కేంద్రా నికి పరిపాటిగా మారింది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం... తెలంగాణకు పీఎంఏవై కింద రూ.1,200 కోట్లు, అదనపు లెవీ బియ్యాన్ని సేకరించినందుకు రూ.1,500 కోట్లు, జాతీయ ఆరోగ్యమిషన్ కింద రూ.323 కోట్లు, ఇవిగాక మిగతా రకరకాల అంశాల కింద మరో రూ.2,200 కోట్లు రావాలని రేవంత్ సర్కార్ చెబుతోంది. వీటిపై మోడీ ప్రభుత్వం నోరు మెదపకపోవటం తెలంగాణ పట్ల దానికున్న చిత్తశుద్ధికి నిదర్శనం.

ఇలాంటి అంశాలన్నింటిపై ముఖ్యమంత్రి రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మొరపెట్టుకున్నా ఆర్థిక సంఘం మనసు కరగలేదు. వీటికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు అంకెలు, సంఖ్యలు, గణాంకాలతో సహా పవర్ పాయింట్ ప్రజం టేషన్ ఇచ్చినా.. 'మా దగ్గర ఎలాంటి పవర్స్' లేవంటూ పనగారియా పరోక్షంగా చెప్పేశారు. తద్వారా కేంద్రం తనంతట తానుగా ఇస్తే తప్ప ఎలాంటి ఆర్థిక సాయాలు, వెసులుబాట్లు ఉండబోవు, ఆ రకంగా తాము సిఫారసులు చేయలేమంటూ తేల్చేశారు. అందుకే కమిషన్లతో పని కానప్పుడు తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలు కేంద్రంపై కార్యాచరణ ప్రకటించటమే అత్యుత్తమ మార్గం. వామపక్షాల ఏలుబడిలో ఉన్న కేరళ ఇప్పుడు చేస్తున్నదదే.

కోల్‌కతా ఘటన: మమతకు రాజీనామా లేఖ!

"మిమ్మల్ని కలవటానికి ఎంత ప్రయత్నం చేసినా వీలుకాలేదు. ఇటీవల ఆర్‌జికార్ ఆస్పత్రిలో జరిగిన దారుణకాండ నేనేకాదు, రాష్ట్ర ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ ఘటనపై తృణముల్ ప్రభుత్వం సకాలంలో స్పందించనందున ప్రజల్లో ప్రభుత్వం పట్ల విశ్వాసం సన్నగిల్లింది. అంతేకాదు, సర్కార్ ఏదో దాస్తోందనే భావన ప్రజల్లోకి వెళ్లిపోయింది.దాని పర్యవసానమే అరనిముంటల్లా సాగుతున్న ఆందోళనలు. దీనికి తోడు రాష్ట్రంలో పెచ్చుమీరిన అవినీతి . దీనిని అరికట్టడంలోనూ ప్రభుత్వం విఫలమైంది. దీనికి పరాకాష్టగా 2022లో విద్యాశాఖ మాజీ మంత్రి సిబిఐ అరెస్ట్. దీని తర్వాత కూడా మీరేమి నష్ట నివారణ చర్యలు చేపట్టలేదు.ఆర్‌జికార్ ఆస్పత్రిలో జరిగిన ఘటన కనీసం పోలీ సులకు, తల్లిదండ్రులకు తెలుపకుండా నిర్లక్ష్యం వహించిన హాస్పిటల్ సూపరింటెండెంట్‌పై క్రమశిక్షణ చర్యలు చేపట్టకుండా, మరొక పేరున్న హాస్పిటల్‌కు బదిలీచేయటంతో ప్రజల్లో ప్రభుత్వ ప్రతిష్ట మసకబారింది. కోర్టు జోక్యం తర్వాత



సస్పెండ్ చేయటం సర్కార్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. నేను నలభైయేండ్లు సుదీర్ఘంగా ఐఏఎస్ అధికారిగా పనిచేశా. ఇప్పుడున్నంత అవినీతిని ఎప్పుడూ చూడలేదు. ఇప్పటికి నేనొక మురికివాడ పక్కనున్న ఒక పాత అపార్టుమెంట్లో నివాసముంటున్నాను. తొమ్మిదేండ్ల నాటి పాతకారునే వాడుతున్నాను. కానీ, ఇప్పుడిప్పుడే ప్రజాప్రతినిధులుగా, మున్సిపాలిటీ చైర్మన్లుగా అయినవారు కూడా పెద్ద కార్లలో తిరుగుతున్నా దృశ్యాలను చూస్తున్నాము." అని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణముల్ అధినేత్రి మమతా బెనర్జీకి అదే పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు జవహర్ సిరికార్ తన రాజీనామా లేఖలో పేర్కొన్న వ్యాఖ్యలివి.

జవహర్ సిరికార్‌కు తృణముల్ ప్రభుత్వం 2021లో రాజ్యసభ సభ్యత్వమిచ్చింది. పార్లమెంటులో అనేక ప్రజాసమస్యలపై గళ మెత్తిన చరిత్ర ఆయనకుంది. ఈయన విద్యాభ్యాసం ఇంగ్లాండులోని కేంబ్రిడ్జిలో కొనసాగింది.ప్రసార భారతి సిఇఓగా 2012 నుంచి 2016 వరకు ,కేంద్రంలో సెక్రెటరీగా, ఏమాత్రం అవినీతి మరకలేకుండా సమర్థ అధికారిగా పనిచేసినట్టు ఆయనకు పేరుంది. స్వాతంత్ర్యదినోత్సవానికి ముందు రోజు ఆగష్టు 14న ఆర్‌జికార్ ఆస్పత్రిలో ట్రెయినీ డాక్టర్‌పై జరిగిన సామూహిక లైంగికదాడి, ఈ ఘటన పట్ల ప్రభుత్వం స్పందించిన తీరు సరిగా లేదనే కారణంతో ఆయన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ దారుణం జరిగి నెల రోజులు దాటుతున్నా సకాలంలో చర్యలు తీసుకోకపోవడాన్ని తప్పుపట్టారు. ఆమె మౌనం వల్లే రాష్ట్రంలో ఆందోళనలు పెరిగాయన్నారు. త్వరలోనే రాజ్యసభ అధ్యక్షున్ని కలిసి తన రాజీనామా లేఖను అందచేస్తానని తెలిపారు. చివరిగా ఆ లేఖలో మమతకు ఒక విన్నపం కూడా చేశారు. రాష్ట్రంలో మతోన్మాదులు, విధ్వంసకర శక్తులు అధికారంలోకి రాకుండా చూసేవిధంగా పరిపాలన సాగించాలని, ఇందులో విఫలమైతే జాతి క్షమించదని పేర్కొన్నారు.

జవహర్ సిరికార్ ఒక్కరే కాదు మరొక తృణమూల్ రాజ్యసభ సభ్యుడు సుఖేందు శేఖర్‌రే ఆర్‌జికార్ హాస్పిటల్‌లో జరిగిన లైంగికదాడి పట్ల ప్రభుత్వాన్ని తప్పుపట్టారు. నెలరోజులుగా జూనియర్ డాక్టర్లు రాష్ట్ర వ్యాప్తంగా విధుల్ని బహిష్కరించి ఆందోళన చేపట్టంతో పేదలు సరైన వైద్యమందక నానా అగచాట్లు పడుతున్నారు. అంతేకాదు, డబ్బుల్లేక, ప్రయి వేటు హాస్పిటల్స్‌కు వెళ్లలేక చనిపోతున్న ఘటనల్ని సుప్రీంకోర్టుకు కపిల్ సిబాల్ ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన చీఫ్ జస్టిస్ బెంచ్ 24 గంటల్లో జూనియర్ డాక్టర్లు డ్యూటీలో చేరక పోతే రాష్ట్ర ప్రభుత్వంపై క్రమశిక్షణ చర్యలు చేపట్టవచ్చని, వీరి సమ్మెతో పేదప్రజలు నష్టపోకూడదని ఉత్తర్వులిచ్చింది. విధుల్లో ఉన్న డాక్టర్‌పై లైంగికదాడికి నిరసనగా విద్యార్థులు, యువకులు సెక్రెటరియేట్‌ను ముట్టడించిన తీరు పట్ల ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని స్పష్టం చేస్తోందంటూ అక్కడి రాజకీయ పరిశీలకుల విశ్లేషణ. అంతెందుకు మహిళా సంఘాలతో పాటు ఇటీవల సెక్స్‌వర్కర్లు కూడా ప్రభుత్వ వ్యతిరేక నిరసనల్లో పాల్గొన్నారు. ఒకపక్క సొంతపార్టీ ఎంపీలే పాలనావైఫల్యాల్ని ఎత్తిచూపడం, ప్రజావ్యతిరేక పాలనపై ప్రజలు పోరాటాలతో రోడ్లెక్కడం మమతాబెనర్జీపై ఉన్న భ్రమలు క్రమక్రమంగా తొలుగుతున్నట్టు విద్యావంతులు, మేధావుల అభిప్రాయం. ఇది బెంగాల్‌లో దీదీ సర్కార్ మసకబారుతోం దనడానికి సంకేతం!

- డాక్టర్ కె.సుధాకర్ రెడ్డి,
8985037713

సాయుధ పోరాట కాలంలో కార్మికోద్యమం

- ఆరెస్బీ

చరిత్ర పురాణ కాలక్షేపం కాదు. పైగా అది రాణివాసపు అంశాల గురించో, అంత:పుర అవశేషాల గురించో, రాజ్యాల ముట్టడుల గురించో కాదు. మట్టి మనుషులు, వారి విముక్తి కోసం తెగించి పోరాడిన వీరగాథలవి. వారాలపించిన విప్లవ గీతాలవి. అవి దశాబ్దాల అణచివేతలపై రేగిన చైతన్య బావుటాలు. దొడ్డి కొమరయ్య నేలకొరిగిన 1946 జులై 4 నుండి అధికారయుతంగా సాయుధ పోరాటాన్ని ఉపసంహరించుకున్న 1951 అక్టోబరు 21 వరకు ఐదేండ్లకుపైగా సాగిన సాయుధ సంఘర్షణ అది. బ్రిటిష్ పాలకులచే "హిజ్ ఎగ్జాల్టెడ్ హైనెస్"గా కీర్తించబడ్డ నైజాం నవాబుపై సాగిన సాయుధ రైతాంగ ప్రతిఘటనోద్యమం గురించి ఆనాటి ట్రేడ్ యూనియన్ ఉద్యమ ప్రారంభ దినాల గురించీ నేడు చర్చిస్తున్నాం. సగం తెలుగు మాట్లాడే తెలంగాణ ప్రాంతం (50శాతం), 28శాతం మరాఠీ మాట్లాడే మరాట్వాడా ప్రాంతం, 22 శాతం కర్నాటక ప్రాంతం ఉన్న 83వేల చ.మైళ్ళ వైశాల్యంలో విస్తరించింది నైజాం రాజ్యం.

'బాంచన్ దొర నీ కాల్మొక్తా'నన్న మట్టి మనుషులు బందూకులై విప్లవించిన కాలంలో (1941కి) తెలంగాణ ప్రాంతంలో ఐదు వందల ఫ్యాక్టరీలు, వాటిలో 23 వేల మంది కార్మికులుండేవారని 'వీర తెలంగాణ విప్లవ పోరాటం - గుణపాఠాలు' గ్రంథంలో పుచ్చలపల్లి సుందరయ్య రాశారు (పేజీ14).

"పట్టణాల్లో కార్మికవర్గంలో, మధ్యతరగతి వర్గాలలో కమ్యూనిస్టు ఉద్యమం బలహీనంగా ఉండింది"అని ఆ గ్రంథంలో కామ్రేడ్ పి.ఎస్. రాశారు. అయినా, ఉన్న మేరకు 'సాయుధ పోరాట' ప్రభావం సంపూర్ణంగా ఉండేదన్నారు. నగరాల్లో ముఖ్యంగా హైదరాబాద్, వరంగల్ ప్రాంతంలో ముఖ్యంగా బొగ్గు గనుల ప్రాంతం. అజాంజాహి మిల్లు, హైదరాబాద్‌లోని ఇతర నేత మిల్లులు, ఆర్టీసీ, రైల్వే కార్మికులు, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, మున్సిపల్ కార్మికులు వంటి అనేక రంగాలు, ఫ్యాక్టరీల కార్మికులు వారి దైనందిన సమస్యలపై చేసే ఉద్యమాల్లో కమ్యూనిస్టులు జోక్యం చేసుకున్నారు.

ట్రేడ్ యూనియన్ ఉద్యమం ఎక్కడ, ఎలా ప్రారంభించాలో అనుభవపూర్వకంగా ఆ గ్రంథంలో కామ్రేడ్ సుందరయ్య పేర్కొన్నారు. నేటి ట్రేడ్ యూనియన్ కార్యకర్తలకు గైడ్‌గా అది ఉపయోగపడుతుంది. ఇటువంటి ముఖ్య నేతల అనుభవాల నుండే 1967 "కార్మికరంగంలో కర్తవ్యాలు" అనే సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ తీర్మానం ఆవిర్భవించింది.

కొత్తగూడెం, బెల్లంపల్లి ఏరియాల్లో గని కార్మికులు బోనస్‌పై సమ్మె చేశారు. యాజమాన్యం కొన్ని సౌకర్యాలు అమలు చేస్తానని ప్రకటించినా, కార్మికులు సంతృప్తి చెందక సమ్మె కొనసాగించారు. బోనస్ విధానాన్ని సక్రమంగా అమలు చేయాలని, బియ్యం రేషన్ సరిపడినంతగా ఇవ్వాలని, పౌరహక్కులు పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో 1949 మే నెలలో తిరిగి సమ్మె చేశారు. అరెస్టులు కొనసాగాయి. "వరంగల్లు, నల్లగొండ జిల్లాల్లో గెరిల్లా చర్యల ప్రభావం పడినప్పటికీ, వారి విజయాలను విని ఉత్సాహం పొందుతున్నప్పటికీ, పార్టీ పలుకుబడి, నిర్మాణమూ కార్మికులను సంఘటితపరిచి నాయకత్వం వహించడానికి పరిస్థితులు తగినంతగా లేవు. ఆర్థిక కోరికల సాధనకై కార్మికులు అనేక పోరాటాలు జరిపారు. అవి వాటంతట అవే తలెత్తాయి (పీఎస్ గ్రంథం పేజీ 251).

ఈ పోరాటాలలో ప్రత్యేకతేమంటే ఒక ఫ్యాక్టరీ కార్మికులు, మరొక ఫ్యాక్టరీ కార్మికులకు అండగా నిలుస్తున్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ ఉద్యమంలో పాల్గొన్న వారికి ఉరిశిక్షలు రద్దు చేయాలని డిమాండ్ చేయడమే కాదు, ఆ రైతాంగ ఉద్యమాన్ని బలపరుస్తూ రాజకీయ సమ్మెలు కూడా చేశారు. డిటెన్యూలపట్ల ప్రభుత్వ విధానాన్ని ఖండిస్తూ కామ్రేడ్ గణపతి (మల్లయ్య) హత్యను నిరసిస్తూ హైదరాబాద్‌లో రోడ్డు రవాణా కార్మికులు పెద్ద సభ జరిపారు. మే -23న గంటపాటు నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్, పబ్లిక్ వర్క్స్, ఆయిల్ మిల్లు కార్మికులు కూడా ఆ రోజున సమ్మె చేశారు.

ఒక యూనియన్ పిలుపునివ్వంగానే కార్మికులు పాల్గొనే దశ కాదది. యూనియన్ల అఫిలియేషన్లు, పిలుపులకు స్పందనలు కాక కార్మికుల స్వచ్ఛంద స్పందనలవి. జనం రోసిన నిజాము రాజ్యం అంతమొందిన రోజుల్లో 'పోలీసు చర్య' తర్వాత సాధారణ ప్రజలతో కలిసి బెల్లంపల్లిలో గని కార్మికులు హిందూ, ముస్లిం బడా వ్యాపారస్తుల, ఇతర ప్రజా పీడకుల 'గడీ'లపై దాడులు చేసిన సందర్భమది. నిజాం రాజ్యం స్థానంలో వచ్చిన నెహ్రూ సైన్యం ప్రజలపై విరుచుకుపడ్డ రోజులవి. కార్మికవాడల్లో ఎర్రజెండాలెగరేయడాన్ని నిషేధించిన రోజులవి. అయినా, 1950 జనవరి 26న నైజాంను నెహ్రూ ప్రభుత్వం 'రాజ్ ప్రముఖ్'గా నియమిస్తే హైదరాబాద్‌తో సహా అనేక చోట్ల విద్యార్థుల సమ్మెలు, వారికి మద్దతుగా నిలిచిన ప్రజలపై లాఠీలతో పోలీసులేగాక కాంగ్రెస్ కార్యకర్తలు సైతం విరుచుకుపడినా కార్మికులు ప్రతిఘటించిన సందర్భమది.

ఒక యూనియన్ పిలుపునివ్వంగానే కార్మికులు పాల్గొనే దశ కాదది. యూనియన్ల అఫిలియేషన్లు, పిలుపులకు స్పందనలు కాక కార్మికుల స్వచ్ఛంద స్పందనలవి. జనం రోసిన నిజాము రాజ్యం అంతమొందిన రోజుల్లో 'పోలీసు చర్య' తర్వాత సాధారణ ప్రజలతో కలిసి బెల్లంపల్లిలో గని కార్మికులు హిందూ, ముస్లిం బడా వ్యాపారస్తుల, ఇతర ప్రజా పీడకుల 'గడీ'లపై దాడులు చేసిన సందర్భమది. నిజాం రాజ్యం స్థానంలో వచ్చిన నెహ్రూ సైన్యం ప్రజలపై విరుచుకుపడ్డ రోజులవి. కార్మికవాడల్లో ఎర్రజెండాలెగరేయడాన్ని నిషేధించిన రోజులవి. అయినా, 1950 జనవరి 26న నైజాంను నెహ్రూ ప్రభుత్వం 'రాజ్ ప్రముఖ్'గా నియమిస్తే హైదరాబాద్‌తో సహా అనేక చోట్ల విద్యార్థుల సమ్మెలు, వారికి మద్దతుగా నిలిచిన ప్రజలపై లాఠీలతో పోలీసులేగాక కాంగ్రెస్ కార్యకర్తలు సైతం విరుచుకుపడినా కార్మికులు ప్రతిఘటించిన సందర్భమది.

"హైదరాబాద్‌లో కాంగ్రెస్ నిరంకుశ పాలన పదకొండు మాసాలు సాగడంతోనే అది తగిలించుకున్న 'విమోచన' ముసుగు కాస్తా పటాపంచలైంది. తుపాకీ బలంతో సాగుతున్న పెట్టుబడిదారీ వర్గపు దుష్ట నియంతృత్వంగా దాని నిజస్వరూపం బట్టబయలైంది. పౌర హక్కులు పూర్తిగా అణిచివేయబడ్డాయి. నిజమైన ప్రజాతంత్ర ఉద్యమాన్ని దేన్నీ సాగనివ్వలేదు. ఏ సంస్థ మీదనైనా, ఫ్యాక్టరీ మీదనైనా పోలీసులు విరుచుకుబడి విచక్షణా రహితంగా అరెస్టులు చేయడానికి, బీభత్సకాండ సాగించడానికి పూనుకున్నారు. కమ్యూనిస్టు పార్టీ, ట్రేడ్ యూనియన్లు, విద్యార్థి, యువజన సంఘాలకు చెందిన అచ్చుయంత్ర సామాగ్రిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఈ క్రూరులు పురుషులపైన సాగించినట్లే స్త్రీలపై కూడా దుర్మార్గాలు సాగించారు" (పీ.ఎస్. గ్రంథం పేజీ : 253).

వివిధ రంగాలకు సంబంధించిన అనేకమంది ట్రేడ్ యూనియన్ నాయకులను ఏ విధంగా డిటెన్యూలుగా ఉంచారో వారి పేర్లు, వివరాలు సుందరయ్య తన గ్రంథంలో ఉటంకించారు.

ఈ సందర్భంగా ఒక కీలక విషయం మన గమనంలో ఉండాలి. దాదాపు 400 రోజులు ఢిల్లీ చుట్టూ రైతాంగం ముట్టడించి మూడు నల్ల చట్టాల రద్దుకు పోరాడుతుంటే కార్మికవర్గ స్పందన తగు రీతిలో ఉందో లేదో కార్మికోద్యమం నిశితంగా పరిశీలించుకోవాలి.

1948 డిసెంబరు మధ్యలో 16 వందల మంది మున్సిపల్ కార్మికులు తమ వేతనాలు పెంచాలని, కరువు భత్యం కోసం, పర్మినెంట్ చేయాలనీ ఎర్రజెండా నాయకత్వాన హైదరాబాద్‌లో ప్రదర్శనలు జరిపారు. పోలీసు లాఠీలను లెక్కచేయకుండా సాగిన ఆ ప్రదర్శన అనేక ఫ్యాక్టరీల కార్మికులను ఉత్తేజపరిచి రంగంలోకి దింపింది. 30 వేల పనిదినాలు నష్టమైనాయి. మహిళా కార్మికులపై జరిగిన లాఠీచార్జీకి నిరసనగా రైల్వే, ఆర్టీసీ కార్మికులు సమ్మె చేయడంతో రెండు రోజులు నగరం స్తంభించిపోయింది. అఖిల భారత స్థాయిలో రైల్వే సమ్మెకు సన్నాహాలు జరుగుతున్న దశ అది. దక్షిణ భారతదేశంలో అనేకమంది రైల్వే కార్మికులు సమ్మెకు అనుకూలంగా బ్యాలెట్‌లో పాల్గొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు మిలటరీ అత్యాచారాలకు వ్యతిరేకంగా ఒకసారి, మున్సిపల్ కార్మికులకు సంఘీభావంగా ఒకసారి సమ్మె చేసియున్నారు.

రైల్వే సమ్మె ప్రాధాన్యతను అర్థం చేసుకున్న నెహ్రూ ప్రభుత్వం ఆ సమ్మెను క్రూరంగా అణచివేసింది. చివరికి లాలాగూడ ప్రాంతంలో మంచినీరు పట్టుకునే ఆడవారిని సైతం తమ కుటుంబసభ్యుల అరెస్టుల విషయంలో మాట్లాడుకోనీకుండా చెల్లాచెదురు చేసేశారు.

బీజప్రాయంలో ఫ్యాక్టరీ వ్యవస్థఉన్న రోజుల్లోనే ట్రేడ్ యూనియన్ ఉద్యమం ఎట్నుంచి ఎటు ప్రారంభించాలో దాని గతి ఏ విధంగా ఉండాలో 1940వ దశకంలో సుందరయ్య అనుభవపూర్వకంగా వివరించిన ఆ పది పేజీలు ఈ గ్రంథంలో ట్రేడ్ యూనియన్ కార్యకర్తలకు కీలకం. నాటి సంఘటితరంగ పరిశ్రమలతోపాటు ఆర్టీసీ, రైల్వేలపై పార్టీ కేంద్రీకరణ, దానితోపాటు మున్సిపల్, ప్రభుత్వోద్యోగుల్లో కృషి వంటిది ఎంత ముఖ్యమో అర్థం కావల్సియున్నది. ట్రాన్స్‌పోర్టు రంగంలో (రైల్వే, ఆర్టీసీ) సంస్కరణ వాద సంఘాలు కార్మికుల్ని ఏ విధంగా భ్రమలకు లోను చేస్తున్నాయో తెలిస్తే మన కృషి ప్రాధాన్యత అవగతమవుతుంది.

లెనిన్ చెప్పిన క్రింది విషయాన్ని కమ్యూనిస్టు ట్రేడ్ యూనియన్ శ్రేణులు అర్థం చేసుకోవడం అవసరం. "పెట్టుబడితో తాను దోపిడీ చేయబడ్తున్నాననే విషయం (ఫ్యాక్టరీ) కార్మికుడు తేలిగ్గా అర్థం చేసుకుంటాడు. తన ఆర్థిక కోర్కెల పరిష్కారమేగాక, పని పరిస్థితులు మెరుగవ్వాలన్నా, పోరాటం మొత్తం బూర్జువా వర్గంపైనే కేంద్రీకరించాలని సులభంగానే అర్థం చేసుకుంటారు. ఎందుకంటే ఫ్యాక్టరీల్లో తమని అణచివేయడమే కాదు, యావన్మంది కార్మికుల్ని అన్నిచోట్లా అణచివేసేది ఈ బూర్జువా వర్గమేనన్న విషయం ఆచరణలో అతనికి అర్థమవుతుంది. అందుకే ఫ్యాక్టరీ కార్మికుడు మొత్తం దోపిడీకి గురయ్యే వర్గానికి ప్రతినిధి. ఒక నిరంతర, సంఘటిత పోరాటం చేయాలనే విషయాన్ని అతని దృష్టికోణంలో నిలపాల్సిన పనిలేదు. ఆనాటి ఆర్థిక, రాజకీయ పరిస్థితుల్లో అతనిపై సాగుతున్న దోపిడీని అర్థం చేయించి, దాన్లో అతని స్థానాన్ని ఎరుకపరచడం కీలకం" - (1894లో రష్యాలో విస్తరిస్తున్న ఫ్యాక్టరీ వ్యవస్థపై లెనిన్ రచనల నుండి)

1948 డిసెంబరు మధ్యలో 16 వందల మంది మున్సిపల్ కార్మికులు తమ వేతనాలు పెంచాలని, కరువు భత్యం కోసం, పర్మినెంట్ చేయాలనీ ఎర్రజెండా నాయకత్వాన హైదరాబాద్‌లో ప్రదర్శనలు జరిపారు. పోలీసు లాఠీలను లెక్కచేయకుండా సాగిన ఆ ప్రదర్శన అనేక ఫ్యాక్టరీల కార్మికులను ఉత్తేజపరిచి రంగంలోకి దింపింది. 30 వేల పనిదినాలు నష్టమైనాయి. మహిళా కార్మికులపై జరిగిన లాఠీచార్జీకి నిరసనగా రైల్వే, ఆర్టీసీ కార్మికులు సమ్మె చేయడంతో రెండు రోజులు నగరం స్తంభించిపోయింది. అఖిల భారత స్థాయిలో రైల్వే సమ్మెకు సన్నాహాలు జరుగుతున్న దశ అది. దక్షిణ భారతదేశంలో అనేకమంది రైల్వే కార్మికులు సమ్మెకు అనుకూలంగా బ్యాలెట్‌లో పాల్గొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు మిలటరీ అత్యాచారాలకు వ్యతిరేకంగా ఒకసారి, మున్సిపల్ కార్మికులకు సంఘీభావంగా ఒకసారి సమ్మె చేసియున్నారు.





కామ్రేడ్స్ అసోసియేషన్

1939లో హైదరాబాద్‌లో యువత, కొందరు మేధావులు కలిసి ఏర్పడ్డదే 'కామ్రేడ్స్ అసోసియేషన్'. దాని నాయకుడు జవాద్ రజ్వీ. రష్యన్ విప్లవం, జాతీయోద్యమం ద్వారా ప్రభావితులైన వారు ప్రగతిశీల సాహిత్యం అధ్యయనం చేస్తూ ముందుకు సాగారు వారు. కామ్రేడ్స్ అసోసియేషన్ నుండి కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులైన వారిలో రాజబహదూర్ గౌర్, సయ్యద్ ఇబ్రహీం, అలంఖ్‌మీర్‌లు తెలంగాణలోనూ, మహారాష్ట్ర పరిషద్ నుండి సోషలిస్టు భావజాలంవైపు ఆకర్షితులైన వారిలో హబీబుద్దీన్, వి.డి. దేశ్‌పాండే వంటి వారు ముఖ్యులు.

భావసారూప్యతగల ఈ యువకుల్ని కమ్యూనిస్టుపార్టీ వైపు ఆకర్షించడంలో సుందరయ్య, చంద్రరాజేశ్వర్‌రావు, కంభంపాటి సత్యనారాయణ కృతకృత్యులైనారు.

('తెలంగాణ సాయుధ పోరాటం, రాజకీయ, సైద్ధాంతిక విశ్లేషణ'లో డా॥ కందుకూరి రమేష్)

హేమ కమిటీ నివేదిక: మహిళల పోరాటంలో ఓ మైలురాయి



బృందాకరత్



కేరళ సినీ పరిశ్రమను పూర్తిగా కుదిపివేసిన హేమ కమిటీ నివేదిక యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచింది. కోల్‌కతా, తమిళనాడు వంటి వివిధ ప్రాంతాలకు చెందిన అనేక మంది కళాకారులు హేమ కమిటీ వంటి కమిటీలను ఇతర రాష్ట్రాల్లో ఎందుకు ఏర్పాటు చేయలేదనే ప్రశ్నలను లేవనెత్తారు. ఇది న్యాయమైన ప్రశ్న. మహిళలపై ఈ తరహా దోపిడీ బాలీవుడ్ మొదలుకొని సినీ పరిశ్రమ అంతటిలో వుందనేది బహిరంగ రహస్యం. కానీ ఈ రంగాన్ని శాసించే శక్తులు మహిళల గొంతు నొక్కేస్తున్నాయి.

సినిమా పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు 'ఉమెన్ సినిమా కలెక్టివ్' (డబ్ల్యుసిసి)ని ఏర్పాటు చేసిన ఏకైక రాష్ట్రం కేరళ. తమ సహోద్యోగుల్లో ఒకరికి ప్రముఖ నటుడి చేతిలో చేదు అనుభవం ఎదురైన నేపథ్యంలో ఈ సంస్థ ఏర్పడింది. పినరయి విజయన్ నేతృత్వంలోని వామపక్ష ప్రజాస్వామ్య ప్రభుత్వం కూడా సంస్థకు గొప్ప మద్దతునిచ్చింది. తమ ప్రాంతంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను డబ్ల్యు.సి.సి సభ్యులు లేవనెత్తడంతో వామపక్ష ప్రభుత్వం ఆ సమస్యను అధ్యయనం చేసి పరిష్కరించేందుకు జస్టిస్ హేమ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసింది.

పితృస్వామ్యంతో పాతుకు పో యిన ఏ సమాజంలోనైనా ప్రగతిశీల మార్పునకు నాంది పలికేది మహిళలే. భారతదేశంలో మహిళా సంఘాలు, ఉద్యమాల చరిత్ర కూడా ఇదే. మహిళల పట్ల సానుభూతి చూపే, వారి సమస్యలను వినే ప్రభుత్వం.. డబ్ల్యు.సి.సి వంటి ఉద్యమానికి ఎంతగానో తోడ్పడింది. మహిళా ఉద్యమం, రాజకీయ శక్తులు చేతులు కలిపితే పితృస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా గట్టి అడుగు పడుతుంది. సామాజిక మార్పుకోసం మహిళలు చేస్తున్న పోరాటాల్లో వామపక్షాలు శక్తివంతమైన మిత్రపక్షంగా ఉన్నాయి. కేరళలో వామపక్ష ప్రభుత్వం ఉంది. మహిళలపై దోపిడీని నిరోధించడానికి, అవసరమైన అన్ని రకాల రక్షణలకు అది కట్టుబడి ఉంది. హేమ కమిటీ ఏర్పాటు, ఆ తర్వాత ప్రత్యేక దర్యాప్తు బఅందం (సిట్) నియామకం అందుకు అద్దం పడుతోంది.

సినీ పరిశ్రమను శాసించే శక్తులపైన, లైంగిక దోపిడీ, లాబీలకు సంబంధించిన అంశాలపైన హేమ కమిటీ నివేదిక దృష్టి సారించింది. మహిళా కళాకారులు అత్యంత అరక్షిత పని పరిస్థితులలో, విశ్రాంతి గదులు కూడా లేకుండా, ఎటువంటి ఒప్పందాలు లేకుండా పని చేయాల్సి ఉంటుంది. హేమ కమిటీ నివేదిక ప్రకారం, పరిశ్రమలోని వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న అనేక సంఘాలు సినీ రంగంలో ఉన్నాయి. అయితే వాటిలో చాలావరకు నమోదు కాలేదు. అనేక సంఘాలు ఎవరి కోసం నిలబడాలో వారినే దోపిడీ చేస్తున్నాయని తేలింది.అటువంటి సంస్థలన్నిటినీ రిజిస్టర్ చేసి, వాటి కార్యకలాపాలన్నిటినీ చలన చిత్ర పరిశ్రమ నియమ నిబంధనల పరిధిలోకి తీసుకు రావాలని హేమ కమిటీ సిఫారసు చేసింది.

ఫిల్మ్ అసోసియేషన్ 'అమ్మ' సంస్థ సభ్యులను ఎంపిక చేయడంలో కూడా వివక్ష చూపుతున్నట్లు స్పష్టమవుతోంది. హేమ కమిటీ నివేదిక వెలువడ్డాక..ఆ సంస్థ పని తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం కావడంతో సంస్థకు చెందిన మొత్తం ఆఫీస్ బేరర్లు రాజీనామా చేయాల్సి వచ్చింది.సినీ పరిశ్రమలో లైంగిక వేధింపులకు గురవుతున్న మహిళలు ఫిర్యాదు చేసేందుకు సిట్‌ను ఏర్పాటు చేసి ఎల్.డి.ఎఫ్ ప్రభుత్వం ఆదర్శప్రాయమైన చర్య తీసుకుంది. వేధింపులు జరిగి ఎంత కాలమైనా ఫిర్యాదు చేయడానికి ఎలాంటి పరిమితి లేదు. బెంగాల్ కళాకారులు సహా అనేకమంది 'సిట్'కు ఫిర్యాదులు చేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి బహిరంగంగా మాట్లాడారు. మహిళకు తాను ఎదుర్కొన్న వేధింపుల గురించి మాట్లాడాలంటే ధైర్యం కావాలి. అయితే, మహిళలు ఫిర్యాదులు చేయనారంభించినప్పుడు, నిందితులు కూడా వాటిపై తిరుగు ఫిర్యాదులు చేశారు. ఇది పితృస్వామ్య సమాజంలోని సమస్య. తమను తాము సమర్థించుకోవడానికి చాలామంది నుండి ఇలాంటి స్పందనలు రావడం సహజం.

న్యాయం కోసం పోరాడుతున్న వారి పక్షాన వున్నామని ఎల్.డి.ఎఫ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. కాబట్టి మహిళా ఫిర్యాదుదారులకు రక్షణ కల్పించేందుకు, రౌడీలపై చర్యలు తీసుకునేందుకు సిట్ అవసరమైన చర్యలు తీసుకుంటుందనడంలో సందేహం లేదు. మహిళలు మాట్లాడితే తప్ప సమాజం మారదు. కాబట్టి దాడి చేసిన వారి పేర్లను బహిర్గతం చేయడమనేది బాధితుల రక్షణకు ఉపయోగపడుతుంది.హేమ కమిటీ నివేదిక ప్రచురణకు సంబంధించిన అన్ని సమస్యలను అధిగమించడానికి ఎల్.డి.ఎఫ్ ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేసింది. అంతేగాక అవసరమైన చట్టపరమైన చర్యలను తీసుకుంది. అయితే కేరళలోని కాంగ్రెస్ పార్టీకి దీనికి సంబంధించి ఒకే ఒక ఎజెండా ఉంది. అదేమంటే ప్రభుత్వ ప్రయత్నాలను ఏదో ఒక విధంగా అడ్డుకోవడమే. సినీ పరిశ్రమలో మహిళల న్యాయ పోరాటానికి ఎల్.డి.ఎఫ్ ప్రభుత్వం మద్దతుగా నిలిచినప్పుడు, లైంగికదాడుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రక్షించే పార్టీగా కాంగ్రెస్ మారింది. మీడియాలోని కమ్యూనిస్టులకు వ్యతిరేకమైన ఓ వర్గం వారికి మద్దతు ఇస్తున్న పరిస్థితి నెలకొంది. దర్యాప్తు బృందానికి అందిన ఫిర్యాదు ఆధారంగా సీపీఐ(ఎం) ఎమ్మెల్యే ముఖేష్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం నిందితులను కాపాడుతోందన్న కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలను తోసిపుచ్చింది.

ఇలాంటి విషయాల్లో 'వారు చేశారు కాబట్టి మేం చేశాం' అనే ధోరణి ఉండకూడదు. ప్రతి చోటా మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించడంపై దృష్టి సారించాలి. హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో-సినీ పరిశ్రమలో జరుగుతున్న అన్యాయాలపై ధైర్యంగా పోరాడేందుకు ప్రభుత్వం, సమాజం తమకు తోడుగా నిలుస్తున్నాయని మహిళలు విశ్వసించాలి. కేరళకు ఇది ఒక చారిత్రాత్మక ఘట్టం. న్యాయపోరాటంలో హేమకమిటీ నివేదిక మరో మైలురాయి వంటిది. ఇందుకు అండగా నిలిచిన మహిళలకు అభినందనలు. మహిళలు చెప్పింది వింటూ వారికి మరింత బలాన్ని ఇచ్చినందుకు కేరళ వామపక్ష ప్రభుత్వానికి ధన్యవాదాలు.

డ్వాక్రా లోన్ డబ్బులు కట్టలేదని..

- వ్యక్తిని చెట్టుకు కట్టేసి కొట్టిన మహిళలు
- తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని పడాలపల్లిలో ఘటన
- పోలీస్ స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు



నవతెలంగాణ - తూప్రాన్

డ్వాక్రా అంబేద్కర్ మహిళా గ్రూప్ డబ్బులు తీసుకొని బ్యాంకులో లోన్ కట్టలేదని ఓ వ్యక్తిని గ్రూప్ మహిళలు చెట్టుకు కట్టేసి కొట్టిన సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ 11వ వార్డులోని పడాలపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కానుకుంట బిక్షపతి భార్య మిన్ని మోల్ డ్వాక్రా అంబేద్కర్ డ్వాక్రా గ్రూపు మొదటి ఏజెంట్‌గా పని చేస్తున్నది. గ్రూప్ సభ్యులందరితోపాటు 11 నెలలుగా లోన్ తీసుకొని కట్టలేదని, గ్రూప్ డబ్బులు వాడుకున్నారని ఆరోపిస్తూ మహిళలు మంగళవారం రాత్రి గ్రామంలో ఓ చెట్టుకు కట్టేసి తనపై దాడి చేశారని తెలిపాడు. తాను, తన భార్య ఎనిమిది నెలల క్రితం కుటుంబ కలహాలతో విడిపోయామని, తన భార్య తనను విడిచిపెట్టి హైదరాబాద్ వెళ్లి బతుకుతోందని వాపోయాడు. హైదరాబాద్ నుంచి మంగళవారం తన భార్య పడాలపల్లి గ్రామానికి రావడంతో అదును చూసి.. లోన్ డబ్బులు కట్టాలని తనను, తన భార్యను వేధిస్తూ మహిళలు ఇంటిని చుట్టుముట్టి, తనను చెట్టుకు కట్టేసి కొట్టారన్నాడు. అది చూసి తన భార్య భయంతో వేరే వాళ్ళ ఇంట్లోకి వెళ్లి దాక్కుందని, తనను చెట్టుకు కట్టేసి ఇష్టం వచ్చినట్టు బూతులు తిడుతూ, కడుపులో పిడి గుద్దులు గుద్దుతూ దాడి చేశారని తెలిపాడు. ఈ మేరకు బాధితుడు కానుకుంట బిక్షపతి తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తూప్రాన్ పోలీసులకు బుధవారం ఉదయం ఫిర్యాదు చేశాడు.

అప్పుల బాధతో.. కౌలు రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-తొగుట



అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని కాన్గల్ గ్రామంలో జరిగింది. బుధవారం ఎస్ఐ రవికాంతరావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దొమ్మాట స్వామి (32) అదే గ్రామానికి చెందిన పెద్దమ్యాతరి మల్లయ్య వద్ద ఐదేండ్ల కిందట మూడెకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతివృష్టి, అనావృష్టితో పంటలు సరిగ్గా పండక అప్పులు పెరిగిపోయాయి. వాటికి తోడు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. దాంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక జీవితంపై విరక్తి చెంది తాను కౌలుకు చేస్తున్న వ్యవసాయ పొలం వద్దనున్న వేప చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య దొమ్మాట లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు. ఇంటి యజమాని మృతితో కుటుంబం రోడ్డున పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.oo

జమ్మికుంటలో పత్తి క్వింటాల్ రూ.7,800

- ఈ ఏడాది ఇదే అత్యధిక ధర

నవతెలంగాణ - జమ్మికుంట

కరీంనగర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో ఈ ఏడాది మొదటి సారి పత్తి ధర క్వింటాలుకు రూ.7,800 పలికింది. ఈ సంవత్సరం ఇదే అత్యధిక ధర. బుధవారం మార్కెట్‌కు కాటన్ విడి పత్తి 131 క్వింటాళ్లను ఎనిమిది వాహనాల్లో రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. గరిష్ట ధర రూ.7,800, మోడల్ ధర 7,600, కనిష్ట ధర 7,400 పలికిందని మార్కెట్ సెక్రెటరీ ఆర్ మల్లేశం తెలిపారు.

మండలిలో ప్రతిపక్ష నేతగా మధుసూదనాచారి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా మధుసూదనాచారిని మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి గుర్తించారు.ఈమేరకు బుధవారం అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. అంతకు ముందుకు బీఆర్ఎస్ శాసనమండలి పక్ష నేతగా ఎమ్మెల్సీ కడియం శ్రీహరి వ్యవహరించారు. ఆయన స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో బీఆర్ఎస్ విజ్ఞప్తిమేరకు మండలి చైర్మెన్ ఆయన్ను గుర్తించారు.

'యాదాద్రి'లో 2025 మార్చి నాటికి విద్యుత్ ఉత్పత్తి

డిసెంబర్ చివరి నాటికి మూడో యూనిట్ ప్రారంభం

- భూనిర్వాసితుల త్యాగం మరువలేనిది
- భూసేకరణ నిధులతోపాటు ఉద్యోగాలిస్తాం..
- యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు పనులపై డిప్యూటీ సీఎం సమీక్ష
- భట్టిని అడ్డుకున్న భూనిర్వాసితులు





నవతెలంగాణ- మిర్యాలగూడ

వచ్చే మార్చి 31 నాటికి యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ అన్ని యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి భట్టి నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఆయిల్ సింక్రనైజేషన్‌కు స్విచ్ ఆన్ చేశారు. అనంతరం పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఈ సంవత్సరం డిసెంబర్ చివరి నాటికి 3 యూనిట్ల ద్వారా 2400 మెగా యూనిట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ ఉత్పత్తి ప్రారంభిస్తామని తెలిపారు. వచ్చే సంవత్సరం మార్చి 31 నాటికి అన్ని స్టేజీల్లో అన్ని యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడం లక్ష్యంగా నిర్ణయించినట్టు తెలిపారు. సివిల్ పనులతో పాటు బొగ్గు రవాణా వ్యయాన్ని తగ్గించేందుకు రైల్వే పనులను సైతం వేగవంతం చేసేలా పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. ఇదే వేగంతో ప్రాజెక్టు పనులు పూర్తిచేసి యూనిట్ విద్యుత్తును రూ.6.35లకు ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పూర్తయితే రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి ప్రజలు ఎంతో విలువైన భూములను ఇచ్చి త్యాగం చేశారని, వారికి భూసేకరణ నిధులతోపాటు, ప్రాజెక్టులో తప్పనిసరిగా ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం వారిని గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని, ఆ కుటుంబాల్లో నిరుద్యోగులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు.

సమయానికి పూర్తికానందున ఆర్థిక భారం

2015 జూన్ 8న శంకుస్థాపన జరిగిన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ప్రాజెక్టు పనులు 2017లో ప్రారంభం అయ్యాయని, 2020 అక్టోబర్ నాటికి 2 యూనిట్లు, 2021 నాటికి మూడు యూనిట్లు పూర్తి చేయాలని గత ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందని భట్టి తెలిపారు. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేయకపోవడం వల్ల ప్రజలపై ఆర్థిక భారం పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల ఉత్పత్తి వ్యయం పెరిగిందని, గత ప్రభుత్వం 50శాతం దేశీయ బొగ్గును, 50 శాతం విదేశీ బొగ్గును వాడాల్సి ఉండగా, దానికి విరుద్ధంగా నూటికి నూరు శాతం దేశీయ బొగ్గును వాడటం వల్ల ఎన్జీటీ క్లియరెన్స్ రాలేదని అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఎన్జీటీ క్లియరెన్స్‌ను తీసుకోవడంతోపాటు నిరంతరం అధికారులతో సమీక్షించడం, ప్రతిరోజూ ప్రాజెక్టు పనులపై పర్యవేక్షణ చేస్తున్నట్టు చెప్పారు.

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. వైటీపీఎస్‌తోపాటు పులిచింతల ప్రాజెక్టులో భూములు కోల్పోయిన వారికి తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆదేశించిన ఉప ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. వైటీపీఎస్‌లో చిన్న చిన్న సబ్ కాంట్రాక్టర్స్‌కు పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని, ట్రాన్స్‌ఫార్మర్స్, సబ్‌స్టేషన్‌లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను త్వరితగతిన పూర్తిచేయాలని తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. ఇందులో భాగంగానే ఈ డిసెంబర్ నాటికి మూడు యూనిట్లు, మార్చి 2025 నాటికి అన్ని యూనిట్లు పూర్తి చేసి విద్యుత్‌ను అందించనున్నట్టు చెప్పారు. భూములు ఇచ్చిన వారికి జాబితా రూపొందించి వారికి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు.

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పనుల పురోగతిపై సమీక్ష

ప్రాజెక్టు పనుల పురోగతిపై జరిగిన సమీక్షలో రాష్ట్ర ఎనర్జీ సెక్రెటరీ, చైర్మెన్ టీజీ జెన్కో ఎండీ రోనాల్డ్ రోస్ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ అన్ని యూనిట్ల పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ స్టేజ్ వన్, స్టేజి 2లోని అన్ని యూనిట్లనూ నిర్దేశించిన సమయం ప్రకారం పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్లాంట్ పూర్తయ్యేనాటికి ఆర్ అండ్ బీ రోడ్డును కూడా పూర్తి చేయాలని, ఈ విషయమై మంత్రితో సమన్వయం చేసుకొని తక్షణమే టెండర్లు పిలిచి పనులు పూర్తి చేసేలా చూడాలన్నారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రాజెక్టు పూర్తయ్యేనాటికి రహదారుల నిర్మాణం పూర్తి చేయాలని, అంతేకాక భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ప్రాజెక్టు డైరెక్టర్లు సచ్చిదానంద, అజయ్, చీఫ్ ఇంజినీర్ సమ్మయ్య, పీవీ శ్రీనివాస్, జి.శ్రీనివాసరావు, ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

భూనిర్వాసితుల నిరసన

యాదాద్రి పవర్‌ప్లాంట్‌ను సందర్శించేందుకు వచ్చిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ముందు భూనిర్వాసితులు నిరసన తెలిపారు. 2018 నుంచి ఉద్యోగాలు కల్పించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రామగుండం, భూపాలపల్లి, పాల్వంచ ప్రాజెక్టుల నుంచి 600 మంది సిబ్బందిని తీసుకొచ్చి ఇక్కడ పని చేయించుకుంటున్నారని, మాకు ఉద్యోగాలు ఇవ్వకుండా వారికి ఉపాధి కల్పించడం సరైంది కాదని కపూర్‌తండా, మొద్దులకుంటతండా గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు కోల్పోయి.. ఉపాధి లేక 178 కుటుంబాలు వలస వెళ్లాయని తెలిపారు. స్పందించిన భట్టివిక్రమార్క నెల రోజుల్లో ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన మీరు దేవుళ్ల లాంటివారని, మీ త్యాగం మేము మరువబోమని, ఎవరికీ అన్యాయం చేయబోమని చెప్పారు.

పంట పొలాల్లో ఇసుక మేటలు

(మొదటిపేజీ తరువాయి)

కొట్టుకుపోయిన వంతెనలు, రోడ్లు, దెబ్బతిన్న ఇండ్లు, సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన కుటుంబాలను కేంద్ర బృందం కలిసింది. జరిగిన నష్టాన్ని బృంద సభ్యులు అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన పంటలు, రోడ్లు, ఇరిగేషన్ ప్రాజెక్టులను వారు పరిశీలించారు. ఖమ్మం టౌన్‌లో వరదలు ముంచెత్తాయి. కూసుమంచి మండలంలోని పాలేరు జలాశయం అలుగు ప్రాంతంలో ఇసుక మేటలు పెట్టిన పంట పొలాలను పరిశీలించారు. పంటసాగుకు అయిన ఖర్చుపై ఆరా తీశారు. పాలేరు పెద్ద కాలువకు పడిన గండ్లను, చిన్న కాలువకు పడిన గండి, మల్లయ్య గూడెం-ఈశ్వర మాదారం గ్రామాల మధ్య వరదకు ధ్వంసమైన వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన నష్టాన్ని రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. పాలేరు అలుగు ప్రాంతంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వరదలకు దెబ్బతిన్న పంటల ఫొటో ఎగ్జిబిషన్‌ను బృందం సభ్యులు పరిశీలించారు. కూసుమంచిలో భగవత్‌వేడు, మల్లాయిగూడెం, భద్రు తండా, ఎర్రగడ్డ తండా, తిరుమలాయపాలెం మండలంలోని రాకాసి తండా గ్రామాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం), తెలంగాణ రైతు సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో కేంద్ర బృందానికి వినతిపత్రం అందజేశారు.

ఖమ్మంరూరల్ మండలం కస్నాతండా, గూడూరుపాడు, తనగంపాడులోనూ బృందం పర్యటించింది. కలెక్టర్ ముజ్మిల్ ఖాన్ దగ్గరుండి కేంద్ర బృందానికి వరద బీభత్సానికి జరిగిన నష్టాన్ని చూపించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించి భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి భూక్య వీరభద్రం బాధితుల పక్షాన కేంద్ర ప్రభుత్వానికి అన్ని సమస్యలు వివరించి వినతిపత్రం అందజేశారు. కేంద్ర హోం శాఖ కార్యదర్శి కీర్తి ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ.. నష్టపోయిన రైతులను, ప్రజలను అన్ని విధాలుగా ఆదుకునే విధంగా కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని హామీ ఇచ్చారు. తిరుమలాయపాలెంలో బీరోలు, రాకాసితండాలో జరిగిన నష్టాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో బృందం సభ్యులు మహేష్‌కుమార్, శాంతినాథ్ శివప్ప, శశివర్ధన్‌రెడ్డి, ఎస్‌కె.కుశ్వాహ, టి.నియల్ కాన్సాన్, కేపీ సింగ్, ఏడీఏ సరిత, సీపీఐ(ఎం) నాయకులు శీలం గురుమూర్తి, తోటకూరి రాజు, మల్లెల సన్మతరావు, బిక్కసాని గంగాధర్, ఖమ్మంరూరల్ మండల కార్యదర్శి నంద్ర ప్రసాద్, తిరుమలాయపాలెం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మరిపెడ మండలంలో పరిశీలన

మరిపెడ మండలంలోని అబ్బాయిపాలెం, గాలివారిగూడెం, ఉల్లేపల్లి, సీతారాం తండా గ్రామాల్లో పర్యటించారు. ఉల్లేపల్లి, సీతారాం తండాల్లో వరద బాధితులతో మాట్లాడారు. ముంపు సమయంలో ప్రభుత్వం అందించిన సహాయక చర్యలపై ఆరా తీశారు. వరద ప్రభావం అనంతరం అధికార యంత్రాంగం మౌలిక వసతులు కల్పించిందా అని బృందం సభ్యులు అడిగి తెలుసుకున్నారు. సీతారం తండాలో మంగీలాల్ అనే బాధితుడి ఇంటిని, ఇంట్లోని వస్తువులను పరిశీలించి వరద సమయంలో జరిగిన పరిణామాలను అడిగి తెలుసుకున్నారు. తండా పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అబ్బాయిపాలెంలో పంచాయతీ రాజ్ రోడ్డు పూర్తిగా ధ్వంసం కాగా రహదారిపై రాకపోకలు బంద్ అయినట్టు స్థానికులు బృందం సభ్యులకు తెలిపారు. అంతేకాకుండా పంటపొలాలు కొట్టుకుపోవటంతో పంట నష్టం జరిగిందని రైతులు వివరించారు. గాలివారిగూడెం వద్ద లో లెవల్ వంతెన పూర్తిగా ధ్వంసం కావటంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడిందని ఆ గ్రామ ప్రజలు అధికారులకు విన్నవించారు. చుట్టు పక్కలున్న పొలాల్లో భారీ మొత్తంలో ఇసుక దిబ్బలు, మట్టి దిబ్బలు మేటలు వేయటంతో పంటలు చాలా వరకు దెబ్బతిన్నాయని, వెంటనే తమకు ఆదెరువు చూపించాలని బృందం సభ్యులతో స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వారి వెంట జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్, అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్ అండ్ బీ ఎస్ఈ నాగేందర్ రావు, ఆర్డీవో నర్సింహారావు, తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో విజయ, ఏడీఏ విజయచంద్ర, విద్యుత్ డీఈ మధుసూదన్, ఏడీఈ లోకేష్ రెడ్డి, వ్యవసాయశాఖ అధికారి వీరాసింగ్, ఏఈ పావని, ఎంపీవో ధారవత్ సోమ్లానాయక్, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులున్నారు.

ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్

- మరోసారి తెరపైకి మంత్రివర్గ విస్తరణ
- నేడు అధిష్టానంతో చర్చలు • ఆశావహుల్లో ఉత్కంఠ
- వరదసాయంపై మోడీ, అమిత్ షాను కలవనున్న రేవంత్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇటు కేంద్ర ప్రభుత్వంతోను, అటు కాంగ్రెస్ అధిష్టానంతోనూ పలు అంశాలపై చర్చించేందుకు వీలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం రాత్రి ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. విదేశీ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురువారం ఢిల్లీ చేరుకోనున్న నేపథ్యంలో ఆయనతో సీఎం ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఆ సందర్భంగా మంత్రివర్గ విస్తరణ, మిగిలిన నామినేటెడ్ పోస్టుల భర్తీపై చర్చించనున్నారు. పీసీసీ చీఫ్‌గా నూతనంగా నియమితులైన మహేశ్ కుమార్ గౌడ్ సీఎం కంటే ముందుగానే ఢిల్లీ చేరుకున్న సంగతి విదితమే. ఈ క్రమంలో ఆయనతో కలిసి రేవంత్...సోనియా గాంధీతో భేటీ కానున్నారు. ఆమెతో కూడా మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీపై సమాలోచనలు చేస్తారని తెలిసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఈసారి క్యాబినెట్ విస్తరణ ఖాయంగా కనబడుతోంది. కాంగ్రెస్ హైకమాండ్ కూడా మంత్రివర్గ విస్తరణకు మొగ్గు చూపే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో క్యాబినెట్‌లో బెర్తు కోసం ఎదురు చూస్తున్న ఆశావహుల్లో ఉత్కంఠత నెలకొంది. ప్రస్తుతం ముఖ్యమంత్రితో కలిపి మొత్తం 12 మంది మంత్రులుగా ఉన్నారు.

వీరుగాకుండా మరో ఆరుగురికి మంత్రివర్గంలో చోటు కల్పించేందుకు వీలుంది. దీంతో బెర్తు దక్కించేందుకు సీనియర్లు, జూనియర్లు పోటీ పడుతున్నారు. ఇప్పటికే వారందరూ అధిష్టానం వద్ద తమ తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. వీరిలో గడ్డం వివేక్ (చెన్నూరు), గడ్డం వినోద్ (బెల్లంపల్లి), ప్రేమ్‌సాగర్‌రావు (మంచిర్యాల), కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి (మునుగోడు), సుదర్శన్‌రెడ్డి (బోధన్), మల్‌రెడ్డి రంగారెడ్డి (ఇబ్రహీంపట్నం), రాంమోహన్‌రెడ్డి (తాండూర్) ముందు వరుసలో ఉన్నారు. వీరుగాక బీసీ సామాజిక వర్గం నుంచి శ్రీహరి ముదిరాజ్ (మక్తల్), మైనార్టీ కోటాలో షబ్బీర్ అలీ, అజహరుద్దీన్ మంత్రి పదవులను ఆశిస్తున్నారు. వీరిలో ఎవరెవరికి బెర్తులు దక్కుతాయనేది వేచి చూడాలి.

ప్రధాని అపాయింట్‌మెంట్ కోరిన సీఎంవో

మరోవైపు ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ ప్రధానిని కూడా కలిసే అవకాశముందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ మేరకు సీఎంవో... ప్రధాని అపాయింట్‌మెంట్‌ను కోరింది. ఇటీవల రాష్ట్రంలో సంభవించిన భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టంపై సీఎం, ప్రధానికి ఒక నివేదికను సమర్పించనున్నారని సమాచారం. భారీ స్థాయిలో పంట, ఆస్తి నష్టం సంభవించిన నేపథ్యంలో ఉదారంగా నిధులిచ్చి ఆదుకోవాలని రేవంత్, మోడీని కోరనున్నారు. ఇదే అంశంపై ఆయన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో కూడా భేటీ అవుతారని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి.

(మొదటిపేజీ తరువాయి)

ఆక్రమించుకున్న వారి కారణంగా హైదరాబాద్ నగరంలో వరదలతో పేద ప్రజలు విలవిలలాడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నగరానికి మంచినీళ్ల అందించిన ఉస్మాన్‌సాగర్ పరివాహక ప్రాంతాలను కబ్జా చేసుకొని పలువురు పెద్దలు ఫాంహౌజ్‌లు, విల్లాలను నిర్మించారనీ, వాటి నుంచి ప్రవహించే దుర్గంధపు నీరు ఉస్మాన్‌సాగర్‌లోకి చేరి కలుషితమవుతున్నదనీ, ఈ దుర్మార్గపు చర్యలు చూస్తూ ఊరుకుందామా? అని ఆయన ప్రశ్నించారు. చెరువులు, కుంటలు, నాలాలను ఆక్రమించుకొని నిర్మాణాలు చేసినవారు ఎంతటివారినైనా వదిలిపెట్టబోమనీ, వారి నిర్మాణాలను 'హైడ్రా' నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో జరిగిన నిర్మాణాలను క్రమబద్ధీకరించే ప్రశ్నే లేదని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

డ్రగ్స్ రహిత తెలంగాణను రూపుదిద్దుదాం

'పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు'

తెలంగాణ రాష్ట్రంలో గత తొమ్మిదేండ్లలో నిరుద్యోగులను అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదనీ, తాము అధికారంలోకి రాగానే 30 వేల మంది ఉద్యోగుల నియామకాలు జరిపినట్టు సీఎం తెలిపారు. గతంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జరిగిన లోపాలను సరిదిద్ది, ఈ విభాగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేశామనీ, నిరుద్యోగ యువతలో విశ్వాసాన్ని పెంపొందిస్తూ ఉద్యోగ నియామకాలను పారదర్శకంగా చేపడుతున్నామని ఆయన చెప్పారు. లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధిని కల్పించే లక్ష్యంతో విదేశీ పెట్టుబడులను తీసుకు వస్తున్నామన్నారు. రైతన్నలు, గీతన్నలు, నేతన్నల జీవితాల్లో కొత్త వెలుగులు నింపటానికి ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నదని సీఎం చెప్పారు.

గత 22 రోజుల్లోనే 22,22,680 మంది రైతుల రుణాలను రూ.18 వేల కోట్లు వెచ్చించి, తీర్చి వారి కండ్లల్లో వెలుగును చూశామని రేవంత్‌రెడ్డి తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని రైతుల అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని ఆయన చెప్పారు.

'శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసులు భేష్'శాంతి భద్రతలను కాపాడటంతో పాటు ప్రజల అనేక సమస్యలను తీర్చటంలో పోలీసులు ముందంజలో ఉన్నారని ఆయన మెచ్చుకున్నారు. పోలీసులది కేవలం ఉద్యోగం కాదనీ, భావోద్వేగంతో కూడుకున్న ఆశయాలు వారికి ఉన్నాయని అన్నారు. ఉన్నత స్థాయిలో పోలీసు అధికారులు నిర్ణయించే పాలసీలను క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేసి, ఫలితాలను సాధించే గురుతర బాధ్యత కింది స్థాయి పోలీసు అధికారులు, సిబ్బందికి ఉన్నదని ఆయన అన్నారు. కొత్తగా విధుల్లో చేరుతున్న ఎస్సైలపై తెలంగాణను మరింత సుభిక్షంగా తీర్చిదిద్దే బాధ్యత ఉన్నదని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

అంతకముందు, పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ.. మొత్తం 547 మంది ఎస్సైలు ఏడాది కాలంలో అన్ని రంగాల్లో శిక్షణ పొందారని అన్నారు. రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్.. కొత్తగా విధుల్లో చేరబోతున్న ఎస్సైలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

హైడ్రా హైస్పీడ్

పైరవీలు, ఒత్తిళ్లు బేఖాతర్

- ఆక్రమణలు, వాణిజ్య సముదాయాలు, ఫాంహౌజ్‌లు, లేఔట్లు నేలమట్టం
- 262 అక్రమ నిర్మాణాల కూల్చివేత
- 111.72 ఎకరాల భూమి స్వాధీనంపై ప్రభుత్వానికి నివేదిక

హైడ్రా హైస్పీడ్‌తో దూసుకెళ్తోంది. ప్రభుత్వ స్థలాలు, జంట జలాశయాలు, నాలాల పరిరక్షణ లక్ష్యంగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) చేపట్టిన ఆపరేషన్‌తో ప్రముఖుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. తమ నిర్మాణాల జోలికి రాకుండా ఎన్ని పైరవీలు చేస్తున్నా హైడ్రా కమిషనర్ ఐజీ రంగనాథ్ డోంట్ కేర్ అంటున్నారు. ప్రభుత్వం తనకు అప్పగించిన బాధ్యతలను నిజాయితీగా అమలు చేసేందుకు వెనుకాడటం లేదు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లో ఉన్న నిర్మాణాలను, లేఔట్లను కూల్చేస్తున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 23 ప్రాంతాల్లో 262 అక్రమ నిర్మాణాలను కూల్చేసిన హైడ్రా 111.72 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంది. ఈ మేరకు బుధవారం హైడ్రా ప్రభుత్వానికి నివేదించింది. రెండున్నర నెలల రిపోర్టును అందజేసింది.





నవతెలంగాణ-సిటీబ్యూరో

కమిషనర్ ఐజీ రంగనాథ్ నేతృత్వంలో ముందుకెళ్తున్న హైడ్రా దూకుడుకు బ్రేక్‌లు వేయాలని పలువురు రాజకీయ నాయకులు, కార్పొరేట్లు, బిల్డర్లు, రియల్టర్లు ఎన్ని ఒత్తిళ్ళ, జిమ్మిక్కులు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. చెరువుల పరిరక్షణ లక్ష్యంతో ఏర్పాటైన హైడ్రాను మరింత బలోపేతం చేస్తోంది. అయితే, ఆక్రమణల కూల్చివేత సందర్భాల్లో కొందరు ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ తరుణంలో హైడ్రాకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ సిబ్బంది కేటాయింపుతోపాటు మరికొంతమంది అధికారులను కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు తెలిసింది. రెవెన్యూ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, నీటి పారుదల, పంచాయతీరాజ్, రోడ్లు-భవనాలు తదితర ముఖ్య శాఖలతోపాటు హైడ్రాను చేర్చనున్నారు. ఇప్పటి వరకు భూ ఆక్రమణలకు సంబంధించిన నోటీసులు కలెక్టర్, ఆర్డీవో, ఇరిగేషన్, ఫైర్, తహసీల్దార్ ఆధ్వర్యంలో ఇస్తున్నారు. మున్సిపల్ పరిధిలోనైతే ఇది ఆయా సంస్థలకు ఉంటుంది. కానీ ఆక్రమణ నిర్మాణాలపై నోటీసులు ఇచ్చేందుకు హైడ్రాకు అధికారం లేదు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ముందస్తు నోటీసులు ఇచ్చిన తర్వాత ఆక్రమణలను హైడ్రా నేలమట్టం చేస్తోంది.

పెద్దఎత్తున ఫిర్యాదులు

నగరవ్యాప్తంగా నాలాలు, చెరువులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై హైడ్రా రంగంలోకి దిగినప్పటి నుంచి ప్రజలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నేతల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రజాప్రతినిధుల అక్రమ నిర్మాణాలకు సంబంధించి డ్రోన్ చిత్రాలను 'ఎక్స్'లో పోస్ట్ చేసి వాటిని సైతం కూల్చాలని ఫిర్యాదు చేస్తున్నారు. శివారు ప్రాంతాల్లోనూ ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రయివేటు భూముల్లో పార్కు ఏరియా స్థలాన్ని యజమానులు అమ్ముకోకుండా రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

15 మంది ఇన్‌స్పెక్టర్లు, 8 మంది ఎస్ఐల కేటాయింపు

ప్రభుత్వ ఆదేశాలతో హైడ్రాకు 15 మంది ఇన్‌స్పెక్టర్లు, 8 మంది ఎస్ఐలను పోలీస్ శాఖ కేటాయించింది. అవసరాన్ని బట్టి కానిస్టేబుళ్లనూ డిప్యూటేషన్‌పై పంపించనున్నారు. ఈ నెలాఖరుకల్లా పోలీస్ స్టేషన్ ఏర్పాటే కాకుండా, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్‌తోపాటు తదితర విభాగాల అధికారులూ హైడ్రాకు కేటాయించే అవకాశముంది. హైడ్రా విధులను అడ్డుకున్న వారితోపాటు ఆక్రమణదారులపై ఇప్పటికే వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదవుతున్నాయి.

262 అక్రమ నిర్మాణాల కూల్చివేత

అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను, చెరువులను పరిరక్షించేందుకు రంగంలోకి దిగిన హైడ్రా ఆక్రమణదారుల నుంచి ఇప్పటి వరకు వంద ఎకరాలకుపైగా స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 23 ప్రాంతాల్లో 262 నిర్మాణాలను కూల్చేసిన హైడ్రా 111.72 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంది. జూన్ 27న ఆక్రమణ నిర్మాణాలను నేలమట్టం చేయడం మొదలు పెట్టిన హైడ్రా రెండున్నర నెలలుగా చెరువులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది.మొదటగా ఫిలింనగర్‌లో లోటస్ పాండ్ పార్క్, 1, హయత్‌నగర్‌లో రోడ్డు ఆక్రమణ ఫెన్సింగ్ 1, ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో పార్క్‌ల ఆక్రమణ, గోడల నిర్మాణం 3, బంజారా హిల్స్‌లోని మోతీనగర్‌లో 2, ఫిలింనగర్‌లో బీజేఆర్ నగర్‌లోని నాలా ఆక్రమణపై 1, జాగుల రామారంలో లేక్ ఆక్రమణపై 5 నిర్మాణాలను నేలమట్టం చేసింది. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 10లో ఫుట్‌పాత్ ఆక్రమణపై 1, అమీర్‌పేట్‌లో నాలాలా ఆక్రమణలపై 3 స్లాబ్‌లను కూల్చేసింది. రామ్‌నగర్ మణెమ్మ గల్లీలో 3, గగన్‌పహాడ్ అప్పా చెరువులో 14, అమీన్‌పూర్ పెద్ద చెరువు పరిధిలో 24, మాదాపూర్ సున్నం చెరువులో 42, దుండిగల్ కత్వా చెరువు పరిధిలో 13 అక్రమ నిర్మాణాలను తొలగించినట్టు హైడ్రా వెల్లడించింది. అత్యధికంగా అమీన్‌పూర్‌లో 51 ఎకరాలు, మాదాపూర్ సున్నం చెరువు పరిధిలో 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుంది.

పవర్ ప్లాంట్‌లో కాపర్ దొంగల అరెస్ట్

- రూ.26 లక్షలు రికవరీ
- ఎస్పీ శరత్ చంద్ర పవార్ వివరాలు వెల్లడి

నవతెలంగాణ-మిర్యాలగూడ

నల్లగొండ జిల్లా దామచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలో నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో బీహెచ్ఈఎల్ కంపెనీకి చెందిన కాపర్ సామగ్రిని దొంగిలించిన ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.26 లక్షలు రికవరీ చేసి రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. బుధవారం స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం ఈదులగూడెంలోని పగడాల బాలరాజు పాత ఇనుము షాపు పరిసరాల్లో పోలీసులు నిఘా వేశారు. అక్కడ మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఇనుము వ్యాపారి మేకల శ్రీనివాస్, దామరచర్ల మండలం తాళ్ల వీరప్పగూడెం గ్రామానికి చెందిన బెల్ట్‌షాపు నిర్వాహకుడు పెండెం భాస్కర్, సాత్ తండాకు చెందిన గుగులోతు రఘు, వీర్లపాలెంకు చెందిన కొర్ర శివ, తాళ్ల వీరప్పగూడెంకు చెందిన చెన్నబోయిన నాగయ్య, సాత్ తండాకు చెందిన గూగులోతు రాముడు, మిర్యాలగూడ పట్టణానికి చెందిన పాత ఇనుము వ్యాపారులు బత్తుల జానకి రాములు, పగడాల బాలరాజును అరెస్టు చేశారు.

వీరు కొంతకాలంగా వైటీపీఎస్ పక్కన ఉన్న వాగు నుంచి రాత్రి సమయంలో ప్లాంట్‌లోకి ప్రవేశించి.. బీహెచ్ఈఎల్ కంపెనీకి చెందిన స్టోర్ యార్డ్ వద్ద సెక్యూరిటీ సిబ్బంది లేని సమయం చూసి ప్రతి స్టోర్‌లో ఉన్న మెటీరియల్ యార్డ్లో గల కాపర్ వస్తువులను దొంగిలిస్తున్నారు. వాటిని నిర్మానుష్య ప్రాంతాల్లో పోగుచేసిన అనంతరం క్యాంపర్ వాహనాల్లో క్లోజ్ చేసుకుని వాటిని మిర్యాలగూడకు చెందిన పాత ఇనుము వ్యాపారులకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. రెండేండ్లుగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇందులో ప్రధాన నిందితుడు మేకల శ్రీనివాస్. అతనిపై ఇప్పటికే మూడు కేసులు నమోదయ్యాయి. రౌడీ షీట్ నమోదు చేశారు. డీఎస్పీ రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో కేసును ఛేదించిన సీఐలు నాగార్జున కె.వీరబాబు, సీసీఎస్ సీఐ జితేందర్ రెడ్డి, సిబ్బంది విష్ణు వర్ధన్ గిరి, పుష్పా గిరి, వాహిద్ పాషాను ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో డీఎస్పీ రాజశేఖర్ రాజు, సీఐ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీ వద్ద నీటి ప్రవాహం కొలతల సేకరణ

నవతెలంగాణ-మహాదేవపూర్



జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల పరిధి కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీని పూణేకు చెందిన శాస్త్రవేతలు డాక్టర్ సంపత్, నాగరాజు బుధవారం సందర్శించారు. నీటి ప్రవాహపు అంచనా కొలతలు సేకరించారు. ఎన్డీఎస్ఏ ఆదేశాల మేరకు కాళేశ్వరం ప్రాజెక్టు ఈఈ, డీఈల పర్యవేక్షణలో శాస్త్రవేత్తలు అకౌస్టిక్ డాప్లర్ కరెంట్ ప్రొపెల్లర్ (ఏడీసీపీ) పరికరాన్ని అమర్చి కొలతలు చేపట్టారు. బ్యారేజీకి ఎగువన ప్రవాహం అంచనా వేశారు. కొన్ని రోజుల క్రితం అన్నారం, సరస్వతీ బ్యారేజీ కొలతలు కూడా సేకరించారు. వారి వెంట స్థానిక ఈఈలు, డీఈలు ఉన్నారు.

ప్రజల హెల్త్ ప్రొఫైల్‌ను యాప్‌లో నమోదు చేయాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్‌ను డిజిటల్ రూపంలో యాప్‌లో నమోదు చేయాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. బుధవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ ప్రొఫైల్ ఆఫ్ ఇండివిడ్యువల్స్ ఇన్ ది ఫ్యామిలీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్ ఆరోగ్య అవసరాలకు ఇది చాలా ముఖ్యమని సూచించారు. రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 83.04 లక్షల కుటుంబాల్లోని కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను వారి వద్దకు వెళ్లి సేకరించాలన్నారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూ తదితరులతో పాటు ప్రయివేటు ఆస్పత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 527 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో బుధవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 527 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 80, విద్యుత్ శాఖకు సంబంధించి 79, మైనారిటీ వెల్ఫేర్‌కు సంబంధించి 68, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 63, ఇతర శాఖలకు సంబంధించి 237 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైనా పట్టించుకోరా..

- రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య
- పౌష్టికాహారంతోనే ఆరోగ్యం : ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్
- రాష్ట్ర ప్రభుత్వం కులగణనకు సిద్ధం : మాజీ ఎంపీ వి.హనుమంతరావు
- బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సదస్సు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

బీసీ సంక్షేమ హాస్టల్స్, గురుకులాల్లో ఇటీవల ఫుడ్ పాయిజన్‌తో 36 మంది విద్యార్థులు చనిపోయారనీ, 800 మంది అస్వస్థతకు గురైనా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లపల్లి అంజి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ యువజన సంఘం రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ హాస్టల్స్‌లో విద్యార్థులు పాము కాటుకు బలవుతున్నా పట్టించుకునే నాథుడేలేడని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాలను అభివృద్ధి చేసి సొంత భవనాలు నిర్మించాలని, ఉన్నత వృత్తి విద్యా కోర్సుల్లో బీసీ విద్యార్థులను ప్రోత్సహించడానికి ఫీజు బకాయిలు విడుదల చేయాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలను రూ.3 వేలకు పెంచాలన్నారు. వెంటనే బీసీ కులగణన చేపట్టి స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, విద్యా, ఉద్యోగ రంగాల్లో జనాభా దమాషా ప్రకారం బీసీల రిజర్వేషన్లను 52 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. బీసీలకు అన్యాయం చేస్తున్న రోస్టర్ పాయింట్లను మార్చాలని, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు బీసీ గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. విదేశీ విద్య స్టైఫండ్ పథకం కింద అర్హులైన వారందరికీ స్టైఫండ్ చెల్లించడానికి బడ్జెట్‌ను రూ.60 కోట్ల నుంచి రూ.300 కోట్లకు పెంచాలని, బీసీ స్టడీ సర్కిల్‌కు రూ.200 కోట్లు కేటాయించాలని అన్నారు. బడ్జెట్‌లో బీసీ కార్పొరేషన్‌కు సబ్సిడీ రుణాల పంపిణీకి రూ.4 వేల కోట్లు కేటాయించాలని, బీసీ ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చాలని కోరారు.

ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ.. హాస్టల్ విద్యార్థులకు పౌష్టికాహారం పెడితేనే ఆరోగ్యంగా ఉంటారని, నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని కోరారు. విద్యార్థులకు ఉపకార వేతనాల పెంపు న్యాయమైన డిమాండ్ అని దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేయడానికి సిద్ధంగా ఉందని, ఇప్పటికే రూ.150 కోట్ల నిధులను కేటాయించిందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర సర్వే నిర్వహించి బయట పెట్టకుండా తొక్కి పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు గవ్వల భరత్, పగిళ్ల సతీష్, తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ నీల వెంకటేష్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, బీసీ రాష్ట్ర నాయకులు గొరిగె మల్లేష్, గుజ్జ సత్యం, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

మెడికల్ రెప్రెజెంటేటివ్స్‌కు చట్టబద్ధ పనిపద్ధతులు కల్పించాలి

- దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమయ్యేలా చూడండి : ఎంపీలకు తెలంగాణ మెడికల్ అండ్ రెప్రెజెంటేటీవ్స్ యూనియన్ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దీర్ఘకాలికంగా పరిష్కారం కాని సమస్యలపై కేంద్ర ప్రభుత్వం స్పందించేలా పార్లమెంట్‌లో తమ సమస్యలను ప్రస్తావించాలని ఎంపీలను తెలంగాణ మెడికల్ అండ్ రెప్రెజెంటేటీవ్స్ యూనియన్ నేతలు కోరారు. అందులో భాగంగా బుధవారం హైదరాబాద్‌లో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రాలు అందజేశారు. సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని ఎంపీలు టీఎంఎస్ఆర్‌యూ బృందానికి హామీ ఇచ్చారు. ఎంపీలను కలిసిన వారిలో టీఎంఎస్ఆర్‌యూ ప్రధాన కార్యదర్శి సీహెచ్ భాను కిరణ్, సంయుక్త ప్రధాన కార్యదర్శి ఎ.నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు లోకేశ్వర్‌రెడ్డి, రాజ్‌కుమార్, సతీష్‌లు పాల్గొన్నారు.

గాంధీ ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై దాడి

- పోలీసుల అదుపులో నిందితుడు
- రక్షణ కల్పించాలని సూపరింటెండెంట్‌కు జూడాల విజ్ఞప్తి

నవతెలంగాణ-బేగంపేట



హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై దాడి జరిగింది. ఇతర సిబ్బంది అతన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకెళ్తే.. ప్రకాష్ అనే వ్యక్తి ఓ రోగి సహాయకుడిగా బుధవారం గాంధీ ఆస్పత్రికి వచ్చాడు. అక్కడ ఎమర్జెన్సీ వార్డులో విధులు నిర్వహిస్తున్న ఓ జూనియర్ వైద్యురాలిపై దాడికి యత్నించాడు. ఆప్రాన్ లాగి, దాడి చేసేందుకు యత్నించడంతో అక్కడే ఉన్న ఇతర సిబ్బంది అడ్డుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో అతన్ని అదుపులోకి తీసుకుని చిలకలగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాడి చేస్తున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. కాగా, సదరు వ్యక్తికి మూర్ఛ వ్యాధి ఉన్నట్టు, దాడి చేసిన సమయంలో మద్యం కూడా సేవించి ఉన్నట్టు పోలీసులు నిర్ధారించారు.

కఠిన చర్యలు తీసుకోవాలి: జూడాలు

మహిళా డాక్టర్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని గాంధీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. దాడి అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజకుమారిని జూడాలు కలిశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తమకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ చెప్పారు. బందోబస్తు కూడా పెంచనున్నట్టు హామీ ఇచ్చారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి-టీ జూడా

సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలోని క్యాజువాలిటీ విభాగంలో మద్యం మత్తులో ఉన్న రోగి మహిళా డాక్టర్ పై దాడి చేయడం దుర్మార్గమని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా) ఖండించింది. టీజూడా ఆధ్వర్యంలో ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఈ ఘటనపై ఫిర్యాదు చేసినట్టు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు.

శ్రామికవర్గ రాజ్యం కోసం ఐక్యమవ్వాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ

నవతెలంగాణ-వాజేడు



తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో శ్రామిక రాజ్య స్థాపనకు ఐక్యంగా ముందుకు సాగాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. బుధవారం ములుగు జిల్లా వాజేడు మండలంలో పేదలు గుడిసెలు వేసుకొని ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 77ఏండ్లు అవుతున్నా నేటికీ పేదలకు కల్పించాల్సిన కూడు, గూడు, ఇంటి జాగా, విద్య, వైద్యం కనీస వసతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించకుండా ప్రజలను మోసగిస్తున్నాయని విమర్శించారు. నాడు తెలంగాణలో భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఎర్రజెండా నాయకత్వంలో భూస్వాములు, జాగిర్దార్లకు, జమిందార్లు, రజాకార్లకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం జరిగిందని గుర్తుచేశారు. పేదల పక్షాన 4000మంది ఎర్రజెండా బిడ్డలు రక్త తర్పణం చేశారని, ఫలితంగా లక్షల ఎకరాల భూమి పేదలకు పంచిన చరిత్ర ఎర్రజెండదేనని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలకు, ఇంటి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామన్న కాంగ్రెస్ ఎన్నికల హామీని అమలు చేయట్లేదని ఆరోపించారు. పైగా పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల పక్షాన ఏ ఒక్క పార్టీ పోరాడిన చరిత్ర లేదని, పేదల కోసం పోరాడేది ఎర్రజెండా పార్టీ మాత్రమేనని అన్నారు. గుడిసెలు వేసుకొని ఏడాది పూర్తవుతున్న సందర్భంగా గుడిసె వాసులకు ఇంటి స్థలాలకు పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇల్లు కట్టించి, కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బీరెడ్డి సాంబశివ, జిల్లా కమిటీ సభ్యులు ఎండీ దావూద్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నయా ఉదారవాద విధానాల్ని తిప్పికొట్టాలి



- కార్మికుల పట్ల కేంద్రం తీరుపై పోరాటాలకు సిద్ధం కావాలి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కార్మికుల పట్ల నయా ఉదారవాద విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ కార్మికులకు పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నయా ఉదారవాద విధానాల్ని అమలు చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తుందని అన్నారు. 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచి కార్మికులను ఒత్తిడికి గురి చేస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వ సంస్థలైన ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, రైల్వే, రవాణా వ్యవస్థలను ప్రయివేటు పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు రిక్రూట్ చేయకుండా ఔట్‌సోర్సింగ్ పద్ధతులను పాటించి నిరుద్యోగాన్ని పెంచుతుందని వాపోయారు. దేశంలో నిత్యవసర సరుకుల ధరలను నియంత్రించడంలో కేంద్రం విఫలమైందని అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కనీస వేతనాలు రూ.26,000 కార్మికులకు ఇవ్వాలని, లేకపోతే భవిష్యత్తులో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, జిల్లా ఆఫీస్ బేరర్స్ నన్నేసాహెబ్, జంగం గంగాధర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

జిల్లాల్లో ప్రజాపాలన దినోత్సవం ప్రతినిధులు వీరే..

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17వ తేదీని తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల ప్రధాన కార్యాలయాల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించే ప్రజా ప్రతినిధులను ప్రభుత్వం ప్రకటించింది. వీరిలో పలువురు మంత్రులు, కార్పొరేషన్ల చైర్మెన్లు ఉన్నారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి జాతీయపతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరిస్తారు. ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ సలహాదారు (ఎస్సీ,ఎస్టీ,ఓబీసీ, మైనార్టీ వెల్ఫేర్) మహ్మద్ అలీ షబ్బీర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తారు. హన్మకొండలో మంత్రి కొండా సురేఖ, జగిత్యాలలో ప్రభుత్వ విప్ ఏ లక్ష్మణ్‌కుమార్, జయశంకర్ భూపాలపల్లిలో తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ పోడెం వీరయ్య జనగాంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య జోగులాంబ గద్వాలలో ప్రభుత్వ సలహాదారు (స్పోర్ట్స్ అఫైర్స్) స్పెషల్ రిప్రజెంటేటివ్ ఏపీ జితేందర్‌రెడ్డి, కామారెడ్డిలో తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ పటేల్ రమేష్ రెడ్డి, కరీంనగర్‌లో మంత్రి డీ శ్రీధర్‌బాబు, ఖమ్మంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవవందనం స్వీకరిస్తారు. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష్, మహబూబాబాద్‌లో ప్రభుత్వ విప్ జే రాంచదర్ నాయక్, మహబూబ్‌నగర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు, మంచిర్యాలలో ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్ అండ పబ్లిక్ రిలేషన్స్) హరకర వేణుగోపాలరావు, మెదక్‌లో ప్రభుత్వ సలహాదారు (పబ్లిక్ అఫైర్స్) కే కేశవరావు, మేడ్చల్‌లో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ములుగు జిల్లాలో మంత్రి దనసరి అనసూయ సీతక్క, నాగర్‌కర్నూల్‌లో ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మెన్ జీ చిన్నారెడ్డి, నల్గొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నారాయణ్‌పేట్‌లో తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ గుర్నాధ్‌రెడ్డి, నిర్మల్‌లో తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ చైర్‌పర్సన్ చైర్‌పర్సన్ సిరిసిల్ల రాజయ్య, నిజామాబాద్‌లో తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనిల్ ఎరవత్రి, పెద్దపల్లిలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ సలహాదారు (పబ్లిక్ అఫైర్స్) వేం నరేందర్‌రెడ్డి, సంగారెడ్డిలో మంత్రి దామోదర రాజనర్సింహా, సిద్దిపేటలో మంత్రి పొన్నం ప్రభాకర్, సూర్యాపేటలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వికారాబాద్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, వనపర్తిలో ఎస్సీ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ప్రీతం, వరంగల్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాలో శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జాతీయ పతాకాలను ఆవిష్కరించి, గౌరవవందనం స్వీకరిస్తారు.

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయొద్దు

- ఆర్జ్యాతండా అంగన్‌వాడీ కేంద్రంలో ప్రాథమిక విద్యను ప్రారంభించడాన్ని ఆపాలి : స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు సీఐటీయూ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రం గైడ్‌లైన్స్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే చర్యలకు పూనుకోవడం దారుణమనీ, ఆ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత, ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, కోశాధికారి పి.మంగ డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఆర్జ్యాతండాలోని అంగన్‌వాడీ కేంద్రంలోని మూడో తరగతి వరకు పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించే నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ మేరకు బుధవారం వారు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు లేఖ రాశారు. ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసి పేద ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందుతున్న సేవలను దూరం చేయడంతో పాటు అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ ఉపాధికి తీవ్రమైన నష్టం కలిగించే ఈ ఏకపక్ష నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకోవడం దారుణమని పేర్కొన్నారు. నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని చూడటం అన్యాయమని తెలిపారు. మాతా శిశు మరణాలను, పోషకాహార లోపాలను తగ్గించడం, స్కూలు మానివేసే పిల్లల సంఖ్యను తగ్గించడం వంటి లక్ష్యాలకు తూట్లు పొడచడం సబబు కాదని పేర్కొన్నారు. ఐసీడీఎస్ పథకాన్ని స్వతంత్రంగా నడపాలనీ, బడ్జెట్ కేటాయించాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను పర్మినెంట్ చేయడంతోపాటు కనీస వేతనం చెల్లించి, పిఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర సౌకర్యాలు కల్పించాలని విన్నవించారు. ఐసీడీఎస్‌ను విద్యా శాఖలో విలీనం చేసి, బలహీనపరచడం అత్యంత అన్యాయం పేర్కొన్నారు.

నేడు, రేపు టెట్ మార్కుల సవరణ

- 13 తర్వాత అవకాశం లేదు : పాఠశాల విద్యాశాఖ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ)కి దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) మార్కులను సవరణ చేసుకునేందుకు పాఠశాల విద్యాశాఖ అవకాశం కల్పించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురు, శుక్రవారాల్లో టెట్ మార్కులను సవరణ చేసుకోవాలని సూచించారు. ఈనెల 13 తర్వాత టెట్ మార్కులను కలపడం, సవరించుకునే అవకాశం ఉండబోదని స్పష్టం చేశారు. టెట్ మార్కుల సవరణకు https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. ఇప్పుడు ఇచ్చే టెట్ మార్కులనే డీఎస్సీలో పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. జులై 18 నుంచి ఆగస్టు ఐదో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో డీఎస్సీ రాతపరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 2,79,957 మంది దరఖాస్తు చేయగా, 2,45,263 (87.61 శాతం) మంది అభ్యర్థులు రాతపరీక్షలకు హాజరయ్యారు. 34,694 (12.39 శాతం) మంది గైర్హాజరయ్యారు. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- టీఎన్జీవో కార్యవర్గం డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించండి టీఎన్జీవో కేంద్ర సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. టీఎన్జీవో కేంద్ర కార్యవర్గ సమావేశాన్ని బుధవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేనీ ముజీబ్, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ఎన్ సత్యనారాయణగౌడ్, కోశాధికారి రామినేని శ్రీనివాసరావుతోపాటు 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కేంద్ర సంఘం కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తీర్మానం చేశారు. 2022, జులై ఒకటి నుంచి పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని కోరారు. అన్ని రకాల బిల్లులను మంజూరు చేయాలనీ, ఈ-కుబేర్ వ్యవస్థను రద్దు చేయాలనీ, ట్రెజరీ శాఖ ద్వారా బిల్లులను ఇచ్చే పాత విధానాన్ని పునరుద్ధరించాలని సూచించారు. 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ నివేదికను తెప్పించుకుని అమలుకు చర్యలను వేగవంతం చేయాలని తెలిపారు. ప్రభుత్వం, ఉద్యోగులు, పెన్షనర్ల సమాన సహకారంతో ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో అదనపు క్యాడర్ స్ట్రెంథ్‌ను మంజూరు చేయాలని కోరారు. రంగారెడ్డి జిల్లా ఉద్యోగులకు 24 శాతం హెచ్ఆర్ఏ ఇవ్వాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలనీ, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని తెలిపారు. 317 జీవో బాధితుల సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.



సాగర్ డ్యామ్ గేట్ల మూసివేత

- ఎగువ నుంచి తగ్గిన వరద ప్రవాహం

నవతెలంగాణ-నాగార్జునసాగర్

ఎగువన కృష్ణానది పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో బుధవారం నాగార్జునసాగర్ డ్యామ్ క్రస్ట్ గేట్లను ఎన్ఎస్పీ అధికారులు మూసేశారు. బుధవారం ఉదయ 6గంటలకు 4 గేట్ల ద్వారా కొనసాగిన నీటి విడుదల 9గంటలకు ఒక్కసారిగా వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో క్రమేపీ గేట్లను ఎన్ఎస్పీ అధికారులు తగ్గించుకుంటూ పూర్తిగా మూసేశారు. శ్రీశైలం జలాశయం జల విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 43,209 క్యూసెక్కుల వరద నీరు సాగర్ జలాశయానికి విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా.. ప్రస్తుతం 589.20 అడుగుల వద్ద నీరు నిల్వ వుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా, ప్రస్తుతానికి 309.6546 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 29,354 క్యూసెక్కుల నీటిని, కుడి కాలువ ద్వారా 9245 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వారా 2210 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని, లోలేవల్ కెనాల్ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ నుంచి మొత్తం 43,209 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

సమ్మక్క సారక్క ప్రాజెక్ట్ వేగవంతం చేయండి

- అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సమ్మక్క సారక్క ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. బుధవారంనాడిక్కడి జలసౌధ నీటిపారుదల శాఖా కార్యాలయంలో దీనిపై సమీక్ష నిర్వహించారు. ఈ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ నుంచి అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలనీ. కేంద్ర జలసంఘం పలు అంశాలపై లేవనెత్తిన సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణ త్వరగా పూర్తిచేయాలని చెప్పారు. సమ్మక్క సాగర్ ముంపు విషయంలో నష్టపరిహారం విషయమై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో చర్చలు జరపాలని సూచించారు. అలాగే నీటిపారుదల శాఖలో ఆనకట్టలు,కాలువల భద్రతకు అవసరమైన 1,800 మంది లష్కర్‌ల నియామకాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. మేడిగడ్డ, సుందిళ్ళ, అన్నారం ప్రాజెక్టులపై జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ నుంచి తుది నివేదికను త్వరగా తెప్పించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల శాఖ సలహాదారులు ఆదిత్యాదాస్, ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,ఆర్ అండ్ ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఈఎన్సీ అడ్మిన్ అండ్ జనరల్ జీ అనిల్ కుమార్,ఓ అండ్ ఎమ్ ఈఎన్సీ నాగేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నాయకుడు ఆకుల శ్రీనివాస్ టీజేఎస్‌లో చేరిక

- కండవా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కోదండరాం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కార్మికుల హక్కుల కోసం పనిచేయడానికి తెలంగాణ జన సమితి సిద్ధంగా ఉందని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం వెల్లడించారు. కార్మిక నాయకులు, తెలంగాణ ఉద్యమకారుడు ఆకుల శ్రీనివాస్ బుధవారం హైదరాబాద్‌లో పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో టీజేఎస్‌లో చేరారు. కోదండరాం ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. అనంతరం టీజేఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం.నరసయ్య అధ్యక్షతన జరిగిన సభలో కోదండరాం మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికుల గోడు వినే ప్రభుత్వం ఉన్నదని తెలిపారు. జీహెచ్ఎంసీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్‌తో పాటు జీహెచ్ఎంసీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు జహీర్, యాకయ్య తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పల్లె వినయ్, బైరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ సైదాబాద్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-సిటీబ్యూరో

పీఆర్టీయూటీఎస్ సైదాబాద్ మండల నూతన కార్యవర్గం ఎన్నికయ్యింది. సైదాబాద్ మండల శాఖ అధ్యక్షులుగా జి.అంజనేశ్వరరావు, ప్రధాన కార్య దర్శిగా కల్వకోలు వెంకట్‌రెడ్డి ఏకగ్రీవం గా ఎన్నిక య్యారు. సైదాబాద్ మండల శాఖ కార్యవర్గ ఎన్నికలు బుధవారం జీహెచ్ఎస్ మలక్‌పేట్ పాఠశాలలో జరగ్గా దీనికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి టి. తిరుపతి రెడ్డి హాజరై.. నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. సైదాబాద్ మండల శాఖ అసోసియేట్ అధ్యక్షులుగా దామోదర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా జి.రఘువీర్ రెడ్డి, మహిళా ఉపాధ్యక్షులుగా కె. శ్రీవాణి, కార్యదర్శిగా సతీష్, మహిళా కార్యదర్శిగా కె.శ్రీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వి.ప్రశాంత్ రెడ్డి, పరిశీలకులు గా శ్రీనివాస్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ మాజీ అధ్యక్షులు మందాడి వెంకట్ రెడ్డి, రాష్ట్ర నాయకులు సాంబశివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ టీఎస్ సికింద్రాబాద్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-సిటీబ్యూరో

పీఆర్టీయూ టీఎస్ సికింద్రాబాద్ మండల అధ్యక్షులుగా ఎంబి.రవీందర్, ప్రధాన కార్యదర్శిగా ఎం.సంతోష్‌కుమార్ ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన ఈ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బి.మధుసూదన్ రెడ్డి హాజరై వారిని అభినందించారు. ఎన్నికల అధికారిగా జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఏ. ప్రతాపరెడ్డి, పరిశీలకులుగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అశోక్ కుమార్ వ్యవహరించారు. సికింద్రాబాద్ మండల అసోసియేట్ అధ్యక్షులుగా సుమన్ నోయెల్, ఉపాధ్య క్షులుగా ఆర్.రాజేందర్, కార్యదర్శిగా కె.విజయరమణి, మహిళా కార్యదర్శిగా సీహెచ్.వరలక్ష్మి ఎన్నిక య్యారని ఎన్నికల అధికారి ఏ.ప్రతాపరెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ మండల మాజీ అధ్యక్షులు సీహెచ్.నారాయణ, తిరుమలగిరి మండల మాజీ ప్రధాన కార్యదర్శి సైదులు, సైదా బాద్ మండలం మాజీ ప్రధాని కార్యదర్శి లక్ష్మి నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు నటరాజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రాజ్యాంగ వ్యతిరేకంగా ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ తీర్పు'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమని, వెంటనే ఆ తీర్పును రద్దు చేయాలని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మెన్ వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు, క్రిమిలేయర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట మాల మహానాడు కార్యకర్తలతో కలిసి పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన, ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై రాజ్యాంగ వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించి తీర్పును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే దాఖలు చేసిన వందకు పైగా రివ్యూ పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున వర్గీకరణకు క్రిమిలేయర్ అమలుకు రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టడం సరైంది కాదన్నారు. వర్గీకరణకు సీఎం ఎ.రేవంత్ రెడ్డి చర్యలు చేపడితే కాంగ్రెస్‌పై తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ, సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి వడాల భాస్కర్, మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అర్జల రాజు, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు సి.హెచ్.రోజా లీల, డీబీపీ గ్రేటర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పరి సుబ్బారావు, దర్జీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పెండ్యాల సుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివి





నవతెలంగాణ-ధూల్‌పేట్

అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివని అడవుల సంరక్షణ కోసం వారు చేసిన ప్రాణ త్యాగాలకు విలువకట్టలేమని ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ పొదెం వీరయ్య అన్నారు. అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా బుధవారం నెహ్రూ జూలాజికల్ పార్క్ అమరుల స్మారక చిహ్నం వద్ద ఆయన అటవీ దళాల ప్రధాన సంరక్షణాధికారి ఆర్ ఎం. డోబ్రియల్, ఇతర సిబ్బందితో కలిసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ సందేశాలను చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అడవులకు ఆదివాసీలకు అవినాభావ సంబంధం ఉందన్నారు. నిజమైన అడవుల పరిరక్షకులు ఆదివాసీలేనని, అడవులను తాము తల్లిలా భావిస్తామని తెలిపారు. తాను కూడా ఒక ఆదివాసీ బిడ్డనన్నారు. మానవుల తొలి పరిణామక్రమం అడవుల నుంచి ప్రారంభమైం దని అటువంటి అడవుల పరిరక్షణ మనందరి బాధ్యత న్నారు. అడవుల పరిరక్షణ కోసం విధుల్లో మరణిం చిన అటవీ సిబ్బంది త్యాగాలు మరువకూడదన్నారు. అడవుల సంరక్షణ కోసం వారు చేసిన త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని అటవీ శాఖ సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలన్నారు. పచ్చదనం పరిరక్షణ వన్యప్రాణుల సంరక్షణకు మొక్కవోని దీక్షతో ముందుకు సాగాలన్నారు. అటవీ దళాల ప్రధాన సంరక్షణాధికారి ఆర్ఎం. డోబ్రియల్ మాట్లాడుతూ.. 1984 నుంచి ఇప్పటికీ వరకు విధుల్లో ప్రాణాలు కోల్పోయిన 22 మంది సిబ్బంది త్యాగాలు వెలకట్ట లేనివన్నారు. అడవులలో అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా తమ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారని గుర్తుచేశారు. తెలంగాణలో పచ్చదనం పెంచడంలో అటవీశాఖ చేస్తున్న కృషి గొప్పదన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమం ద్వారా 20కోట్ల మొక్కలను నాటాలనే లక్ష్యంగా పెట్టుకున్నమని తెలిపారు..ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్(వైల్డ్ లైఫ్ చీఫ్) ఎలు సింగ్ మేరు, పీసీసీఎఫ్ (సీఎంపీపీ) సువర్ణ, ఐఎఫ్ఎస్ అధికారులు రఘువీర్, పీకే జాహ, అక్బర్, మునీందర్, శంకర్రావు డీఎఫ్ఓ శేఖర్ రెడ్డి ఇతర అటవీ శాఖా సిబ్బంది పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

పండుగలు ప్రశాంత వాతావరణంలో సామరస్యంగా స్నేహపూర్వకంగా జరుపుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బుధవారం మెగా ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతి మండపాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గోనె ప్రదీప్ రావు,మేడి ప్రసాద్, నరేందర్, భాస్కర్ గౌడ్, జనార్ధ, లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ మహిళా యూనివర్సిటీకి 34 కంప్యూటర్ల అందజేత



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కోఠి తెలంగాణ మహిళా యూనివర్సిటీ వర్సిటీ ఐటీ విభాగంలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ విద్యార్థినులకు డేటా సైన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. సామాజిక బాధ్యతలో భాగంగా డెవలప్మెంట్ బ్యాంక్ ఆఫ్ సింగ పూర (డీబీఎస్) టెక్ ఇండియా 34 కంప్యూటర్లను విరాళంగా అందజేశారు. యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్‌ఛాన్సలర్ విజ్ఞులత డేటా సైన్స్ ల్యాబ్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సరస్వతమ్మ, సీఈవో మనీష్ సెహగల్, సుమని అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎదుగుతున్న పిల్లలకు సమతుల్య పౌష్టికాహారం అవసరం..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

చిన్నారులు, విద్యార్థులు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, ఎదుగుతున్న పిల్లలకు సమతుల్య పౌష్టికాహారం అవసరమని మహారాజ్ గంజ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామ్ చందర్ అన్నారు. బుధవారం మహారాజ్ గంజ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు నిత్యం కూరకాయలతో కూడిన వంటలు, తాజా పండ్లు అందించాలన్నారు. సహజంగా ప్రతి సీజన్లలో దొరికే పండ్లను తప్పని సరిగా పిల్లలతో తినిపించాలని, చిరు ధాన్యాలతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఆహారాన్ని వృథా చేయవద్దని, సేంద్రియ ఎరువులతో పండించిన చిరు ధాన్యాలు, కాయకూరలు, పండ్లను మాత్రమే ఇవ్వాలని తల్లి దండ్రులకు సూచించారు. ఈ సీజన్‌లో ఎక్కువగా దోమలు వృద్ధి చెందుతాయని వాటి నివారణకు ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలని సూచించారు. దోమలతో చికెన్ గున్యా, డెంగ్యూ లాంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. చిన్నారులకు దోమతెరలు వాడాలని సూచించారు. జలుబు, జ్వరం ఉన్నట్లయితే వెంటనే వైద్యుని సంప్రదించాలని సూచించారు. చిన్నారుల పట్ల తల్లి దండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గర్భిణీ స్త్రీలు ప్రసవించిన వెంటనే తల్లి చిన్నారికి ముర్రు పాలు తాగించాలని, ముర్రు పాలు అమృతంతో సమానమన్నారు. భవిష్యత్తులో చిన్నారి ఎదుగుదల, రోగ నిరోధక శక్తిని ముర్రుపాలు పెంపొందిస్తుందని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై కోర్టు తీర్పును ఉపసంహరించుకోవాలి

- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ జి.చెన్నయ్య
- వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన, ధర్నా



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఇటీవల ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపడతామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ జి.చెన్నయ్య హెచ్చరించారు. సమితి ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా బుధవారం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జి.చెన్నయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కులాలను వర్గీకరణ చేయుటకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 పరిగణలోకి తీసుకోకుండా వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇస్తుందని ఆయన ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమని విమర్శించారు. అంతే కాకుండా ఇది పూర్తిగా ఎస్సీలను రాజకీయ అధికారానికి దూరం చేసే కుట్రలో భాగమేనన్నారు. కావున ఇప్పటికైనా సుప్రీంకోర్టు తీర్పును పున:పరిశీలించి ఈ తీర్పును వాపస్ తీసుకోవాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు షెడ్యూల్ కులాల అభివృద్ధికి నిరోధకంగా ఉన్నందున ఎస్సీ ఉప కులాల వారీగా వర్గీకరణ చేయడం సాధ్యం కాదని రాష్ట్రపతికి పంపాలని ఆయన కోరారు. ఎస్సీ, ఎస్టీ కులాల అభివృద్ధిపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని, పెరిగిన జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పున:సమీక్షించాలని రివ్యూ పిటిషన్ వేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ డి.సర్వయ్య, కో-కన్వీనర్లు చెరుకు రాంచందర్, వెంకటేశ్వర్లు, జి.రమేష్, బి.చంద్రశేఖర్, ఎస్.నాను పాల్గొన్నారు.

'టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కు అభినందన సత్కారం'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నూతనంగా ఎన్నికైన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌ను బుధవారం రెస్టారెంట్ అండ్ బార్ లైసెన్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.దామోదర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులు బి.బాలరాజ్ గౌడ్, గౌరవ అధ్యక్షులు జి.విజయ్ కుమార్ గౌడ్, ఉపాధ్యక్షులు పి.రాజా గౌడ్, ఈ.రామకృష్ణ గౌడ్, కమిటీ సభ్యులు ఎం.నర్సింగ్, తిరుపతి గౌడ్, మోహన్ గౌడ్ పాల్గొని, బార్ అండ్ రెస్టారెంట్ సమస్యలపై మహేష్ కుమార్ గౌడ్‌కు వివరించడం జరిగిందని జి.దామోదర్ గౌడ్ తెలిపారు.

'ఖమ్మం వరద మేరు కులస్తులను ఆదుకోవడానికి కృషి'



నవతెలంగాణ-ధూల్‌పేట్

గత వారం పది రోజులుగా ఖమ్మంలో కురిసిన వర్షాలతో వరదల సతమతమవుతున్న మేరు కుల బంధువులను ఆదుకోవడానికి తమవంతు కృషి చేస్తున్నామని మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ నాయకుడు, రాష్ట్ర మేరు సంఘం అడ్వైజర్ కీర్తి రాజగోపాల్ అన్నారు. తెలంగాణ మేరు రాష్ట్ర సంఘం ప్యానల్ సభ్యులతో ఖమ్మం మున్నేరు వరద బాధితుల కోసం తమ ప్యానల్ తరపున ఆయన ఆధ్వర్యంలో నిత్యావసర కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కిట్లలో సుమారు 5 వేలు విలువ చేసే ప్రజలకు కావాల్సిన నిత్యావసర సరుకులు, వాటిలో మహిళలకు, మగవారికి, పిల్లలకు, వృద్ధులకు కావాల్సిన బట్టలు, రగ్గులు, దుప్పట్లు కిట్లలో పొందుపరచామన్నారు. సుమారు 50 బాధిత కుటుంబాలకు సక్రమంగా అందేలా కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం తరపున అన్నీ రకాల సహాయ సహకారాలు అందేలా చూస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు


ముషీరాబాద్‌లో


నల్లకుంట డివిజన్‌లోని

నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్‌లోని శ్రీ గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో వారసుగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సైదులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నేత శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షులు నర్సింగ్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ సైదులును ఘనంగా సన్మానించారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

నల్లకుంట డివిజన్‌లోని నర్సింహా బస్తీ వినాయకుడి మండపానికి సందర్శించి ప్రత్యేక పూజలో పాల్గొన్న అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి నాయకులు మైల జనర్ధన్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గోవింద్ నగర్‌లో


గోవిందనగర్‌లో

గణేష్ ఉత్సవాలలో భాగంగా గోల్నాక డివిజన్ పరిధిలోని గోవింద్ నగర్‌లో శ్రీ సిద్ధి వినాయక ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షులు భీమనబోయిన నర్సింగ్ రావు యాదవ్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మా వెంకటరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బి.వెంకట్ రెడ్డి, నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత, బాగ్ అంబర్‌పేట మాజీ కార్పొరేటర్ పద్మ దుర్గాప్రసాద్ రెడ్డి , కాచిగూడ కాంటెస్ట్ కార్పొరేటర్ బద్దుల శిరీష, గోవింద్ నగర్ సంక్షేమ సంఘం చైర్మెన్ కుంబర్తి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కుయ్య అరుణ్ దాస్, సభ్యులు సెట్ల గోపాల, సెట్ల మురళి, బొమ్మ రాజు ఈశ్వర్ రావు, బద్దుల చంద్రకాంత్ యాదవ్ ,మహిళా నాయకులు అనిత యాదవ్, కుంబర్తి జ్యోతి, సెట్ల అపర్ణ, సామల రేణుక, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య మిషన్‌లో కాంట్రాక్టు నర్సింగ్ ఆఫీసర్లను క్రమబద్ధీకరించాలి'



- ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ

నవతెలంగాణ-హిమాయత్ నగర్

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్.హెచ్.ఎం)లో గత అనేక ఏండ్లుగా కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న నర్సింగ్ ఆఫీసర్స్ (స్టాఫ్‌నర్స్)లను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి, ఎన్.హెచ్.ఎం కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఎం.నరసింహ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హిమాయత్ నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం మహిళ విభాగం అధ్యక్షురాలు కొట్టల శాంతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.నరసింహ మాట్లాడుతూ ఎన్.హెచ్.ఎం కాంట్రాక్టు పద్ధతిన నియమించుకునే సందర్భంలోనే వీరికి రూల్ ఆఫ్ రిజర్వేషన్, మెరిట్ ఆధారితంగా సెలక్షన్ చేయటం జరిగిందని, కరోనా లాంటి పరిస్థితుల్లో సైతం పేద ప్రజలకు సేవలు చేస్తూ అండదండగా ఉండి ప్రాణాలను సైతం పణంగా పెట్టిన నర్సింగ్ ఆఫీసర్లను గుర్తించాలని ఆయన కోరారు. కాంట్రాక్టు చట్టం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల బేసిక్ వేతనం కాంట్రాక్టు ఉద్యోగులకు ఇవ్వాలని ఉన్నప్పటికీ వీరికి అతి తక్కువ జీతాలు చెల్లిస్తున్నారని, చట్ట ప్రకారం వీరికి జీతం నెలకు రూ.36,750 ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.29,900 మాత్రమే చెల్లిస్తూ శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, ఉపాధ్యక్షులు ఎస్.బాల సుబ్రమణ్యం, నర్సింగ్ ఆఫీసర్స్ నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి సునీత, రాష్ట్ర మహిళ నాయకులు డి.సంధ్య టి.శ్వేత, స్రవంతి, కె.కవిత, సంగీత, జ్యోతి, సావిత్రి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనార్టీల సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-ముషీరాబాద్

క్రిస్టియన్ మైనార్టీల సమస్యలను పరిష్కరించాలని వారి రాజకీయ ఎదుగుదలకు ప్రత్యేక కృషి చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో క్రిస్టియన్లు ఎదురుకుంటున్న సమస్యలపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎస్తేర్ రాణి, జిల్లా కోఆర్డినేటర్ శ్రావణ్ గండి, రవి కుమార్, ఆంథోని, మరియ మంద కుమార్, తధితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మహేష్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-అంబర్‌పేట

టీపీసీసీ రాష్ట్ర నూతన అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో మరింత బలోపేతం అవుతుందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీల పక్షపాతి అని పార్టీలో బీసీలకు పెద్దపీట వేస్తుందని ఇందుకు నిదర్శనం మహేష్ కుమార్ గౌడ్ నియామకం అని పేర్కొన్నారు. టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన మహేష్ కుమార్ గౌడ్ బుధవారం బాగ్‌అంబర్‌పేటలోని వీహెచ్ హనుమంత రావు ఇంటికి వచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ రోహిన్ రెడ్డి, ఫిషరీస్ చైర్మెన్ మెట్టు సాయి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, పార్టీ నాయకులు లక్ష్మణ్ యాదవ్, జ్ఞానేశ్వర్ గౌడ్, నారాయణస్వామి, లక్పతి యాదగిరి గౌడ్, గరిగంటి రమేష్ రాంబాబు, పులి జగన్, ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణా గౌడ్, ప్రభాకర, షేక్ జమీర్, కోటం అనిల్ ,రావుల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌ను కలిసిన శ్రీకాంత్‌గౌడ్

అంబర్‌పేట నియోజకవర్గానికి పీసీసీ నూతన అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ వచ్చిన సందర్భంగా పీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ కార్పొరేటర్ నారాయణస్వామి, నాయకులు ప్రభాకర్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



తెలంగాణ విలీనం దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ విలీనం దినోత్సవం వేడుకలను ప్రభుత్వం అధికా రికంగా నిర్వహించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ కూనంనేని సాంబ శివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఇందులో భాగంగా ట్యాంక్ బండ్‌పై ఉన్న తెలంగాణ సాయుధ పోరాట యోధులు మగ్దూం మొహియుద్దీన్ విగ్రహం నుంచి లిబర్టీ కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వరకు రెడ్ షర్ట్ వాలంటీర్ల భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా మగ్దూం మొహియుద్దీన్ విగ్రహానికి సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంట రెడ్డి, పశ్య పద్మ, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ కూనం నేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఈ.టి.నర్సింహా, కార్యవర్గ సభ్యులు ఎ.రవీంద్ర చారి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయదేవి, సహాయ కార్యదర్శులు స్టాలిన్, కమతం యాదగిరి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.నారా యణ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఫలితమే భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనమని స్పష్టం చేశారు. అంతటి మహోత్తర పోరాటం జరిగిన తెలం గాణలో నేటికి పాలకులు అధికారికంగా విలీన దినోత్సవ వేడుకలు జరపకపోవడం దారుణమన్నారు. చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఒత్తిడికి తట్టులేక హైదరాబాద్ సంస్థానం ఎక్కడ కమ్యూనిస్టుల వశం అవుతుందోనని, నిజాం రాజు అప్పటి కేంద్ర ప్రభుత్వంతో కలిసి విలీనం నాటకం ఆడారన్నారు. కూనం నేని సాంబశివరావు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4 వేల మంది కమ్యూనిస్టుల వీర మరణంతో పాటు అనేక మంది అనేక త్యాగాల ఫలితంగానే హైదరాబాద్ సంస్థానా నికి విముక్తి లభించింది తప్ప కేంద్ర బలగాల రాకతో కాదన్నారు. ఈ చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత పాలకుల దేనని, సెప్టెంబర్ 17న తెలంగాణ విలీనం దినోత్సవాన్ని అధికారి కంగా నిర్వహిం చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, ఎఐటీయుసీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.అంజయ్య నాయక్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు కె.శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మా, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.కాంతయ్య, సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు పడాల నళిని, ఎస్.శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, శంషుద్దీన్, సలీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
గురువారం | సెప్టెంబర్ 12, 2024 | www.navatelangana.com

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మర్రి దీపికా నర్సింహా రెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపిక నర్సింహా రెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డిలతో కలిసి బుధవారం సీఎం రేవంత్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపికను అందజేశారు. కలిసిన వారిలో పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్, బోడుప్పల్ మేయర్ అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త శ్రవంతి కిషోర్ గౌడ్, మేడ్చల్ పట్టణ మాజీ ఉప సర్పంచ్ మర్రి నర్సింహా రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ మున్సిపాలిటీలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల గురించి సీఎంకు వివరించామని తెలిపారు. మున్సిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిది

- నాగారం మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్



నవతెలంగాణ-కీసర

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని నాగారం మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్ అన్నారు. బుధవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డు కాలనీకి చెందిన నర్సింగ్‌రావుకు మంజూరైన రూ.29,500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో నాగారం మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్, కౌన్సిలర్ మోకు రేణుక జగన్మోహన్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

వినాయకుడికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ ఇంద్రానగర్ శివాలయంలో, తిరుమలా నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డిలు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వినాయక మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని, కార్పొరేటర్ ప్రభుదాస్‌లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం ప్రతినిధులు మల్లేష్ గౌడ్, అమరేంద్ర బాబు, నాయకులు జంపాల్ రెడ్డి, పూస రమేష్, మహేష్, అమర్‌నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్ డివిజన్‌లో..



మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ మల్లాపూర్, భవానీనగర్ కాలనీ, అన్నపూర్ణ కాలనీ, బాబానగర్, ఒడియా అసోసియేషన్, నెహ్రూ నగర్ కాలనీ, సూర్యనగర్ కాలనీల్లోని వినాయక మండపాల వద్ద ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా మండపాల నిర్వాహకులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కరాటే బెల్ట్‌లు అందజేసిన ఎమ్మెల్యే బండారి



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్‌లో ఉన్న శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో ఏర్పాటు చేసిన కరాటే గ్రేడింగ్ టెస్ట్ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై బెల్ట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరాటే నేర్చుకోవడం అందరికీ అవసరం అని చెప్పారు. చిన్నతనంలోనే కరాటే మీద దృష్టి పెట్టాలని సూచించారు. కరాటే ఆత్మరక్షణకు ఎంతో తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, హెచ్‌బీ కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, బీఆర్ఎస్ నాయకులు సాయి జెన్ శేఖర్, రాజు కుమార్ పాల్గొన్నారు.

శ్రీనివాస నగర్‌లో మినీ థియేటర్ ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా

డాక్టర్ ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రిన్‌జ్ ఫ్రో మినీ థియేటర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్వాహకులు బాబీ, చందన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపార రంగంలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సోమ శేఖర్‌రెడ్డి, మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, హెచ్‌బీ కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, నాయకులు సాయి జెన్ శేఖర్, కాసం మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ పటేల్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని సర్దార్ పటేల్ నగర్‌లో కార్పొరేటర్ శ్రవణ్ బుధవారం అధికారులతో కలిసి పర్యటించారు. అనంతరం రూ.16లక్షల వ్యయంతో జరుగుతున్న పైపులైన్ పనులను, సీసీ రోడ్డు ప్యాచ్ వర్క్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవ సందర్భంగా సర్దార్ పటేల్ విగ్రహ ప్రాంగణంలో డెకరేషన్, పెయింటింగ్ వేయాలని అధికారులకు సూచించారు. బాల సరస్వతీ నగర్ వాసులతో కలిసి నాలా పనులను పూర్తి చేయాలని డిప్యూటీ కమిషనర్ రాజును కోరారు. నాలా దారి తీసేందుకు ప్రయివేట్ భూమికి పరిహారం ఇప్పటికే మంజూరు చేయించానని తెలిపారు. వెంటనే పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ దీపక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, బీజేపీ నాయకులు, కాలనీ వాసులు, సాయి పటేల్, సుబ్బారావు, చంద్రకళ, సుమతి, బీజేపీ రవి, రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన మహేష్ గౌడ్‌ను కాప్రా సర్కిల్ కాంగ్రెస్ నాయకులు శ్రావణ్ కుమార్ గౌడ్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకే అందజేసి శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ పాలనలో బీసీలకు సముచితమైన ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, మహేష్ గౌడ్ నాయకత్వంలో పనిచేస్తామని ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. -నవతెలంగాణ,కాప్రా



ఆరోగ్య చట్టాలపై అవగాహన అవసరం

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి రఘునాథస్వామి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆరోగ్య చట్టాలపై అవగాహన అవసరం అని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి అన్నారు. బుధవారం కండ్లకోయలోని సీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం, ప్రీ-కాన్సెప్షన్, ప్రీ-నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ చట్టం, గర్భం వైద్య రద్దు చట్టం, సరోగసీ చట్టం, ఆయుష్మాన్ భారత్ అమలు, వెక్టర్-బోర్న్ అండ్ కమ్యూనికేబుల్ డిసీజెస్, రొటీన్ ఇమ్యునైజేషన్, చైల్డ్ హెల్త్ ఇమ్యునైజేషన్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన అన్ని చట్టాలపై రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రోగ్రామ్ అధికారులతో కలిసి మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని ప్రయివేటు హాస్పిటల్స్, డయాగ్నస్టిక్ సెంటర్ల మేనేజింగ్, మెడికల్ డైరెక్టర్లు, గైనకాలజిస్టులు, రేడియాలజిస్టులు, పాథాలజిస్టులకు ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ ప్రయివేటు హెల్త్‌కేర్ నిపుణులు పూర్తి సమాచారం, చట్టపరమైన, నియంత్రణ ప్రమాణాలకు కట్టుబడి ఉండేలా ఈ శిక్షణలు అవసరమన్నారు. ఈ సెషన్స్ రోగి హక్కులను పరిరక్షించడానికి, నైతిక వైద్యా విధానాలను నిర్ధారించడానికి, ప్రజారోగ్య ప్రమాణాలను నిర్వహించడానికి రూపొందించబడిన ముఖ్యమైన ఆరోగ్య చట్టాలను ఎలా అమలు చేయాలి, పర్యవేక్షించాలి అనే విషయాలపై క్లిష్టమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తాయని తెలిపారు. ఈ శిక్షణలు ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల్లో విధానాలను ప్రామాణీకరించడానికి, సంరక్షణ నాణ్యతలో ఏకరూపతను నిర్ధారించడానికి, ఆడిట్‌లు, తనిఖీలను సమర్థవంతంగా నిర్వహించడానికి, ఆరోగ్య సంరక్షణ ప్రదాతలను సిద్ధం చేయడంలో సహాయపడతాయని తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నవతెలంగాణ-హైదరాబాద్‌డెస్క్

పేకాట స్థావరంపై ఎస్‌వోటీ శామీర్ పేట పోలీసులు పోలీసులు దాడి చేసిన ఘటన మంగళవారం శామీర్‌పేట్ మండలంలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల10న మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో మూడుచింతలపల్లి మండలం ఉద్దేమర్రి అనుబంధ గ్రామం హుషారుపల్లిలోని డీర్ క్రీక్ అనే ఫామ్ హౌస్‌లో పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌వోటీ, శామీర్‌పేట పోలీసులు సంయుక్తంగా దాడీ చేసి జీడిమెట్ల, మేడ్చల్ ప్రాంతానికి చెందిన 13 మందిని అదుపులోనికి తీసుకొన్నారు. వారి వద్ద రూ.4,37,550 నగదు, 15 మొబైల్ ఫోన్లు, రెండు పేకాట కార్డుల సెట్స్ , నాలుగు కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఖమ్మంలో వరద బాధితులకు నిత్యావసరాలు అందజేత



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఖమ్మం వరద బాధితులకు అండగా ఉండాలనే ఉద్దేశంతో మల్కాజిగిరికి చెందిన మానవసేవే మాధవసేవ టీం సభ్యులు గత మూడు రోజుల నుండి మానవసేవ మాధవసేవ గ్రూప్ సభ్యులతో పాటు మల్కాజిగిరి కుషాయిగూడతో తమ శ్రేయోభిలాషుల నుంచి సేకరించిన 15 క్వింటాళ్ల బియ్యం, నిత్యవసర సరుకులను మంగళవారం మల్కాజిగిరి గౌతమ్ నగర్ చౌరస్తా నుండి ఖమ్మం ఆటో ద్వారా నిత్య నిత్యవసరాల సరుకులతో బయలుదేరారు. బుధవారం ఖమ్మంలోని కర్ణగిరి గృహకల్ప కాలనీ, జలగం నగర్ బస్తీలో వరద బాధితులకు బియ్యంతో పాటు నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా మానవసేవే మాధవసేవ ప్రతినిధి కుమ్మరి రాజు మాట్లాడుతూ ఖమ్మంలో వరద బాధితులు సహాయ కోసం ఎదురు చూస్తున్నారని, మల్కాజిగిరి తో పాటు ఇతర జిల్లాలోని ఉన్న ప్రజలు, ఎన్జీవోలు, ఖమ్మం వరద బాధితకు తోచిన సహాయాన్ని చేసి వాళ్ళని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మానవసేవే మాధవసేవ ప్రతినిధులు కుమ్మరి రాజు, మహమ్మద్ రషీద్, పోచంపల్లి మహేష్ , వెంకటరమణ, నరేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నిదానాల్లో కెల్లా అన్నదానం గొప్పది

- నాగారం మున్సిపల్ కౌన్సిలర్ గూడూరు సబితా ఆంజనేయులు గౌడ్



నవతెలంగాణ-కీసర

అన్నిదానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని నాగారం మున్సిపల్ 7వ వార్డు కౌన్సిలర్ గూడూరు సబితా ఆంజనేయులు గౌడ్ అన్నారు. బుధవారం నాగారం మున్సిపాలిటీ బ్రహ్మయ్య కాలనీలో మధుగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి హాజరై భక్తులకు అన్నదానం వడ్డించారు. వినాయక మండపాల వద్ద అన్నదానం ఏర్పాటు చేసిన మధుగౌడ్ ను కౌన్సిలర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మయ్య కాలనీ వాసులు, వివిధ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

డ్రయినేజీ పనులు పరిశీలన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని జ్యోతి నగర్‌లో రూ.14లక్షలతో కొనసాగుతున్న భూగర్భ డ్రయినేజీ నిర్మాణ పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. భూగర్భ డ్రయినేజీ నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ నవీన్, బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, జ్యోతి నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మనోజ్, బీజేపీ నాయకులు మాశెట్టి అనిల్ గుప్తా, బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు ఉన్నారు.

విలీన గ్రామాలతో మున్సిపాలిటీపై ఆర్థిక భారం

- నాగారం మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీలో కరీంగూడ, గోధుమ కుంట, రాంపల్లి దాయరా, భోగారం గ్రామాలను విలీనం చేయడంతో నాగారం మున్సిపాలిటీపై ఆర్థిక భారం పెరుగుతుందని మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నాగారం మున్సిపాలిటీలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో మున్సిపాలిటీ అభివృద్ధి కుంటు పడే అవకాశం ఉందన్నారు. విలీన గ్రామాల్లో సరైన నిధులు లేవని, ఆ గ్రామాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలన్నారు. విలీన గ్రామాల కార్మికుల జీతాలు మాపై అదనపు భారం భరించాల్సి వస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలకు టీడీలు ఇవ్వడం లేదన్నారు. విలీన గ్రామాల్లో కాంట్రాక్టర్లకు ఇంకా డబ్బులు ఇవ్వక పెండింగ్‌లో ఉందన్నా రు. ప్రస్తుత నాగారం మున్సిపాలిటీలో పూర్త స్థాయి టీపీఓ, అకౌంట్స్ అధికారి లేకపోవడంతో మున్సిపాలిటీ లో పనులు సరిగ్గా జరగడం లేదన్నారు. నాగారం మున్సిపాలిటీలో విలీన గ్రామలతో ఆర్థిక భారం లేకుండా ఉండాలంటే ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

విఘ్నేశ్వరుడిని దర్శించుకున్న సీఐ సత్యనారాయణ



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్ ఫస్ట్ ఫేజ్ లో గల వినాయక మండపంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండప నిర్వహకుల ఆహ్వానం మేరకు మేడ్చల్ సీఐ అద్దని సత్యనారాయణ హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు,మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వినాయక చవితి మతసామరస్యానికి ప్రతీక

- కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ మౌలాలి డివిజన్ మౌలాలి కమాన్ వద్ద సోనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలోని వినాయకుడిని మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ దంపతులు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వినాయక చవితి పండుగ మతసామరస్యానికి ఇదే నిదర్శనమని అన్నారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణకు ముస్లింలు కూడా రావడం మానవులంతా ఒకటేనని, మతసామరస్యానికి ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో గున్నాల చంద్రశేఖర్ యాదవ్, శివ గౌడ్ ,శబ్బర్, శాభాజ్, విజయ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా విశ్వవిద్యాలయానికి ఐలమ్మ పేరు పెట్టడం హర్షనీయం



నవతెలంగాణ - జవహర్‌నగర్

కోఠిలోని మహిళ విశ్వవిద్యాలయానికి చిట్యాల ఐలమ్మ పేరు పెట్టడం హర్షనీయమని జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ ఉన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రజక చైతన్య కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణలో భూమి కోసం, భుక్తి కోసం, తెలంగాణ విముక్తి కోసం పోరాడిన మహిళ ఐలమ్మ అని అన్నారు. ఐలమ్మ పేరును మహిళా విశ్వవిద్యాలయానికి ప్రకటించినందుకు రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, రజక సంఘం మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు జనార్ధన్, కార్పొరేటర్లు రోజా శ్రీనివాస్, సాయికుమార్, నాయకులు సదానంద్, సతీష్, రాజు యాదవ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వినయ్ కుమార్, వేణు, శ్రీనివాస్, అధ్యక్షులు యాదగిరి, నరసింహ, ఎల్లయ్య, నాయకులు బుజ్జి, రాజు యాదవ్, యాదగిరి యాదవ్, పాల్గొన్నారు.

మల్టీపర్పస్ పార్క్ కోసం శంకుస్థాపన



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్‌లోని 133 డివిజన్ మచ్చ బొల్లారంలోని వెంకన్న కాలనీ, విజయ్ విహార్ ఎంక్లేవ్‌లో రూ.88 లక్షలతో పార్కుల అభివృద్ధి కోసం స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. పార్కుల్లో పిల్లలకు ఆట పరికరాలు, యువత కోసం జిమ్ పరికరాలు, సీనియర్ సిటిజన్‌ల కోసం వాకింగ్ ట్రాక్, మల్టీపర్పస్ కోర్టు, కూర్చునే బెంచీలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ రవళి వర్క్ ఇన్‌స్పెక్టర్ అఫ్రోజు, నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, నిమ్మ అశోక్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, బలవంతరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ గౌడ్, కాలనీవాసులు సందీప్, శశిధర్ రెడ్డి, ఎల్లారెడ్డి, రవీందర్, నరేష్‌రెడ్డి, రాజిరెడ్డి, కృష్ణారెడ్డి, భవానీ, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీ కులాల ఐక్యవేదిక ప్రథమ వార్షికోత్సవ సభ



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ వినాయక నగర్ డివిజన్‌లోని జీఎస్ఆర్ గార్డెన్‌లో గురువారం నిర్వహించే బీసీ కులాల ఐక్యవేదిక ప్రథమ వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని బీసీ కులాల ఐక్యవేదిక కార్యదర్శి కాసర్ల నాగరాజు పిలుపునిచ్చారు. ఈ సభకు ముఖ్యఅతిథులుగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, అన్ని పార్టీల నాయకులు, కార్పొరేటర్‌లు హాజరవుతారని తెలిపారు. బుధవారం ఆనంద్‌బాగ్ చౌరస్తాలో వార్షికోత్సవ సభ కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి బీసీ కుల ఐక్యవేదిక అధ్యక్షులు కామల్ల ఐలన్న హాజరై మాట్లాడుతూ..భారతదేశమంతా ఉద్యమాల చరిత్ర స్వాతంత్ర పోరాటంలో అగ్రభాగాన శ్రమించింది అణగారిన కులాలే అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో బండి వెనక బండి కట్టి 16 బండ్లు కట్టి ఏ బండ్ల వస్తవు కొడుకో నైజాం సర్కరోడా అని ప్రశ్నించింది మహాజన కులాలే అని అన్నారు. తెలంగాణ సాధనకు పీడిత కులాల ప్రజలే పోరాడారని తెలిపారు. 77 ఏండ్లుగా దేశ భవిష్యత్తు కోసం బీసీలు పోరాడుతున్నారని పేర్కొన్నారు. కానీ పార్లమెంట్‌లో నేటికీ బీసీలకు 15శాతం మించి ప్రాతినిథ్యం లేదని వాపోయారు. తెలంగాణ అసెంబ్లీలో బీసీల ప్రాతినిధ్యం తగ్గుతూ వస్తుందన్నారు. గత అసెంబ్లీలో 23 మంది బీసీ ఎమ్మెల్యేలు ఉంటే ఈసారి 19కి పడిపోయిందన్నారు. 70శాతం జనాభా ఉన్నా అసెంబ్లీలో ఎందుకు సీట్లు తగ్గడానికి కారణం రాజకీయ పార్టీలన్నీ ఆధిపత్య కులాలయే అన్నారు. బీసీలకు రాజ్యాధికారం కోసం జెండాలు పక్కనపెట్టి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ కులాల ఐక్యవేదిక ఉపాధ్యక్షులు జీనుకుంట్ల రమేష్, కార్యదర్శులు బత్తిని నరసింహ గౌడ్, పిట్టల భాస్కర్, చేగురి రామ్మోహన్, సిహెచ్ సుధాకర్, జోగు శ్రీనివాస్, రజక సంఘం నాయకులు ఎస్ బాబు, బి రాజు, పి కనకయ్య, ఎం దేవరాజు, పాల్గొన్నారు.

మహాత్మ యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ -జవహర్‌నగర్

అంగరంగ వైభవంగా ఐదు రోజుల నుండి మహాత్మ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయిబాబా నగర్ హనుమాన్ దేవాలయ సమీపంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి సుబ్రహ్మణ్యేశ్వర సిద్ధాంతి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకలతోపాటు యువజన సంఘం నాయకులు కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నాగరాణి వెంకటేష్ గౌడ్, మహాత్మ యువజన సంఘం ఉత్సవ కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరూ పాల్గొని అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు.

అల్వాల్ సర్కిల్ 133 డివిజన్, మచ్చబొల్లారంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు కాలనీలను సందర్శించారు. ఆయా వార్డుల్లో ప్రతిష్ఠించిన గణపయ్య ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. -నవతెలంగాణ అల్వాల్





కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో బుధవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి పూజలు నిర్వహించారు. నవతెలంగాణ-సిటీబ్యూరో



సౌజన్య కాలనీ, పద్మావతి కాలనీల్లోని గణనాథులని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఆర్ఐటీ చైర్మెన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, డాక్టర్ ఎన్ఎల్ఎన్ రెడ్డి, ఓబుల్‌రెడ్డి, పాల్గొన్నారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
9
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
గురువారం | సెప్టెంబర్ 12, 2024 | www.navatelangana.com

రాయల్ డిగ్రీ కళాశాలలో గణేష్ నిమజ్జన వేడుకలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

గణేష్ నిమజ్జనం వేడుకలు చింతల్‌లోని రాయల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల మట్టి ప్రతిమలను తయారు చేసి, 5 రోజులుగా కళాశాలలో ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథుడు బుధవారం గంగమ్మ ఒడికి చేరాడు. నిమజ్జనంలో భాగంగా వినాయక లడ్డు వేలం వేశారు. విద్యార్థులు ఆటపాటలతో అలరిస్తూ వినాయకుని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు జి.రమేష్ బాబు, ఎన్. వెంకట్ రెడ్డి, సి.హెచ్ గోవిందరెడ్డి కె. రామకృష్ణ, ఎన్. నల్లా జై శంకర్ గౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ మేనకా పాటిల్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

'లీడ్ గ్రూప్' టెక్ బుక్ రిలీజ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

దేశంలోని అతిపెద్ద స్కూల్ ఎడ్‌టెక్ కంపెనీ, లీడ్ గ్రూప్, సాంప్రదాయ పాఠ్యపుస్తకం-ఆధారిత అభ్యాసాన్ని మార్చడానికి రూపొందించిన తెలివైన పుస్తకమైన టెక్ బుక్‌ని బుధవారం విడుదల చేసినట్టు ప్రకటించింది. నేడు పాఠశాల విద్యార్థుల్లో కీలక అభ్యాస సవాళ్లను పరిష్కరించడానికి ఈ టెక్ బుక్ మూడు అత్యాధునిక సాంకేతికతలు, ఎన్‌సీఎఫ్ సమలేఖన పాఠ్యాంశాలను తీసుకొస్తుంది. ఈ సందర్భంగా లీడ్ గ్రూప్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ సుమీత్ మెహతా మాట్లాడుతూ 'ఈ టెక్ బుక్ సాంకేతికత, బోధనాశాస్త్రం, పాఠ్యాంశాల్లోని ఏండ్లుగా పరిశోధనల విప్లవాత్మక పరిణామం. ఇది విద్యార్థులు అభ్యసించే విద్యా విధానాన్ని మారుస్తుంది' అని తెలిపారు.

నిరుపేద కుటుంబానికి చేయూత



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్‌కు చెందిన ఎస్.సుధా భర్త ఎస్.ఈశ్వర్ రెడ్డి నిరుపేద కుటుంబం అనారోగ్యంతో బాధపడుతున్న విషయం... నిజాంపేట బి.ఆర్.ఎస్ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి సాంబశివా రెడ్డి దృష్టికి పార్టీ కార్యకర్తలు తీసుకువచ్చారు. చికిత్స కోసం వారిని ఆదుకోవలసిందిగా ఎమ్మెల్యే కె. పి.వివేకానందని ఆశ్రయించారు. అనంతరం ఎమ్మెల్యే చికిత్స కోసం వారికి రూ.1,00,000 ఎల్.ఓ.సి.ని సి.ఎం.ఆర్.ఎఫ్. నిధుల నుంచి మంజూరు చెయించి, కుటుంబ సభ్యులుకు చేయూతనందించారు.

ఇట్టి ఎల్.ఓ.సి.ని బుధవారం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగ రాయ ప్రసాద్ నిరుపేద కుటుంబ సభ్యులకు అందచేశారు.

ఘనంగా విఘ్నేశ్వరుడికి పూజలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం కూకట్‌పల్లి నియోజక వర్గం పరిధిలోని కూకట్‌పల్లి డివిజన్ కేపీహెచ్‌బీ డివిజన్, బాలాజీనగర్ డివిజన్, బాలానగర్ డివిజన్‌లలో నెలకొల్పిన గణనాథుడికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గణనాథుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

నియోజకవర్గాల వారీగా నివేదికలు సమర్పించాలి

- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- ఈఆర్ఓలు, ఏఈఆర్‌లతో సమావేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ జాబితాను సవరించి నియోజకవర్గాల వారీగా నివేదికలు సమర్పించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ జాబితాను ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలన్నారు. డెత్, షిఫ్టెడ్ కేసులేమైనా ఉంటే భారతీయ ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఒకే ఓటర్ పేరు రెండు సార్లు నమోదైతే ఓటర్ దగ్గర ఉన్న ఓటర్ ఐడీ కార్డును పరిశీలించి అదనంగా ఉన్న ఐడీ కార్డును తొలగించాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కేఎంఎల్ మ్యాప్ రిపోర్టులను పంపాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ భూములను గూగుల్ ఎర్త్ ద్వారా కేఎంఎల్ మ్యాప్ రిపోర్టులను పంపాలని తహశీల్దార్లు, సర్వేయర్లను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో ప్రభుత్వ భూములను గూగుల్ ఎర్త్ ద్వారా కేఎంఎల్ మ్యాప్‌పై అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ భూములను తప్పనిసరిగా గూగుల్ ఎర్త్ ద్వారా కేఎంఎల్ మ్యాప్ రిపోర్టులను తయారు చేసి ఆర్డీఓల ఆమోదంతో పంపాలని ఆదేశించారు. గ్రామాల వారీగా కేఎంఎల్ మ్యాప్ రిపోర్టులను తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో ఉత్సవాలు జరుపుకోవాలి



- బాలనగర్ జోన్ డీసీపీ కే.సురేష్ కుమార్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

వినాయక నవరాత్రి ఉత్సవాలతోపాటు మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు హిందూ, ముస్లింలు ఐక్యతతో శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బాలనగర్ జోన్ డీసీపీ కే.సురేష్ కుమార్ సంబంధిత నిర్వాహకులకు సూచించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో సుమారు 200 మంది హిందూ ముస్లిం సోదరులతో "పీస్ కమిటీ మీటింగ్"సీఐ కే.క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో..ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు ఏసీపీ.హనుమంతరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు శాంతికి చిహ్నాలని తెలిపారు. రానున్న వినాయక నిమజ్జనోత్సవ వేడుకలతో పాటు మిలాద్ ఉన్ నబి ఊరేగింపు ర్యాలీలకు సంబంధించి ప్రతి ఒక్కరు పోలీస్ స్టేషన్లో అనుమతులు పొందాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీస్‌లో భాగంగా ప్రతి ఒక్కరు స్నేహభావంతో మెలగాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు సహకరించాలని తగిన సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిఐ. అంజయ్య, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యూపీఎస్ మోడల్ స్కూల్‌లో వినాయక నిమజ్జనం వేడుకలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

గ్రీన్ హిల్స్ " యూపీఎస్ మోడల్ స్కూల్లో " లో వినాయక నిమజ్జనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐదు రోజులుగా స్కూల్ ఆవరణలో నిత్యం పూజలు అందుకున్న గణనాథుడు బుధవారం గంగమ్మ ఒడికి చేరాడు. నిమజ్జన వేడుకల్లో భాగంగా గణపతి పూజ , శాంతి హెూమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరన్న విద్యార్థులం దరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వినాయకుడి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని గణనాధుని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎ.నీరజ, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థిని విద్యార్థులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన అరెకెపూడి గాంధీ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

శేరిలింగంపల్లి అరెకపూడి గాంధీ ప్రజా పద్దుల కమిటీ చైర్మెన్ (పీఏసీ)గా నియమితులైన సందర్భంగా.. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని సచివాలయంలో కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి, ప్రత్యేక పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పీఏసీ చైర్మెన్ ఆరెకపూడి గాంధీని అభినందించారు. కొత్త బాధ్యతలు విజయవంతంగా నిర్వహించాలని ఆకాక్షించారు.ఈ సందర్భంగా పీఏసీ చైర్మెన్, ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి నాకు అవకాశం కలిపించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌కి, ఐటీ, శాసన సభ వ్యవహారాల మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను అని తెలియచేసారు. నాపై ఉంచిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, రఘునాథ్ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, పృథ్వి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

భరతనాట్యంలో నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినికి ప్రపంచ స్థాయి గుర్తింపు





నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోని ఈసీఈ మూడవ సంవత్సరం చదువుతున్న యంకోజు లహరిక భరతనాట్యంలో తన ప్రతిభను చాటుతూ.. ప్రపంచ స్థాయిలో గుర్తింపు సాధించింది. ఈ కార్యక్రమాన్ని వారాణసీ కేంద్రంగా... కాశీ విశ్వనాథ దేవస్థానం ట్రస్ట్ వారు అంతర్జాతీయ కర్ణాటక సంగీతకారులు నృత్యకారుల సంస్థ సౌజన్యంతో నిర్వహించారు. ఇందుకు భరతనాట్యానికి గాను, తమిళనాడు రాష్ట్రం ప్రాతినిధ్యం వహించింది. ఈ బృహత్తర కార్యక్రమంలో తమ కళాశాల విద్యార్థి ఎంపిక అవ్వడం గర్వకారణమని కళాశాల కార్యదర్శి జె.త్రిశూల్ రెడ్డి పేర్కొన్నారు. ఇలాంటి ప్రతిభ గల విద్యార్థులను తాము ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్ లోకనాథం మాట్లాడుతూ విద్యార్థులు విద్యాసంబంధమైన విషయాల పైనే కాకుండా సంస్కృతిక అంశాలపై కూడా దృష్టి సారించాలని తెలిపారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల వల్ల నేటి యువతలో మన సంస్కృతి సాంప్రదాయాల పట్ల మరింత అభిరుచి పెరుగుతుందనారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి జె త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి, డైరెక్టర్ డా.మోహన్ బాబు, ప్రిన్సిపాల్ డా.ఆర్.లోకనాథం, ఈసీఈ విభాగాధిపతి డా. పురుషోత్తమ ప్రసాద్, ఎస్ ఏ.సి కన్వీనర్ శ్రీమతి శైలజ రెడ్డి, పలు విభాగాధిపతులు పాల్గొన్నారు.

పార్టీ కండువా కాదు..

ఆలయ కండువా అని అనడం హాస్యాస్పదంగా ఉంది

మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

పీఏసీ చైర్మెన్‌గా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ నియమితులు కాగా ఆయన పార్టీ కండువాల పై చేసిన వ్యాఖ్యలపై బీఆర్ ఎస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పాత్రికేయ సమావేశం ఏర్పాటు చేశారు.రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో.. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్న ఎమ్మెల్యే గాంధీ.. ఇప్పుడు అది పార్టీ కండువా కాదు, ఆలయ కండువా అని చెప్పడం హాస్యాస్పదం అన్నారు. రేవంత్ రెడ్డి ఇల్లు దేవాలయం కాదు.. అక్కడ సీఎం పూజారీ కాదు.. ఆలయ కండువా కప్పుకోవడానికి ఆయన వేసుకొన్న కండువా దేవాలయం కండువా అసలే కాదని అన్నారు. పదవులకోసం పోలేదు, అభివృద్ధి కోసమే పార్టీ మారడం జరిగిందని అప్పుడు చెప్పి, ప్రస్తుతం ఎందుకు పీఏసీ చైర్మెన్ పదవి తీసుకున్నారు అని ప్రశ్నించారు.

మహాత్మ గాంధీ పేరు పెట్టుకొని అన్ని అబద్ధాలు చెబుతున్నారని, ప్రజలు ఎమ్మెల్యే మాటలు విని అసహ్యించు కుంటున్నారన్నారు. పార్టీ మారిన నేతలపై హైకోర్టు ఇచ్చిన తీర్పుకు భయపడి, పార్టీ మారలేదు అంటున్నారా.. ప్రభుత్వ పెద్దలు పీఏసీ చైర్మెన్ ఇచ్చి ఈ విధంగా మాట్లాడిస్తున్నారా అని రంగారావు అన్నారు. అసలు గాంధీ ఏ పార్టీలో ఉన్నారో క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

శేర్లింగంపల్లి నియోజకవర్గం ప్రజల అండదండలతో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన, అరికెపూడి గాంధీ పార్టీలు మారుస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని పేరొన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో ఎమ్మెల్యేగా గెలుపొందిన, కొంతకాలంలోనే ఆ పార్టీకి గుడ్ బై చెప్పి బీఆర్ఎస్‌లో చేరి, రెండు దఫాలు ఎమ్మెల్యేగా పనిచేసే కోట్లాది రూపాయల నిధులతో శేర్లింగంపల్లి నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసిన విషయాన్ని మర్చిపోయారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన అరికెపూడి గాంధీ తాను పార్టీ కండువా కప్పుకోలేదు అనడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.

ఎమ్మెల్యే గాంధీ ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నాడో చెప్పాలి : బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికేపూడి గాంధీకి పీఏసీ చైర్మెన్‌గా అవకాశం ఇవ్వడంపై, గణపతి ఉత్సవాల్లో పాల్గొన్న బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్ స్పందిస్తూ... ప్రతిపక్ష పార్టీకి ఇవ్వాల్సిన పీఏసీ చైర్మెన్ పదవి, కాంగ్రెస్ కండువా కప్పుకొని అధికార పార్టీలో చేరిన ఎమ్మెల్యేకి ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే పదవీ కాంక్షతో మాట్లాడుతున్న మాటలు విడ్డూరంగా ఉన్నాయని అన్నారు. పదవి కోసం పార్టీలు మార్చి రంగులు మార్చే ఊసరవెల్లిలా తయారయ్యారని దుయ పట్టారు. పీఏసీ పదవి రాకముందు కాంగ్రెస్ పార్టీలో ఉండి, ప్రతిపక్షానికి ఇవ్వాల్సిన పీఏసీ పదవి రాగానే ప్రతిపక్షంలోనే ఉన్నానని, సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పలేదని దేవుని శాలువా కప్పాడని మాట్లాడడం సిగ్గుచేటు అని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత ఎమ్మెల్యే సమావేశాలలో గాని, మీడియా సమావేశంలో గానీ కాంగ్రెస్ కండువా కప్పుకున్నప్పుడు మరి ఏ పార్టీలో ఉన్నాడనుకోవాలో ఎమ్మెల్యే చెప్పాలని అన్నారు.ఇప్పటికైనా ఎమ్మెల్యే అధికార కాంగ్రెస్ పార్టీలో ఉన్నాడో లేక ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలో ఉన్నాడో శేరిలింగంపల్లి ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఆస్తులను కాపాడుకోవడం కోసం పార్టీలు మారడం తప్ప ప్రజలకు ఒరగబెట్టింది ఏమీ లేదు అని కుమార్ యాదవ్ అన్నారు.



గణేష్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో, టెంపుల్ స్ట్రీట్ యూత్ అసోసియేషన్ వారు నెలకొల్పినటువంటి వినాయక మండపం వద్ద, వారి యొక్క ఆహ్వానం మేరకు.. ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, పెద్దలు కె.యం.ప్రతాప్ హజరయ్యారు. విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ స్ట్రీట్ అసోసియేషన్ సభ్యులు ఉత్తేజ్, సోను, సునీల్ పాండే, సూరి, సుమో అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ అన్నదాన కార్యక్రమంలో బీజేపీ నేతలు..

సుభాష్ నగర్ డివిజన్ పరిధిలో వినాయక మండపాలను బీజేపీ నాయకులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, బీజేపీ నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, బీజేపీ నాయకులు మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత సింహారెడ్డి వారితోపాటు గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు కట్ట కుమార్, బీజేపీ నాయకులు వాసు, సుభాష్ నగర్ డివిజన్ అధ్యక్షులు కంది శ్రీరాములు, ప్రతాప్, బీజేపీ నాయకులు మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



భక్తి శ్రద్ధలతో గణపతి పూజలు

ప్రత్యేక పూజలో ఏసీపీ శ్రీనివాస రావు..

కూకట్‌పల్లి : మూసాపేట్ యువజన సంఘం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో.. ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద, తూము శ్రావణ్ కుమార్ యువసేన ఆధ్వర్యంలో, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ తో పాటు, కూకట్ పల్లి ఏసిపి శ్రీనివాస్ రావు గణనాథుని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, జిల్లా గోపాల్,చున్నూ పాషా, తూము మనోజ్, నిఖిల్, సచిన్, రాము తదితరులు పాల్గొన్నారు.

సాయి నగర్ వెస్ట్ కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని, సందర్శించిన కార్పొరేటర్

కూకట్‌పల్లి : వినాయక చవితి సందర్భంగా.. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని, సాయి నగర్ వెస్ట్ కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని, డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, జగద్గిరి గుట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.క్రాంతి కుమార్‌తో కలిసి, సందర్శించారు. ప్రత్యేక పూజా కార్యక్రమం, అన్న సమారాధన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించి భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, అందమైన సమాజాన్ని ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కావున మట్టి విగ్రహాలను పూజించి, వినాయక పండుగ ఘనంగా జరుపుకోవాలని తెలుపుతూ... ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీల అసోసియేషన్ సభ్యులు, వినాయక కమిటీ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.





పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



- సూపర్‌వైజర్ జె.జ్యోతి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

చిన్నారి పిల్లలకు అంగన్వాడి కేంద్రాల నుండి అందజేస్తున్న పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం వంతులుగా ఎదుగుతారని రంగారెడ్డినగర్ సెక్టార్ సూపర్వైజర్ జె.జ్యోతి తల్లులకు సూచించారు. "పోషణ్ మహా ప్రోగ్రాం"కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గిరినగర్1,2,3,అంగన్వాడి కేంద్రాలతో పాటు చెన్నారెడ్డినగర్ 2,బిజెఆర్ నగర్ 5 అంగన్వాడి కేంద్రాలలో బుధవారం చిన్నారులకు" అన్నప్రాసనతో పాటు అక్షరాభ్యాసం, గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం" కార్యక్రమాలు ఆమె చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడి బడి చిన్నారులను లాలించే ఒడి అని చిన్నారులను తప్పక అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలని తెలిపారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు పోషక విలువలు గల పాలు, గ్రుడ్లు క్రమం తప్ప కుండా తీసు కోవడంతోపాటు అంగన్వాడి కేంద్రాల నుంచి అందజేస్తున్న పదార్థాలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు ఎస్.నీరజ, నసీమా బేగం, వాణి కృష్ణవేణి, సునీత, ఆశవర్కర్ నస్రీన్ బేగం, మహిళా మండలి నాయకురాలు భారతి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
గురువారం | సెప్టెంబర్ 12, 2024 | www.navatelangana.com

పలు మండపాలను సందర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ బుధవారం నియోజక వర్గంలోని 7వ వార్డ్ తిరుమల గిరిలోని పలు గణేష్ మండపాలకు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండపాల దగ్గర ఎమ్మెల్యే అన్నదాన వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు స్వయంగా ఎమ్మెల్యే అన్న ప్రసాదాలను వడ్డించారు. ఈ కార్యక్రమంలో తేల్కుంటా సతీష్ గుప్తా, శ్రీనివాస్, సంకి రవీందర్ ,మధు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయండి'



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాలలో పనిచే స్తున్న నాన్ టీచింగ్ కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని రాష్ట్ర ఆరోగ్య మంత్రి దామోదర్ రాజానర్సింహ హాను ఆంజనేయులు కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అసెంబ్లీ సమావేశాలకు ముందు మంత్రిని కలవగా మళ్లీ రావాలని చెప్పారని గుర్తు చేసామని తెలిపారు. తొందరలో ఎడ్యుకేషన్ మంత్రి రాబోతున్నారని.. రాగానే మీకు న్యాయం చేస్తామని చెప్పినట్టు ఆంజయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ జాయింట్ ఆక్షన్ కమిటీ వైస్ చైర్మెన్ ఏడ్ల అంజయ్య, వైస్ ప్రెసిడెంట్‌లు రాము మైలారం,పి.సురేష్ పాల్గొన్నారు.

బాలుడికి కాలేయ మార్పిడి.. ఇన్‌ఫెక్షన్‌తో మృతి



- రెయిన్‌బో ఆస్పత్రి ఎదుట బాలుడి బంధువుల ధర్నా

నవతెలంగాణ-బంజారాహిల్స్

12 ఏండ్ల బాలుడికి ఓ ఆస్పత్రిలో కాలేయ మార్పిడి చేయగా అనంతరం ఇన్‌ఫెక్షన్‌తో బాలుడు మృతి చెందాడు. దాంతో బాలుడి కుటుంబ సభ్యుల ఆస్పత్రి ఎదుట ధర్నా చేపట్టారు. ఈ ఘటన బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 2 లోని రెయిన్‌బో ఆస్పత్రిలో చోటుచేసుకుంది.

వైద్యులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మండలం సైదోని గడ్డకు చెందిన శ్రీశాంత్ (12) ఏప్రిల్ 22న ఆస్పత్రిలో లివర్ సంబంధ వ్యాధితో బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో ఆస్పత్రిలో చేరాడు. గత ఐదు నెలలుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాలుడి మామ సురేష్ అతనికి కాలేయం ఇచ్చేందుకు ముందుకు రాగా వైద్యులు కాలేయ మార్పిడి చికిత్స చేశారు. కాగా శాస్త్ర చికిత్స అనంతరం బాలుడు ఇన్ఫెక్షన్ కు గురై మృతి చెందాడు. దాంతో ఆగ్రహం చెందిన బాలుడి బంధువులు ఆస్పత్రి వద్ద ధర్నా చేపట్టారు. ఆస్పత్రి యాజమాన్యంతో పోలీసులు కుమ్మక్కై బాలుడి మృతదేహాన్ని అక్రమంగా తరలించారని ఆరోపించారు. ఆస్పత్రి యాజమాన్యంపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆస్పత్రిలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వానికి వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. తాము రూ. కోటి 25 లక్షల చెల్లించినా చిన్నారికి నిర్లక్ష్యపు వైద్యం చేయడం వల్లే బాలుడు మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పోలీసులపై కూడా కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ ఘటనపై రెయిన్‌బో ఆస్పత్రి వర్గాలు వివరణ ఇచ్చారు. బాలుడు వైద్యం చికిత్స విధానంపై

ఆసుపత్రి వం గత ఐదు నెలలుగా ఆస్పత్రిలో చికిత్స పొందాడని చెప్పారు. బాలుడి మామ సురేష్ కాలేయం ఇచ్చేందుకు ముందుకు రాగా కాలేయ మార్పిడి చికిత్స చేసినట్టు చెప్పారు. కాగా శాస్త్ర చికిత్స అనంతరం బాలుడు ఇన్ఫెక్షన్ కు గురై ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడని.. తమ ఆస్పత్రి వైద్యులు బాలుడిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. బాలుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు చెల్లించాల్సిన రూ. 33 లక్షలను మాఫీ చేసి బాలుడు మృతదేహాన్ని పంపించివేసినట్టు తెలిపారు. బాలుడు బంధువులు ఆరోపించినట్టుగా ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం లేదని స్పష్టం చేశారు.

ఎస్టీపీల నిర్మాణాలను గడువు లోపు పూర్తి చేయాలి

- జలమండలి ఎండీ అశోక్ రెడ్డి
- అధికారులతో ఎండీ సమీక్ష



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎస్టీపీల నిర్మాణాలను గడువులోపు పూర్తి చేయాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఎస్టీపీల నిర్మాణంపై ఆయన బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ ఎస్టీపీల నిర్మాణంపై నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. అందుకోసం ప్రతి వారం డైరెక్టర్, సీజీఎం స్థాయిలో పనులు సమీక్షించాలని సూచించారు. వారం రోజుల పనితీరును అధికారులకు సమర్పించాలని నిర్మాణ సంస్థ ప్రతినిధుల్ని ఆదేశించారు. ఏకకాలంలో అన్ని పనులు పూర్తయ్యేలా నిర్మాణం చేపట్టాలని సూచించారు. విద్యుత్, స్థలం, న్యాయ పరమైన సమస్యలుంటే ఉన్నతాధికారుల దష్టికి తీసుకురావాలని కోరారు. తుది దశలో ఉన్న ఎస్టీపీల నిర్మాణం పూర్తి చేసి ట్రయల్ రన్ నిర్వహించి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు.

ప్రారంభానికి సిద్ధంగా మరో 6 ఎస్టీపీలు

జలమండలి ఎస్టీపీ ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న వాటిల్లో ఇప్పటికే 4 ఎస్టీపీలు (కోకాపేట, దుర్గం చెరువు, పెద్ద చెరువు, నల్లచెరువు) ప్రారంభమయ్యాయి. మరో 6 ఎస్టీపీలు నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిలో నాగోల్, ఫతే నగర్, మిరాలం, ఖాజాకుంట, మియాపూర్ - పటేల్ చెరువు, సఫిల్ గూడ ఎస్టీపీలున్నాయి. వీటిని ఈ నెలాఖరుకు ప్రారంభించడానికి సిద్ధం చేయాలని, మిగిలిన ఎస్టీపీలను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఎండీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈడీ మయాంక్ మిట్టల్, టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్, సీజీఎంలు, జీఎంలు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

'బోరబండ సైట్ 3 యూపీహెచ్‌ఎస్‌లో ప్రసవాలు చేయాలి'



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండ సైట్ 3 లోని యూపీహెచ్ఎస్ దవఖానాలో గర్భిణులకు ప్రసవాలు చేయాలని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను బోరబండ డివిజన్ హాజం నగర్ వీకర్ సెక్షన్ మరియు అంజయ్య నగర్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ మహమ్మద్ యూసుఫ్ కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూపీహెచ్ఎస్ దవఖానాలో గతంలో గర్భిణులకు ప్రసవాలు చేసేవారని ఇప్పుడు డెలివరీలు చేయకుండా నిలిపివేశారని తెలిపారు. శ్రీరామ్ నగర్ హాస్పటల్ కు వెళ్లాలని సూచిస్తున్నారని, అంత దూరం వెళ్లలేక గర్భిణులు ఇబ్బందిపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ అధికారులతో మాట్లాడి తిరిగి బోరబండ సైట్ త్రీ ఆస్పత్రిలో డెలివరీలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే.. వెంటనే మెడికల్ అధికారులతో మాట్లాడి తిరిగి గర్భిణులకు బోరబండ సైట్ 3 హాస్పిటల్‌లో డెలివరీలు చేసేందుకు ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చారు. బోరబండ డివిజన్ ప్రెసిడెంట్ కష్ణ మోహన్, విజయ్ కుమార్, రమేష్ యాదవ్, దేవమని, మేరీ, అజయ, చంద్రకళ, శ్రీ లక్ష్మి, లడ్డు, అనిల్ కుమార్, రమేష్ నాయక్, నాగి రెడ్డి, వసంత్ రావు, నాని, వెనకటేష్ పాల్గొన్నారు.



గ్రేటర్ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం.

- నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి

నవతెలంగాణ-ఓయూ

డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డితో కలిసి బుధవారం తార్నాకలోని వారి క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసీ ద్వారా సమకూర్చిన కొత్త చెత్త తరలింపు బారోస్ (వీల్ బారో ఫ్రేమ్) లను పారిశుధ్య కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్రంగా, చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దడానికి అధికారులు ప్రజలను చైతన్యవంతులుగా చేయాలని కోరారు. పరిసరాలు శుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పారిశుధ్య కార్మికులకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కొత్త వీల్ బారోస్ వల్ల కార్మికులకు కొంత శ్రమ తగ్గి, చెత్త తరలింపు సులభతరం అవుతుందని ఆమె తెలిపారు. సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్ సుభాష్, శానిటేషన్ డీఈ వెంకటేష్, ఎస్ఎఫ్‌జే, ఎస్ఎఫ్ ఏలు, కాంగ్రెస్ నాయకుడు పవన్ కళ్యాణ్, కాలనీ వాసులు సాయి కుమార్, నరేష్, విశ్వ జీహెచ్ఎంసీ కార్మికులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ 50 వసంతాల లోగో, పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఓయూ

విప్లవోద్యమాల వేగుచుక్క పీడీఎస్‌యూ 50 వసంతాల లోగో, పోస్టర్ లను ఆర్ట్స్ కాలేజీ ఎదుట బుధవారం ఓయూ కంప్యూటర్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ వెంకట దాస్, పి.డి.ఎస్.యు జాతీయ కన్వీనర్ ఎం. రామకష్ణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ పి.డి.ఎస్.యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగలి వెంకట్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాద దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా విముక్తి పోరాటాల ప్రభావంతో 1974 అక్టోబర్ 12న ఉస్మానియాలో పురుడు పోసుకున్న పీడీఎస్‌యూ 50 వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించాలని జాతీయ ఆర్గనైజింగ్ కమిటీ విద్యార్థి లోకానికి పిలుపు నిచ్చారు. 60 దశకంలో గోదావరి లోయ ప్రతిఘటన పోరాటాలు, శ్రీకాకుళ, నక్సల్ బరి పోరాటాల ప్రేరణతో ప్రగతిశీల విద్యార్థులు నూతన సమాజ స్థాపన కోసం తమ ప్రాణాలను తణప్రాయంగా అర్పించారన్నారు. ఉస్మానియా అరుణ తార కామ్రేడ్ జార్జి రెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ తోపాటు అనేకమంది విద్యార్థి రత్నాలు తమ విలువైన ప్రాణాలను ప్రజల కోసం అర్పించారని తెలిపారు. వారు అందించిన ఉద్యమాల స్ఫూర్తితో నేటికీ ప్రగతిశీల విద్యార్థులు సమ సమాజ స్థాపన కోసం కృషి సాగిస్తున్నారన్నారు. భారతదేశంలో బ్రిటీష్ వారు ప్రవేశపెట్టిన మెకాలే విద్యా విధానమే నేటికీ కొనసాగుతుందని.. మోడీ ప్రకటించి అశాస్త్రీయమైన, హేతుబద్ధత లేని పుక్కిటి పురాణాలతో నిండి ఉన్న నూతన జాతీయ విద్యా విధానం తీసుకొచ్చారన్నారు. తార్కిక జ్ఞానాన్ని పెంపొందించవలసిన విశ్వవిద్యాలయాలు చిలక జ్యోతిష్యం, వాస్తు శాస్త్రాలు సిలబస్ గా తీసుకొచ్చి విశ్వవిద్యాలయాలను బ్రాహ్మణ అగ్రహారాలుగా మారుస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. శాస్త్రీయ విద్య లక్ష్యంగా, అందరికీ అందుబాటులో ఉండే విద్య కొరకు ఏర్పడిన పీడీఎస్‌యూ తమ లక్ష్యానికి అనుగుణంగా రాజీలేని పోరాటాలను నిర్వహిస్తుందన్నారు. 50 వసంతాల సందర్భంగా విద్యార్థులను చైతన్యం చేయడానికి కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జాతీయ నాయకులు విజయ్ ఖన్నా,తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. సాంబ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్ ఎండీ రఫీ , ఎస్ కిరణ్ కుమార్, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్. అప్పారావు, పి.ఓ.డబ్ల్యు రాష్ట్ర నాయకులు సరళ, పి.డి.ఎస్.యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి మిశ్రిన్ సుల్తానా రాష్ట్ర నాయకులు గణేష్, సైదులు, ధరణి, సుమన్, రంజిత్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నాయకులు భాను ప్రసాద్, షాహిద్ , పాల్గొన్నారు.

మత్స్య భవన్ ముందు మత్స్యకార రైతుల ధర్నా



నవతెలంగాణ-బంజారా హిల్స్

మా బిల్లులు చెల్లించండి మహాప్రభో..! లేదంటే మాకు ఆత్మహత్యమే శరణ్యం అంటూ మాసబ్ ట్యాంక్ లోని మత్స్య భవన్ ముందు తెలంగాణ మత్స్యకారులు,ముదిరాజ్ సంఘాలు, బెస్త సంఘాల నాయకులు బుధవారం బైఠాయించి నిరసన తెలియజేశాయి. గత ప్రభుత్వ ద్వంద్వ విధానాలు నచ్చక ప్రజా ప్రభుత్వం రావాలని కోరుకున్న తమకు కాంగ్రెస్ ప్రభుత్వంలో నిరాశ మిగిలిస్తూ తమ పట్ల ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరి ఇకనైనా మానుకోవాలని కోరారు. తాజాగా మత్స్యకారులకు కేటాయించిన సీడ్ లో 50 శాతం సీడ్ ను కోత విధించి టెండర్ విడుదల చేయడంతో టెండర్ వేయడానికి ఏ మత్స్యకారుడు ముందుకు వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో వేసిన టెండర్‌లోని బిల్లులకు ఇంతవరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా మత్స్యకారులను ఆత్మహత్యల వైపు ప్రేరేపిస్తున్న ప్రభుత్వ వైఖరిని ఖండిస్తున్నామన్నారు. అప్పులు చేసి,భార్యల మెడల్లో పుస్తెలను సైతం తాకట్టు పెట్టి తాము టెండర్లలో పాల్గొంటున్నామని.. తమ పాత బకాయిలను విడుదల చేయకుండా తాత్సారం చేస్తున్న ప్రభుత్వం ఇకనైనా వైఖరి మానుకొని వెంటనే సీడ్ ను మత్స్యకారులకు సరిపడే మోతాదులో విడుదల చేసి పాత బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారులందరం ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పండుగ బాలు ముదిరాజ్, గుండ్లపల్లి శీను ముదిరాజ్, అల్లుడు జగన్ ముదిరాజ్, పెరుమాళ్ళ ఎల్లయ్య, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



14న మెగా రక్తదాన శిబిరం

నవతెలంగాణ-బేగంపేట్

వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సోమవారం గ్రేటర్ హైదరాబాద్ వైఎంసీఏ అధ్యక్షులు జయకర్ డేనియల్, కో ఆర్డినేటర్లు జవహార్ కెనెడీ, రెవరెండ్ డాక్టర్ నవీన్ చిట్టాయ్, రెవరెండ్ జాసన్ దేవిడ్లు వైఎంసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వైఎంసీఏ ఏర్పాటు చేసి 180 ఏండ్లు అవుతున్న సందర్భంగా తలసీమియా, హెచ్ఐవీ, క్యాన్సర్ రోగులకు ఈ మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. 14న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ రక్తదాన శిబిరం కొనసాగుతుందని పెద్ద ఎత్తున యువత ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని సూచించారు. మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఫిరోజాఖాన్ తదితరులు హాజరుకానున్నారని చెప్పారు. 180 ఏండ్లుగా వైఎంసీఏ కులం, మతం, ప్రాంతం అనే బేధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా యువత ఇతర వ్యసనాలకు లోను కాకుండా వారిని సన్మార్గంలో నడిపించేందుకు స్పోర్ట్స్ తో పాటు అనేక సామాజిక సేవా కార్యక్రమాల వైపు మళ్లించిందన్నారు. కొన్ని లక్షల మంది క్రీడాకారులు వైఎంసీఏ నుంచి పుట్టుకుని వచ్చారని చెప్పారు. వైఎంసీఏ ప్రతినిధులు ఈబర్ పాల్, కెన్నెత్, కో ఆర్డినేటర్లు జేమ్స్ జూడ్సన్, డేవిడ్ నోర్ఫోక్. సుజీవన్ తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో అన్నదానం

నవతెలంగాణ-బేగంపేట్

ప్యాట్నీ సెంటర్‌లో సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో ఏర్పాటుచేసిన గణనాథునికి బుధవారం సీఎంఆర్ షాపింగ్ మాల్ సంస్థ అధినేతలు, సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమకు ఎప్పుడు వెన్ను దండలు అందించే కస్టమర్లు ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని భగవం తున్ని వేడుకున్నారు. అనంతరం సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్ర మానికి దాదాపు మూడు వేలకు పైగా మంది హాజరయ్యారు.



కోర్టు ఆదేశాలను అమలు చేయాలి



- బీసీ సంక్షేమ సంఘం,బీసీ సంఘాల జేసీ నాయకుల జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్

నవతెలంగాణ-బంజారాహిల్స్

హైకోర్టు తీర్పు బీసీల నైతిక,పాక్షిక విజయం మాత్రమేనని భావిస్తున్నట్టు బీసీ సంక్షేమ సంఘం,బీసీ సంఘాల జేఏసీ నాయకులు జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ కుల,జాతి సంఘాలతో కలిసి ఆయన మాట్లాడారు. హైకోర్టు తీర్పును గౌరవించి తక్షణమే కులగల చేపట్టాలన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే సమగ్ర కులదరణ చేపట్టి దాని ద్వారా 42 శాతం రిజర్వేషన్ పెంచుతామని కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. బీసీ కుల సంఘాల ఒత్తిడితో క్యాబినెట్ చూసి రూ. 150 కోట్ల బడ్జెట్ ఇచ్చారని.. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌కు ఏమైందో ఏమో తెలియదు కానీ నత్త నడకన దాటవేత ధోరణితో వ్యవహరించిందన్నారు. అంతటితో ఆగకుండా కులగణన చేపట్టకుండానే ఎన్నికల జరపాలని కుట్రపన్నిందని ఆరోపించారు. ఇలాంటి కుట్రలు చేస్తే బి.ఆర్.ఎస్‌కు ఏ గతి పట్టిందో అదే పడుతుందని హెచ్చరించారు. ఢిల్లీలో ఏఐసీసీ కార్యాలయాన్ని ముట్టడించామని తెలిపారు.ఏ పదవి లేని జానారెడ్డిని పక్కన పెట్టుకొని కులగణన చేపట్టకుండానే ఎన్నికలు పోవాలని పథకం రచించారని దీనిపై వీధి పోరాటంతో పాటు న్యాయపోరాటం ప్రారంభించి హైకోర్టులో 7991/2019లో కేసు వేశామన్నారు. ఈ పిటిషన్ పై సుదీర్ఘమైన వాదనలు జరిగిన అనంతరం దీనిపై చీఫ్ జస్టిస్ లోక ఆరాథే,జస్టిస్ శ్రీనివాసరావులు కులగణన తీర్పు ఇచ్చారన్నారు. హైకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు.

అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి 3 నుంచి 4 నెలల బీసీ కులగణన చేపడతామని లిఖిత పూర్వకంగా హైకోర్టుకు ఇచ్చారనీ గుర్తు చేశారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో తక్షణమే కులగణన రోడ్ మ్యాప్ ప్రకటించి 42 శాతం రిజర్వేషన్ ప్రకటించిన తరువాతనే ఎన్నికల నిర్వహించాలని తమిళనాడు తరహా 9 షెడ్యూల్లో పెట్టిన విధంగా రిజర్వేషన్లు ఇవ్వచ్చున్నారన్నారు. నైతికంగా గెలిచిన వీధి పోరాటం మాత్రం ఆపమనీ.. ఈనెల 25న కుల గణన మార్చును నిర్వహిస్తామనీ తెలిపారు. లక్షలాదిమందితో హైదరాబాద్‌ను ను దిగ్బంధం చేయబోతున్నట్టు ప్రకటించారు.ప్రభుత్వం తరఫున ప్రత్యేక ప్రకటన వచ్చేవరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గణేష్, శ్రీనివాస్, శేఖర్ సగర, శమ్ కురుమ, విజయ కుమార్, మని మంజరి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు అంతా 'సెల్ కల్చర్' దే

- శాస్త్రవేత్త డా.చల్ల సురేష్
- ఓయూలో ముగిసిన సెల్ కల్చర్ వర్క్ షాప్



నవతెలంగాణ-ఓయూ

భవిష్యత్తు అంతా సెల్ కల్చర్ టెక్నాలజీదేనని శాస్త్రవేత్త డాక్టర్ చల్లా సురేష్ అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ప్రొఫెసర్ టి. నవనీత్ రావు సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ (సీఎఫ్ఆర్డి) బుధవారం సెల్ కల్చర్ టెక్నాల జీపై మూడు రోజుల హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాప్ ఘనంగా ముగిసింది. నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. బి. భీమా సెప్టెంబర్ 9న ప్రారంభించిన విషయం తెలిసిందే. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ లోని ఐసిఎంఆర్-ఎన్ఐఎన్ కు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ చల్లా సురేష్ హాజరై, అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడంలో, ప్రపం చ స్థాయి పరిశోధన కోసం వారిని సిద్ధం చేయడానికి ఇలాంటి వర్క్ షాప్స్ దోహదపడుతుందన్నారు. ప్రాము ఖ్యత వివరిం చారు. గౌరవ అతిథిగా హాజరైన యూనివర్సి టీ కాలేజ్ ఆఫ్ సైన్స్ వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. జి. జయశ్రీ, జీవశాస్త్రంలో వారి నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు వర్క్ షాప్ హాజరైన విద్యార్థులను అభినందించారు. వర్క్ షాప్ కన్వీనర్ అండ్ పీటీఎన్ఆర్-సీఎఫ్ఆర్డీ డైరెక్టర్,ఓయూ, ప్రొఫెసర్ సందీప్త బూర్గుల వర్క్ షాప్ ఉద్దేశాన్ని వివరిం చారు. అత్యాధునిక పరిశోధనలో సెల్ కల్చర్ టెక్నాలజీ ప్రాముఖ్యతను వివరించారు. వర్క్ షాప్ సమన్వయ కర్తలు, ఓయూలోని మైక్రోబయాలజీ విభాగంలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్ పర్సన్ డాక్టర్ హమీదాబీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె శాంతి కుమారి, మెరుగైన ఉపాధి కోసం విద్యార్థులలో నైపుణ్య అభివృద్ధి అవసరం గురించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ యుగంలో సెల్ కల్చర్ ప్రాముఖ్యతను లైఫ్ సైన్సెస్, అనుబంధ విషయాలైన ఫార్మాస్యూటికల్ సైన్సెస్, బయోమెడికల్ ఇంజినీరింగ్, కెమికల్ టెక్నాలజీ మొదలైన పరిశోధకులకు వివరించారు. హైదరాబాద్ ప్రపంచానికి వ్యాక్సిన్ ఫార్మా రాజధాని కావడంతో, భవిష్యత్ పరిశోధనలో సెల్ కల్చర్ టెక్నాలజీ ఒక సమగ్ర భాగంగా ఉంటుంది. ఎం.ఎస్సి , బి.ఎస్సి విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి టీవీఎస్ జూపిటర్ 110..



నవతెలంగాణ-బంజారాహిల్స్

ద్విచక్ర వాహనాల సెగ్మెంట్‌లో తనదైన ముద్ర వేసుకున్న టీవీఎస్ సంస్థ నగర మార్కెట్‌లోకి జూపిటర్ 110 ను తీసుకువచ్చింది. సోమాజిగూడలోని అంజలి టీవీఎస్ షో రూమ్ లో సరికొత్త ఫీచర్స్ తో తీసుకువచ్చిన వాహనాలను సంస్థ ఎండీ ఆంజనేయులు,టీవీఎస్ క్రెడిట్ హెడ్ మురళి, హైదరాబాద్ సేల్స్ టీ ఎం సురేష్ చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించి ప్రసంగించారు. నూతన తరం ఇంజన్, ఫస్ట్ ఇన్ సెగ్మెంట్ ఫీచర్లు ఇందులో ఉన్నాయని తెలిపారు. నేటితరం యువతి యువకులతో పాటు అన్ని వర్గాల వారికి నచ్చేలా వాహనాన్ని రూపొందించినట్టు చెప్పారు. 2.0 టెక్నాలజీతో రూపొందించిన వాహనం మంచి మైలేజ్ సైతం ఇస్తుందని చెప్పారు. అన్ని వర్గాల వినియోగదారుల అవసరాలను దష్టిలో ఉంచుకొని రూపొందించినట్టు చెప్పారు. ఆసక్తిగల వినియోదారులు సోమాజిగూడలోని అంజలి టీవీఎస్‌లో సంప్రదించాలని కోరారు.

సుంకు రాం చందర్ ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-ఓయూ

బౌద్ధ నగర్ డివిజన్ పరిధిలో సిద్ది వినాయక వారి ఆధ్వర్యంలో జమై ఉస్మానియా వద్ద ఏర్పాటు చేసిన గణపతి మండలం వద్ద బీఆర్ఎస్ సీనియర్ నేత సుంకు రాంచందర్ పాల్గొని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గా నియమితులైన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ని కలిసి పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సత్కరించిన రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు పల్లె లక్ష్మణ్ రావు గౌడ్,రాష్ట్ర గౌడ హాస్టల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, రాష్ట్ర గౌడ సంఘం కార్య నిర్వాహక అధ్యక్షులు పులి లక్ష్మీపతి గౌడ్ మరియు రాష్ట్ర కల్లు గీతా కార్మిక సంఘం అధ్యక్షులు కామారెడ్డి హన్మండ్లు గౌడ్, పలువురు గౌడ సంఘం నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు.

నవతెలంగాణ-అంబర్‌పేట



గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కేపీహెచ్‌బీ కాలనీ వన్ సిటీలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద మంగళవారం రాత్రి జరిగిన పూజా కార్యక్రమంలో కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, కేపీహెచ్‌బీ సిఐ వెంకటేశ్వరావు, నాయకులు వెంకట్రావు, శివ చౌదరి, బచ్చు మల్లి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

మండపం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

సనాతన ధర్మాన్ని కాపాడుతూ ఇతర మతాలను గౌరవించాల్సిన బాధ్యత పౌరుల పైన ఉందని సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం కేపీహెచ్ బీ కాలనీ టెంపుల్ బస్టాప్‌లో కె.పి.హెచ్.బి. కల్చరల్ అసోసియేష న్ ఆధ్వర్యంలో.. ఏర్పాటుచేసిన గణనాథుని మండపం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై గణ నాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. వినాయక నవరత్రోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సంప్రదాయ నృత్యం చేసిన చిన్నారులను అభినందించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర రావుకు కూకట్‌పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంజీవ్ రావు, మేకల మైకల్, దేవ సహాయం రవి, రాజేష్ గౌడ్,అరవింద్ రెడ్డి, నలినీకాంత్, లుంగీరాజు, రాజు ముదిరాజు, శేషగిరి నాయుడు, ఎస్ఐ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు...

గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలాజీనగర్, కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కో ఆర్డినేటర్ సతీష్ అరోరా పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పవన్ కుమార్, రాజశేఖర్ రెడ్డి, శరత్, రాదేశ్యామ్, అనిల్, పాతూరి గోపి పాల్గొన్నారు.



ఘనంగా పూజలందుకున్న లంబోదరుడు..

గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం కేపీహెచ్ బీ రోడ్ నెంబర్ -2, ధనలక్ష్మి సెంటర్ చత్రపతి ధర్మ రక్షణ సేన వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద కూకట్‌పల్లి జనసేన కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే విధంగా ఆయనను కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం జనసేన నాయకులు కొల్లా శంకర్, పోలెబోయిన శ్రీనివాస్, పులగం సుబ్బు,గణేష్, బీజేపీ బాలాజీ నగర్ ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్, ఉత్సవ కమిటీ సభ్యులు సిహెచ్ .చరణ్ తేజ, హరీష్ ,జగన్, కృష్ణారెడ్డి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



సత్ జ్ఞాన్ హై స్కూల్ ప్రిన్సిపాల్‌కు గురు పురస్కార్ 2024 అవార్డు ప్రధానం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ వెంకటేశ్వర నగర్ సత్ జ్ఞాన్ హై స్కూల్ ప్రిన్సిపాల్ లయన్ చింతల మల్లేశంకు విద్యాప్రదాత గురు పురస్కార్-2024 అవార్డు ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి, హైదరాబాద్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.బి కృష్ణ యాదవ్ చేతుల మీదుగా లయన్ చింతల మల్లేశం విద్యారంగంలో, సామాజిక రంగంలో చేస్తున్న విశేష సేవలుకు గాను అవార్డు ప్రధానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి మాట్లాడుతూ... లయన్ చింతల మల్లేశం గత మూడు దశాబ్దాలుగా విద్యారంగంలో విశేష సేవలు అందించి తల్లిదండ్రుల ఆధారాభిమానాలు పొంది ఎంతోమంది విద్యార్థిని విద్యార్థులని ఈ సమాజంలో ఒక మంచి పౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ అధ్యక్షులు ఎంబి కృష్ణ యాదవ్ మాట్లాడు తూ... తన పాఠశాలలో విద్యార్థులకే కాకుండా తన పుట్టిన ఊరులో సేవా కార్యక్రమాల అందించడం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా ఉంటుందని తెలియజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత లయన్ చింతల మల్లేశం మాట్లాడుతూ... చిన్నప్పుడు తల్లిదండ్రులు నేర్పిన నడవడి ప్రవర్తన వల్లనే ఈరోజు ఇంతమంది అభిమానాన్ని పొందడం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మిస్సెస్ ఫెమినా యూఎస్ ఏ డాక్టర్ సూర్య రేవతి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్ ఏవి రావు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు..

కార్పొరేషన్ మేయర్ ఇంట విషాదం..

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అత్త సీనియర్ నాయకులు ,కోలన్ గోపాల్ రెడ్డి మాతృ మూర్తి కోలన్ కాంతమ్మ చనిపోయిన విషయం అందరికి విధితమే. బుధవారం అంతిమ యాత్ర భారీ జన సందోహంతో సాగింది. అనంతరం వారి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంతిమ యాత్రలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, మహిళా నాయకులు, నిజాంపేట్ గ్రామస్తులు, ఆయా సామాజిక వర్గ సభ్యులు, మహిళలు, స్థానిక ప్రజలు భారీగా పాల్గొన్నారు. దివంగత కాంతమ్మకి అంతిమ కన్నీటి వీడ్కోలు పలికారు.



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా నియమితులైన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను బుధవారం ఆయన నివాసంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. తర్వాత పూల బొకేను అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

టీపీసీసీ ఉపాధ్యక్షులు నిరంజన్‌కు సన్మానం

నవతెలంగాణ- చంపాపేట్

తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మెన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు నిరంజన్‌ను చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సర్దార్ భాగేందర్ సింగ్ బుధవారం స్థానిక నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత పూల మాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రత్యేక శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



'పార్కుల్లో పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వాలి'



నవతెలంగాణ-ఎల్బీనగర్

హెచ్ఎండీఏ అవుటర్ రింగ్ రోడ్డు పరిధిలోని పార్కు, నర్సరీల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేత నాలు ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ రాష్ట్ర ఉపా ధ్యక్షులు భూపాల్ ఆధ్వర్యంలో హెచ్ఎండీ కమిష నర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ మాట్లాడుతూ హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధిలో నిర్వహిస్తున్న పార్కులు, నర్సరీలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 175 కిలోమీటర్లలో ఉన్నటువంటి పార్కులు, నర్సరీలో, హౌస్ కీపర్స్, సెక్యూరిటీ గార్డులు, వాచ్ మెన్స్ అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నారని, వారికి కనీస వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఎండీఏ టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తున్నారని, కాంట్రాక్టు పొందిన ఏజెన్సీలు చట్టబద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం కనీస వేతనాలు, సౌకర్యాలు అమలు చేయడం లేదని ఆరోపించారు. అర్బన్ ఫారెస్ట్ ఎస్ఎఫ్ఆర్ రేట్ల ప్రకారం చెల్లిస్తామన్నారు. వీటి ప్రకారం పదివేల నుండి 12,516 మధ్యన కార్మికుల వేతనాలు పొందుతున్నారని తెలిపారు. గత 15 సంవత్సరాల నుండి 20 సంవత్సరాలు పైగా పనిచేస్తున్న వారికి చాలా తక్కువ వేతనాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. పెరిగిన ధరల నేపథ్యంలో ఇవి ఏమాత్రం సరిపోదని అన్నారు. కనీసం రూ.21 వేల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 2021 జూన్ నెలలో జీవో నెంబర్ 60 ద్వారా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న వారికి వేతనాలు పెంచింది అని గుర్తు చేశారు. ఆ జీఓ ప్రకారం హెచ్ఎండీ వర్కర్స్‌కు కూడా అమలు పరచాలని కోరారు. అలాగే పీఎఫ్, ఈఎస్ఐ, ష్ బ్లౌజులు, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అదేవిధంగా వేతనాలు ప్రతి నెల 5 లోపల చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సెలవులు చట్టబద్ధంగా అమలు పరచాలని కోరారు. వనస్థలిపురంలో ఎల్‌జీబి పార్క్, రాజీవ్ గాంధీ పార్క్, పిర్యదర్శిని పార్క్, ఉప్పల్ బాగాయత్ పార్కులలో అనేక సంవత్సరాల నుండి కార్మికులు పనిచేస్తున్నారని ఎల్లయ్య తెలిపారు. వినతి అందజేసిన వారిలో రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జగదీష్, కీసరి నర్సిరెడ్డి, జిల్లా నాయకులు ఎల్లయ్య, యూనియన్ ప్రధాన కార్యదర్శి బిక్షపతి, శ్రీరాములు, ఎల్లయ్య, కుమార్, నర్సింహా, సత్తయ్య, మణెమ్మ, కృష్ణ పాల్గొన్నారు.

'దళిత బిడ్డ పెండ్లికి ఉప్పల ఫౌండేషన్ చేయూత'



నవతెలంగాణ- నాగోల్

ఓ దళిత ఆడబిడ్డ వివాహానికి ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో తోచిన సహాయ, సహకారాలు అందించి చేయూతనిచ్చినట్టు టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, ఉప్పల ఫౌండేషన్ చైర్మెన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త తెలిపారు. నాగోల్‌లోని ఉప్పల శ్రీనివాస్ గుప్త క్యాంపు కార్యాలయంలో బుధవారం నాగోల్‌కి చెందిన సుమలత వివాహానికి సాయం చేయాలని కోరుతూ ఉప్పల శ్రీనివాసు గుప్తను ఆమె తల్లీదండ్రులు మర్యాదపూర్వకంగా కలిశారు. వెంటనే వారి ఆర్థిక పరిస్థితులు తెలుసుకొని శ్రీనివాస గుప్తా.. మంగళసూత్రం, మట్టెలు, చీర, గాజులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక పేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల పెండ్లికి సహాయ, సహకారాలు అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెండ్లి కూతరు తండ్రి లక్ష్మణ్ , వారి కుమారుడు బాల కిషన్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

దిల్‌సుఖ్ నగర్ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు

కానరాని విద్యుత్ శాఖ అధికారులు

గణేష్ వేడుకల్లో భక్తితో పాటు భక్తుల ప్రాణాలు ముఖ్యమే...





నవతెలంగాణ-హయత్ నగర్

నవరాత్రి గణేష్ ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించేందుకు మండపాలు ఏర్పాటు చేస్తారు. కానీ నిర్వాహకులు సైతం వారి భక్తితో పాటుగా అక్కడికి వచ్చే భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత కూడా వారిదే. అసలు భక్తి ఉండాలంటే ముందు ప్రాణాలు ఉండాలని కొందరు సూచిస్తున్నారు. గల్లి గల్లిలో, వీధి వీధిలో, వాడ వాడలో గణేష్ విగ్రహాలను ప్రతిష్టిస్తున్నారు భక్తులు. మరి వారి ప్రాణాలకు ముప్పు వాటిల కుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, దానికి సంబంధించిన పోలీస్ శాఖ, విద్యుత్ శాఖలను అప్రమత్త చేస్తూ వారిలో చైతన్యం పరుస్తు వస్తున్నారు.

మండపం నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా ఇటీవల దిల్‌సుఖ్‌నగర్‌లోని పీ అండ్ టీ కాలనీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మండపం అంతా దగ్ధం అయింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లలేదు. అదేవిధంగా నాగోల్ పరిధిలో ఒక వ్యక్తి మండపం నిర్మించే క్రమంలో మిషన్ రంపం ఛాతిని కోసేసింది. ఇలాంటి ఘట నలు పునరావృతం కాకుండా ఉండాలంటే భక్తితో పాటుగా ప్రాణాలు ఉండాలంటే జాగ్రత్తలు తీసు కోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 401 గణేష్ విగ్రహాలు. హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 430 గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు పోలీసులు చెబుతు న్నారు. ఈ పండుగ మీ తల్లీదండ్రులకు విషాదం మిగల్చకుండా ఉండే విధంగా చూసుకోండి.

మండపాల వద్ద కానరాని విద్యుత్ అధికారులు

గణేష్ మండపాలకు తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ కేటాయించినట్లు సీఎం ఆదే శాలు జారీ చేశారు. దానిని దృష్టిలో పెట్టుకొని విద్యుత్ శాఖ అధికారులు వెళ్లి ఎక్కడెక్కడ మండ పాలు ఏర్పాటు చేశారు. ఎక్కడ విద్యుత్ అవసరమో తెలుసుకుని విద్యుత్ వల్ల ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగ కుండా మండపం నిర్వాహకులకు సలహాలు, సూచ నలు ఇవ్వాల్సింది పోయి విద్యుత్ శాఖ అధికారులు గణేష్ మండపాల వద్ద లేరు. దీంతో నిర్వాహకుల్లో యుక్త వయస్సు వారు విద్యుత్ ఏర్పాటులో వారికి అవగాహన లేక పోవడంతో ఇటీవల దిల్‌సుఖ్‌నగర్ నగర్ ఘటన ఉదాహరణ. మరల ఇలాంటి ఘటనలు పునరా వృతం కాకుండా ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కొందరు అభిప్రాయపడు తున్నారు.

నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

కరెంట్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. కాటన్ పరదాలు సులభంగా కాలిపోతాయి కాబట్టి గమనిస్తూ ఉండాలి. కొందరు మెయిన్ లైన్ల నుండి దొంగ చాటుగా విద్యుత్ తీసుకుంటున్నారు. అది చాలా ప్రమాదకరం. భారీ శబ్దంతో గుండె పోటు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. ప్రమీదల కింద ఇసుక, మట్టి పెట్టుకోవాలి. నిమజ్జన సమయంలో చెరువులో దిగకుండా ఉండాలి.

మండపాల్లో సీసీ కెమెరాల నిఘా ఉండాలి

వినాయక మండపాల్లో అద్దెకు వచ్చే సీసీ కెమెరాలను అమర్చుకుంటే ఎలాంటి ఘటనలు జరిగిన వెంటనే తెలిసిపోతుంది. ఆర్గనైజర్లు తప్పని సరిగా మండపాల్లో నిద్రించాలి. ప్రమిదల కింద ఇసుక, నీరు లేదా యేదో ఒకటి పెట్టి దీపం వెలిగించాలి. రాత్రి 10గంటలు దాటితే మైక్ శబ్దాలు రాకుండా ఉండాలి. విద్యుత్ తీగలు నేరుగా ఏర్పాటు చేసుకోవద్దు. విద్యుత్ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలి.

ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్

మండపాల వద్ద ఇసుక, నీరు తప్పని సరి

గణేష్ మండపాల వద్ద ముందస్తుగా నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలని. నిర్వా హకులు కనీసం ఇద్దరు నిద్రించాలని, విద్యుత్ తీగలకు మండపాలు దూరంగా ఉండేలా చూసు కోవాలి.

- హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు

గంజాయి విక్రేత అరెస్ట్

నవతెలంగాణ-హయత్‌నగర్

గంజాయి అమ్ముతున్న ఓ వ్యక్తిని ఎల్బీనగర్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్ర నగర్‌కు చెందిన మహ్మద్ బషీర్ అలియాస్ ఫైజల్ అలియాస్ సైఫాన్..ఎల్బీనగర్‌లోని ఎన్‌టీఆర్ నగర్‌లో గంజాయి అమ్ముతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందిందని చెప్పారు. వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు అతన్ని వద్ద నుండి 18.03గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తర్వాత అతన్ని రిమాండ్ తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఏ రాజకీయ పార్టీకైనా పునాది కార్యకర్తలే

- అందెల శ్రీరాములు యాదవ్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

ఏ రాజకీయ పార్టీకైన పునాది కార్యకర్తలేనని, తమ జీవితాలను అంకితం చేసి పార్టీలను కాపాడేది కూడా కార్యకర్తలేనని మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్‌లోని వైఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. తర్వాత ఈ కార్యక్రమానికి హాజరైన మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ధీటుగా బీజేపీకి ప్రజలు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో పార్టీ మరింత బలంగా అయ్యే విధంగా ప్రతి ఒక్కరం కృషి చేయాలన్నారు. అనంతరం పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, అందెల శ్రీరాములు యాదవ్‌కు సభ్యత్వ నమోదు గుర్తింపు కార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు బీజేపీ పార్లమెంటు విప్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, సభ్యత్వం నమోదు జిల్లా ఇంచార్జి, మాజీ శాసన సభ్యులు యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, పార్లమెంట్ కన్వీనర్లు, అసెంబ్లీ కన్వీనర్లు, మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల గణనాథుడి పూజలో నాయకులు



నవతెలంగాణ- బడంగ్‌పేట్

బడంగ్‌పేట కార్పొరేషన్ 28వ డివిజన్‌లోని వసంత్ విహార్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బంగారి అశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ పూజలో కేఎల్ఆర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు పుట్టగల్ల జగన్, గుడ్ల శ్రీనివాస్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-ఎల్బీనగర్



మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ పరిధిలోని వాసవి కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ పూజా కార్యక్రమానికి వాటర్ వర్క్స్ డీజీఎం రవీంద్రనాథ్ వర్మ, వాటర్ వర్క్స్ ఏఈ రామ కృష్ణారెడ్డి హాజరయ్యారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి, వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి కాలనీ అధ్యక్షుడు గౌరీశెట్టి చంద్రశేఖర్ గుప్త, ప్రధాన కార్యదర్శి అంజయ్య, కోశాధికారి కృష్ణయ్య అష్టలక్ష్మీ దేవాలయ అక్షయ ట్రస్ట్ సెక్రెటరీ సుధాకర్ గుప్తా, సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు బంధం దామోదర్, గౌరిశెట్టి అరుణ్, కమిటీ సభ్యులు గౌరీ శంకర్, వనమా సుదర్శన్, తమ్మన్న శ్రీధర్, మాలే అనిల్, ఒరుగంటి వెంకటేశ్వర్లు, గ్రంధి రమేష్, గందే శ్రీకాంత్, డాక్టర్ రాంకిషన్, శుభకర్, కృష్ణ మూర్తి, చందు, రాజేంద్ర ప్రసాద్, సుబ్బారావు, మేఘమాల, సుజాత, లక్ష్మీ భ్రమరాంబా, లావణ్య, అరుణ, వనజ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్‌గూడలోని వినాయక హిల్స్ ఫేస్ 2 రోడ్డు నెంబర్ 5లో బుధవారం నిర్వహించిన గణేష్ ఉత్సవాల్లో కార్పొరేటర్ బోయపల్లి దీపిక శేఖర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్



మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ గణనాథుడిని వద్ద నకిరేకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే వేముల వీరేశం బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు కళ్లెం నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవ సమితి సభ్యులు ఎమ్మెల్యేను పూల మాలలు, శాలువాతో ఘనంగా సన్మానించి.. లడ్డూను బహుకరించారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్‌లోని గణనాథుడిని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి దర్శించుకొని, ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమం



అనంతరం కార్తీక్ రెడ్డికి వేద పండితులు తీర్థప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణేష్ నిమజ్జనం

నవతెలంగాణ - చంపాపేట్

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని వేద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో కళాశాలలో నెలకొల్పిన వినాయకుడి నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ సుభాష్, సంతోష్ నగర్ ఏసీపీ మహమ్మద్ గౌస్, ఐఎస్‌సదన్ సీఐ వెంకట్ రామయ్య ఆదేశం మేరకు ఎస్ఐ డి. విజయ్ కుమార్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జన వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



టైమ్స్ ఆఫ్ నేషన్ హైదరాబాద్ క్రైమ్ బ్యూరో ఇన్వెస్టిగేషన్ టీమ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ మహ్మద్ ఆరిఫ్ ఖాన్, డాక్టర్ మహ్మద్ ఐజాజ్ స్థానిక నాయకులతో మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ మహ్మద్ షేక్, మహ్మద్ రఫీక్ సయ్యద్ సలీం సివిల్ రైట్స్ గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ సెక్రటరీ, రుక్సానా బేగం సోషల్ వర్కర్ జహంగీర్ ఖాన్, సోషల్ వర్కర్ ఫైజ్ ఉల్లా బేగ్, సోషల్ వర్కర్ మజర్ జిలానీ, సోషల్ వర్కర్ మన్సూర్ అలీ, సోషల్ వర్కర్ ఖాజాఖాన్ పాల్గొన్నారు.



నవతెలంగాణ- చంపాపేట్

జేఏసీ నిర్ణయాన్ని స్వాగతీస్తున్నాం

రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

వరద బాధితుల సహాయార్థం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఒకరోజు బేసిక్ పే ప్రభుత్వానికి ఇవ్వడాన్ని రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ స్వాగతించింది. ఈ మేరకు బుధవారం తాత్కాలిక జేఏసీ చైర్మెన్ ఎం.శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ విభాగాల ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొని ఉద్యోగులంతా కలిసి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్, వెటర్నరీ, హార్టికల్చర్ యూనివర్సిటీ ఉద్యోగులు, వాలంటరీ, అపార్డ్, ఎస్టీవో, తాహసిల్ ఆఫీస్, ఈటీసీ ఉద్యోగులతో పాటు



ఇతర సంస్థల ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ మారం జగదీష్, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ(ముజీబ్), ఏలూరు శ్రీనివాస్‌లకు మద్దతుగా నిలవడం సంతోషకరంగా ఉందని తాత్కాలిక జేఏసీ చైర్మెన్ ఎం. శ్రీనివాస్ యాదవ్, కన్వీనర్ ఎస్.యాదయ్య ముదిరాజ్, పెన్షనర్స్ అసోసియేషన్ అంజయ్య గౌడ్, టీఎన్జీవోస్ యూనియన్ పీఆర్వో సయ్యద్ జహంగీర్ అలీ పాల్గొన్నారు.

నవతెలంగాణ మానవి
గురువారం 12 సెప్టెంబరు 2024
హైదరాబాద్
www.navatelangana.com

కాలీఫ్లవర్ కూడా ఓ రకమైన పువ్వు జాతికి చెందినదే. ఇందులో విటమిన్ సీ, కే, ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ బి6, పుష్కలంగా ఉంటాయి. శరీరానికి అవసరమైన అన్నిరకాల లవణాలూ ఉన్న వెజిటబుల్. నిజానికి క్యాబేజి కన్నా విలువైన పోషకాలు ఇందులో ఉంటాయి. ఇది క్యాన్సర్ నిరోధక కాయగూరల్లో రారాజు. క్యాన్సర్‌ను నిరోధించే బయో ఫ్లావనాయిడ్స్ ఇందులో పుష్కలంగా ఉంటాయి. పీచుపదార్థం ఎక్కువ. రేచీకటిని, చిన్న వయసులో జుట్టు తెల్లబడటాన్ని, ఊడిపోవడాన్ని నివారిస్తుంది. అంతేకాదు ఇది గర్భిణీ స్త్రీలకు చాలా ఉపయోగకరం. ఇది బేబీ వృద్ధికి ఎంతో సహాయపడుతుంది. కాబట్టి గర్భిణీలు రెగ్యులర్ డైట్ లో చేర్చుకోవడం చాలా అవసరం.



కాలీఫ్లవర్‌తో వెరైటీగా

పకోడి

కావలసిన పదార్థాలు: కాలీఫ్లవర్- ఒకటి, శనగపిండి- అర కప్పు, బియ్యపుపిండి-పావు కప్పు, మొక్కజొన్న పిండి - పావు కప్పు, ఉప్పు- తగినంత, కారం- రెండు స్పూన్లు, ఆరెంజ్ ఫుడ్ కలర్- చిటికెడు, ఉల్లిపాయలు- ఒకటి (సన్నగా కోసుకోవాలి), పచ్చిమిర్చి- రెండు (సన్నగా తరుక్కోవాలి), అల్లం పేస్టు- ఒక స్పూను, కరివేపాకు - 2 రెబ్బలు(సన్నగా కట్ చేసుకోవాలి), నూనె- తగినంత.

తయారీ విధానం: ముందుగా కాలీఫ్లవర్‌ను మీడియం సైజ్ ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద బాండీ పెట్టి



అందులో నీళ్లు పోసుకోవాలి. అవి మరుగుతున్నప్పుడు కాస్తంత ఉప్పు, కాలీఫ్లవర్ ముక్కలు వేసి మూత పెట్టి రెండు, మూడు నిమిషాలపాటు ఉడికించుకోవాలి. తర్వాత ఆ ముక్కలను నీటి నుంచి బయటకు తీసి పక్కన పెట్టుకోవాలి. మరో గిన్నెలో శనగపిండి, బియ్యంపిండి, మొక్కజొన్న పిండి, ఉప్పు, కారం, ఆరెంజ్ ఫుడ్ కలర్‌వేసి కలుపుకోవాలి. ఇందులోనే ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం ముద్ద, కరివేపాకు వేసి కొద్దిగా నీళ్లు పోసుకొని బజ్జీల పిండిలా మిక్స్ చేసుకోవాలి. ఈ మిశ్రమంలో కాలీఫ్లవర్ ముక్కలను వేసి పిండి ముక్కలకు పట్టేలా కలుపుకోవాలి. తర్వాత స్టవ్‌పై కడాయి పెట్టి నూనె పోసి అది మరిగాక కాలీఫ్లవర్ ముక్కలను వేసి మీడియం మంటపై డీప్ ఫ్రై చేసుకోవాలి. అంతే క్రిస్పీ అండ్ టేస్టీ కాలీఫ్లవర్ పకోడి రెడీ!

మసాలా కరీ...

కావలసిన పదార్థాలు: కాలీఫ్లవర్ - మీడియం సైజుది ఒకటి. ఉల్లిపాయలు - రెండు, పచ్చిమిరపకాయలు - రెండు, టమాటాలు - రెండు, అల్లం వెల్లుల్లి పేస్ట్ - ఒక స్పూన్, పసుపు - పావు స్పూన్, సగం స్పూన్ జీలకర్ర, ఉప్పు - రుచికి సరిపడా, గరం మసాలా - సగం స్పూను, కారం - ఒక స్పూను, ధనియాల పొడి - ఆఫ్ స్పూను, కొత్తిమీర తరుగు - కొద్దిగా, బటర్ - రెండు స్పూన్లు, ఫ్రెష్ క్రీమ్ - ఒక టేబుల్ స్పూన్, నూనె - నాలుగు టేబుల్ స్పూన్లు.

తయారీ విధానం: ముందుగా కాలీఫ్లవర్ శుభ్రపరచుకొని చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద గిన్నె పెట్టి మూడు గ్లాసుల నీళ్లు, పసుపు, కొంచెం ఉప్పు వేసి వేడిచేసుకోవాలి. నీళ్లు బాగా మరుగుతున్నప్పుడు కాలీఫ్లవర్ ముక్కలను వేసి రెండు మూడు నిమిషాల పాటు ఉంచి స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. ఇప్పుడు నీటిలో నుంచి ముక్కలను తీసి పక్కన పెట్టుకోవాలి.

స్టవ్ మీద కడాయి పెట్టి అందులో నూనె వేసి కాగిన తరువాత జీలకర్ర, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి తరుగువేసి మంచి రంగు వచ్చేంతవరకు ఫ్రై చేసుకోవాలి. ఇప్పుడు ఇందులో అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి



పచ్చివాసన పోయేంతవరకు ఫ్రై చేసుకొని పసుపు, గరం మసాలా, కారం పొడి, జీలకర్ర పొడి, ధనియాల పొడి, రుచికి సరిపడు ఉప్పు వేసి బాగా కలుపుకొని ఒక నిమిషం పాటు ఫ్రై చేసుకోవాలి. మసాలాలన్నీ బాగా వేగిన తరువాత టమోటా పేస్ట్ వేసి కలుపుకొని మూత పెట్టి తక్కువ మంట మీద ఐదు నిమిషాల పాటు ఉడికించుకోవాలి. టమోటా పేస్ట్ వేగిన తరువాత కాలీఫ్లవర్ ముక్కలు, ఒక గ్లాసు నీళ్లు పోసి మూత పెట్టి మరో 10 నిమిషాల పాటు చిన్న మంట మీద ఉడికించుకోవాలి. కూర బాగా ఉడికి కూర నుంచి నూనె పైకి తేలే సమయంలో బటర్, ఫ్రెష్ క్రీమ్, కొత్తిమీర తరుగు వేసి స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. అంతే రుచికరమైన స్పైసీ కాలీఫ్లవర్ మసాలా కూర రెడీ.

గోబీ 65..

కావలసిన పదార్థాలు : కాలీఫ్లవర్ - ఒకటి, మైదా పిండి - అర కప్పు, కార్న్ ఫ్లోర్ - మూడు స్పూన్లు, నూనె - డీప్ ఫ్రైకు



సరిపడా, అల్లం వెల్లుల్లి పేస్ట్ - ఒక స్పూను, కారం - ఒక స్పూను, దనియాల పొడి - ఒక స్పూను, మిరియాల పొడి - పావు స్పూను, గరం మసాలా - అర స్పూను, ఉప్పు - తగినంత, వంటసోడా - చిటికెడు, తరిగిన కరివేపాకు - కొద్దిగా, తరిగిన కొత్తిమీర - కొద్దిగా.

తయారీ విధానం : ముందుగా కాలిఫ్లవర్‌ను ముక్కలుగా కోసి వేడి నీటిలో వేసుకోవాలి. ఇందులో పసుపు వేసి కలపాలి. ఇప్పుడు కాలీఫ్లవర్ ముక్కలను వేసి రెండు నుంచి మూడు నిమిషాల పాటు ఉడికించాలి. నీటిని వడగట్టి పక్కన పెట్టుకోవాలి. తరువాత ఒక గిన్నెలో మైదాపిండి, కార్న్ ఫ్లోర్‌ను తీసుకోవాలి. ఇందులో ఒక టీ స్పూన్ నూనె వేసి కలపాలి. తరువాత మిగిలిన పదార్థాలన్నీ వేసి కలపాలి. ఇప్పుడు తగినన్ని నీళ్లు పోసుకుంటూ పిండిని కలుపుకోవాలి. పిండి మరీ పలుచగా, మరీ గట్టిగా కాకుండా చూసుకోవాలి. ఇలా పిండిని కలుపుకున్న తరువాత క్యాలీఫ్లవర్ ముక్కలు వేసి వాటికి పిండి బాగా పట్టేలా కలుపుకోవాలి. స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేసి వేడి చేయాలి. నూనె వేడయ్యాక మంటను మీడియం ఫ్లేమ్ మీద పెట్టుకోవాలి. నూనె బాగా కాగిన తర్వాత క్యాలీఫ్లవర్ ముక్కలను వేసుకుని వేయించాలి. వీటిని వేసిన వెంటనే కదిలించకుండా ఒక నిమిషం తరువాత అటూ ఇటూ కదిలిస్తూ వేయించుకోవాలి. వీటిని కరకరలాడే వరకు వేయించుకుని ప్లేట్ లోకి తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఎంతో రుచిగా ఉండే క్రిస్పీ గోబి 65 తయారవుతుంది. అంతే ఎంతో సింపుల్ గా ఉండే గోబీ 65 రెడీ.

రైస్

కావలసిన పదార్థాలు : కాలీఫ్లవర్ ముక్కలు - ఒక కప్పు, అన్నం - ఒక కప్పు, క్యాప్సికం - ఒకటి, బేబీ కార్న్ - 5, ఉల్లికాడలు- మూడు, ఉప్పు - రుచికి సరిపడా, మిరియాల పొడి - చిటికెడు, వెల్లుల్లి రెబ్బలు - ఐదు, పచ్చి బఠానీలు - పావు కప్పు, కొత్తిమీర తరుగు - రెండు స్పూన్లు.

తయారీ విధానం : కాలీఫ్లవర్‌ను చిన్న ముక్కలుగా కట్ చేసి పక్కన పెట్టుకోవాలి. వీటిని శుభ్రంగా కడిగి మిక్సీలో వేసి కచ్చాపచ్చాగా రుబ్బుకోవాలి. నీరు వేయకూడదు. ఆ మిశ్రమాన్ని ఒక గిన్నెలోకి తీసుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద కళాయి పెట్టి కాస్త నూనె వేయాలి. ఆ నూనెలో కచ్చాపచ్చాగా రుబ్బుకున్న కాలీఫ్లవర్ మిశ్రమాన్ని వేసి ఐదు నుంచి ఏడు నిమిషాలు చిన్న మంట మీద రోస్ట్ చేయాలి. దీనివల్ల పచ్చివాసన పోతుంది. ఆ



మిశ్రమంలో సన్నగా తరిగిన వెల్లుల్లిని కూడా వేయాలి. అలాగే తరిగిన ఉల్లికాడలు, పచ్చి బఠానీలను వేసి వేయించుకోవాలి. ఇవన్నీ వేగుతున్నప్పుడే చిన్న ముక్కలుగా కోసిన క్యాప్సికం, బేబీ కార్న్‌లను కూడా వేసి వేయించాలి. ఉప్పు, కారం చల్లి వీటన్నింటిని పచ్చివాసన పోసే పోయే వరకు ఫ్రై చేసుకోవాలి. పైన మిరియాల పొడిని చల్లుకోవాలి. ఇవి కాస్త ఉడికాక నీటిని విడుదల చేస్తాయి. ఆ నీరు కూడా ఆవిరిపోయి ఫ్రై లాగా ఈ మిశ్రమం అయ్యే వరకు వేయించాలి. ఇందులో ముందుగా ఉడికించుకున్న అన్నం చేసి ఓసారి కలుపుకోవాలి. పైన కొత్తిమీర తరుగును చల్లుకోవాలి. అంతే కాలీఫ్లవర్ రైస్ సిద్ధమైనట్టే. ఇది చాలా టేస్టీగా ఉంటుంది.

ఆ సమస్యకు చెక్

నిద్రలేమి సమస్యతో బాధపడే వారికి వ్యాయామం ఎంత అవసరమో ఇటీవల నిర్వహించిన అధ్యయనాల్లో మరోసారి వెల్లడైంది. ఈ సమస్యకు వ్యాయామాలు ఎంతో ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. వారానికి కనీసం రెండు మూడు సార్లు చేసినా రాత్రిపూట బాగా నిద్ర పడుతున్నట్టు అధ్యయనంలో తేలింది.

వ్యాయామం చేయడం వల్ల కేవలం శారీరక ఆరోగ్యం మాత్రమే



కాదు.. ఎన్నో రకాల లాభాలు ఉంటాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రతి రోజూ వ్యాయామం చేయడం వల్ల మానసిక ఆరోగ్య సమస్యలూ దూరమవుతాయి. ఊబకాయం మొదలు గుండె సంబంధిత సమస్యల వరకు ఎన్నో రకాల సమస్యలకు వ్యాయామం బెస్ట్ ఆప్షన్‌గా చెబుతారు. అయితే వ్యాయామంతో నిద్రలేమి సమస్య కూడా దూరమవుతుందని పరిశోధకులు చెబుతున్నారు.

ఇటీవల నిర్వహించిన పరిశోధన కోసం సుమారు 4400 మందిని ఎంచుకొని వారానికి ఎన్నిసార్లు, ఎంతసేపు, ఎంత తీవ్రతతో వ్యాయామం చేస్తున్నారు, నిద్రలేమి లక్షణాలు ఎలా ఉన్నాయి.? లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. అలాగే రాత్రిపూట ఎంతసేపు పడుకుంటున్నారు.? పగటిపూట ఎంతవరకూ మగతగా ఉంటున్నారు.? అనే విషయాలను పరిశీలించి ఈ విషయాలను తెలిపారు.

వారానికి కనీసం రెండు, అంతకన్నా ఎక్కువసార్లు వ్యాయామం చేసేవారిని చురుకుగా ఉన్నవారిగా పరిగణనలోకి తీసుకుని వారి నిద్రకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. ఇలాంటి వారిలో నిద్రలేమి ముప్పు 42 శాతం తక్కువగా ఉంటోందని గుర్తించారు. అలాగే వీరిలో నిద్రలేమి లక్షణాలు 22-40 శాతం వరకూ తక్కువగా ఉన్నట్టు పరిశోధనల్లో తేలింది.

కెన్యాలో అదానీకి షాక్



న్యూఢిల్లీ : గౌతం అదానీ కంపెనీకి కెన్యాలో ఎదురుదెబ్బ తగిలింది. నైరోబిలోని విమానాశ్రయ కాంట్రాక్టు తాత్కాలికంగా ఆగిపోయింది. కెన్యా ప్రభుత్వం, అదానీ గ్రూప్ మధ్య జోమో కెన్యాట్టా అంతర్జాతీయ విమానాశ్రయ ఆధునీకరణ, అభివృద్ధి కోసం ఇటీవల ఒప్పందం కుదిరింది. బిల్డ్ అండ్ ఆపరేట్ విధానంలో జరగనున్న ఈ కాంట్రాక్టు ఒప్పందం కింద ఎయిర్‌పోర్టు 30 ఏండ్ల పాటు అదానీ గ్రూప్ నిర్వహించడానికి అక్కడి ప్రభుత్వం అంగీకరించింది. ఇందులో భాగంగా అదానీ కంపెనీ ఎయిర్ పోర్టులో అత్యాధునిక సౌకర్యాలు, అదనపు రన్‌వే, టెర్మినల్‌ను నిర్మించాల్సి ఉంది. 1.8 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.15,530 కోట్లు) విలువ చేసే ఈ ఒప్పందాన్ని సవాలు చేస్తూ కెన్యా మానవ హక్కుల కమిషన్, న్యాయవాదుల సంఘం కోర్టును ఆశ్రయించాయి.

అదానీ అవినీతి భయాలు..!

అదానీ గ్రూపు ఎదుర్కొంటున్న అవినీతి ఆరోపణల నేపథ్యంలో కెన్యా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ దేశంలోకి అదానీ ప్రవేశిస్తే.. తమ ఉద్యోగాలకు భరోసా ఉండదని.. స్థానిక వ్యాపారాలు, పెట్టుబడిదారులు దెబ్బతింటారని భయాలు వారిని వెంటాడుతున్నాయి. ప్రస్తుత మోడీ ప్రభుత్వ హయంలో అదానీ గ్రూపు ఓవర్ ఇన్‌వాయిస్‌తో సహా కృత్రిమంగా షేర్ల ధరలను పెంచుకోవడం, లాబీయింగ్‌లకు పాల్పడుతున్నారనే ఫైనాన్షియల్ టైమ్స్, హిండెన్‌బర్గ్ రీసెర్చ్, ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్‌ల పరిశోధనలను అక్కడి ప్రజలు, ప్రతిపక్ష నేతలు, ఎయిర్‌పోర్టు ఉద్యోగ, కార్మిక సంఘాలను ప్రధానంగా కలవరపెడుతున్నాయి.

తూర్పు ఆఫ్రికాలోనే అత్యంత రద్దీగా ఉండే ఈ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి, నిర్వహణను అదానీకి అప్పగించడాన్ని కెన్యా ఎయిర్‌పోర్టు వర్కర్స్ యూనియన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అదానీతో ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తోంది. అదానీకి ఎయిర్‌పోర్టును అప్పగిస్తే తమ ఉద్యోగాలు ఊడిపోతాయని వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదానీతో చేసుకున్న ఒప్పందంలోని నియమ.నిబంధనలు కెన్యాకు ప్రతికూలంగా ఉన్నాయని ఆ యూనియన్ పేర్కొంది. అదానీ గ్రూప్‌తో మిగిలిన చర్చలను విరమించుకోవాలని గత వారమే ఆ యూనియన్ స్పష్టం చేసింది. లేకపోతే సమ్మెకు వెళతామని హెచ్చరించింది. అయినప్పటికీ కెన్యా ప్రభుత్వం స్పందించకపోవడంతో తాజాగా ఆందోళనలను ఉధృతం చేశారు. ఈ ఒప్పందం సహేతుకం కాదని.. ఉద్యోగాలు పోతాయని.. ప్రజల్లో అసమానతలను పెంచుతాయని.. పన్ను చెల్లింపుదారుల డబ్బుకు విలువ ఉండదని అక్కడి సంఘాలు వాదిస్తున్నాయి. కెన్యా ప్రభుత్వమే స్వయంగా ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేయవచ్చని సూచిస్తున్నాయి. కెన్యాట్టా అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉద్యోగ, కార్మికుల సమ్మెతో విమానాల రాకపోకల్లో జాప్యం నెలకొందని కెన్యా ఎయిర్‌వేస్ ప్రకటించింది. కొన్ని సర్వీసులు రద్దయ్యాయి. అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ తన ప్రధాన విమానాశ్రయాన్ని 30 సంవత్సరాల పాటు నిర్వహించేందుకు అనుమతించే ఒప్పందాన్ని కెన్యా కోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. లాసొసైట్, కెన్యా మానవ హక్కుల కమిషన్ దాఖలు చేసిన కేసు విచారణ జరిగేవరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. దీనిపై అదానీ గ్రూపు వర్గాలు స్పందించాల్సి ఉంది.

కార్మిక సంక్షేమం బీమాకు తాకట్టు

(మొదటిపేజీ తరువాయి)

నమోదయ్యారు. బీమా సదుపాయం కోసం కార్మికులు రూ.300 నుంచి రూ.450 వరకు ఏటా ప్రీమియం చెల్లించాలి. అలా ప్రీమియం పేరిట ఏటా బీమా కంపెనీకి రూ.450 కోట్ల వరకు చెల్లిస్తున్నారు. అయితే కార్మికులకు అందిన ఆర్థిక సహాయాన్ని పరిశీలిస్తే.. 2015లో రూ.20 కోట్లు, 2016లో రూ.30 కోట్లు, 2017లో రూ.350 కోట్లు, 2018లో రూ.60 కోట్లు, 2019లో రూ.82 కోట్లు, 2020లో రూ.70 కోట్లు, 2021లో రూ.80 కోట్లు, 2022లో రూ.165 కోట్లు, 2023లో రూ.205 కోట్లు, 2024 జులై చివరి నాటికి రూ.51 కోట్లు మాత్రమే..

దారి మళ్లిన బోర్డు నిధులు.. సెస్ వసూళ్లలో జాప్యం

వెల్ఫేర్ బోర్డు ఇప్పటివరకు రూ.5064 కోట్ల మేర సెస్ రూపంలో నిధుల్ని వసూలు చేసింది. ఇప్పటివరకు రూ.4263 కోట్లు ఖర్చు చేసినట్టు లెక్కలు చూపుతున్నారు. అయితే అందులో రూ.2250 కోట్ల వరకు ఇతర రంగాలకు నిధుల్ని మళ్లించి కార్మికుల కోసం ఖర్చు చేసినట్టు చెబుతున్నారు. రూ.92 కోట్లు ఆయుష్మాన్ భారత్‌కు, రూ.325 కోట్లు ఐటీఐ పేర ఖర్చు చేశారు. రూ.500 కోట్లను గతంలో అమలు చేసిన బీసీ బంధుకు కేటాయించినట్టు అప్పట్లోనే వార్తలు వచ్చాయి. హెల్త్‌క్యాంపుల పేర ఓ కంపెనీకి వందల కోట్లు ఇచ్చినట్టు తెలిసింది. కరోనా సమయంలో కార్మికుల సాయం కోసం రూ.202కోట్లు వెల్ఫేర్ బోర్డు నిధుల్ని వెచ్చించారు. వసూలు చేసే సెస్ నిధుల్నే ప్రభుత్వం వాడుకుంటుంది. మెట్రో, మెగా ఇతర బడా నిర్మాణ సంస్థల నుంచి బోర్డు సెస్ వసూలు చేయడంలో అలసత్వం ప్రదర్శించినట్టు ఆరోపణలు ఉన్నాయి.

కంపెనీలకు కట్టబెట్టొద్దు: కోటంరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి

వెల్ఫేర్ బోర్డు అధికారాల్ని నిర్వీర్యం చేసి కార్మిక సంక్షేమ పథకాల్ని తగ్గించేందుకే కంపెనీలకు అప్పజెప్పాలని ప్రభుత్వాలు చూస్తున్నాయి. ఇది తక్షణమే ఉపసంహరించుకోవాలి. బడా బీమా కంపెనీలకు బాధ్యత అప్పజెప్పడం వల్ల బోర్డు నిర్వహణ ప్రశ్నార్థకమవుతుంది. ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పుకోవడం అంటే కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేయడమే అవుతుంది. కేంద్రం కనుసన్నల్లోనే బోర్డును బలహీనపర్చి కంపెనీలకు సంక్షేమ పథకాల్ని అప్పచెబుతున్నారు. కార్మిక, బీమా రంగం నిపుణులతో చర్చించకుండా బోర్డు కార్యదర్శి, మంత్రి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారు. సుప్రీం కోర్టు చెప్పినా అడ్వజరీ కమిటీని ఏర్పాటు చేయట్లేదు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల కోసం రూపొందించిన సంక్షేమ పథకాలేవీ అమలు కావడంలేదు. టెండర్లు రద్దు చేయాలని సీఐటీయూ ఈ నెల 10 నుంచి 22 వరకు వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టింది. 23న కార్మిక శాఖ భవనం ఎదుట ధర్నా నిర్వహిస్తుంది.

దోపిడీ కోసమే...

(మొదటిపేజీ తరువాయి)

చెల్లించిన కార్మికులందరూ మరణించరు.. 2023 లెక్కలు చూస్తే కేవలం రూ.205 కోట్లు మాత్రమే కార్మికుల కుటుంబాలకు చెల్లించారు. మిగతా రూ.245 కోట్ల మేరకు ప్రీమియం రూపంలో బీమా కంపెనీకి లాభం చేకూరింది. అందుకే కార్పొరేట్ బీమా కంపెనీలు ఎగబడి టెండర్లలో పాల్గొనే అవకాశముంది. కంపెనీలకు కట్టబడితే కార్మికులు తీవ్రంగా నష్టపోనున్నారు. ప్రస్తుతం ప్రమాద మరణానికి రూ.6.30 లక్షలు ఇస్తున్నారు. బీమా కంపెనీలో ప్రమాద బీమా



రూ.5 లక్షలే ఉంది. మిగతా రూ.1.30 లక్షలు బోర్డు నుంచి ఇస్తారని చెబుతున్నా దానికి చట్టబద్ధమైన ఉత్తర్వులేమీ లేవు. సహజ మరణానికిచ్చే రూ.1.30 లక్షల గురుంచి కొత్త ప్రతిపాదనల్లో ఎలాంటి ప్రస్తావన లేదు.

వరద నష్టం ప్రాథమిక అంచనా రూ.5,438 కోట్లు

- పూర్తి స్థాయి అంచనా ప్రక్రియ కొనసాగుతోంది
- రాష్ట్ర ప్రత్యేక బృందాలకు శిక్షణ, లాజిస్టిక్‌లో మద్దతివ్వండి : కేంద్ర బృందానికి విన్నవించిన సీఎస్ శాంతి కుమారి
- ఏటూరు నాగారం విపత్తుపై సమగ్ర అధ్యయనం చేయండి
- రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర బృందం సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.5,438 కోట్ల నష్టం జరిగిందనీ, పూర్తిస్థాయి అంచనా ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని కేంద్ర బృందానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. కల్నల్ కేపీ సింగ్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కేంద్ర బృందం బుధవారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర సీనియర్ అధికారులతో సమావేశమై వరద నష్టంపై చర్చించింది. అకాల వర్షాలతో ప్రజలెదుర్కొన్న ఇబ్బందులు, పంట నష్టం తదితర అంశాలపై వారికి సీఎస్ శాంతి కుమారి వివరించారు. వాతావరణ శాఖ నుంచి వచ్చిన సమాచారం మేరకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవడం వల్ల ప్రాణనష్టం తగ్గించగలిగినా, భారీగా ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలను అందించడానికి వీలుగా మార్గదర్శకాలను ఉదారంగా రూపొందించాలని కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. సీఎం ఆదేశాల మేరకు అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యల్లో పాల్గొనేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్‌తో సమానంగా ప్రత్యేక టీంలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ బృందాలకు శిక్షణ, ఇతర లాజిస్టిక్స్ ఏర్పాట్లలో మద్దతు కావాలని కోరారు. భారీ వర్షాల సమయంలో ఎయిర్ రెస్క్యూ ఆపరేషన్ల సమస్యను కూడా సీఎస్ ప్రస్తావించారు. ఈ సవాళ్లను ఎదుర్కోవడంలో కేంద్రం సహకారాన్ని కోరారు. ఏటూరునాగారం అటవీ ప్రాంతంలో 332 హెక్టార్ల విస్తీర్ణంలో భారీ చెట్లు నేలకొరిగిన ప్రకృతి విలయాన్ని వారికి వివరించారు. ఈ పర్యావరణ విపత్తుకు మూలకారణాన్ని తెలుసుకోవడానికి సమగ్ర అధ్యయనం చేయాలని ఈ సందర్భంగా కేంద్ర బృందం సీఎస్‌కు సూచించింది. వ్యవసాయం, రోడ్లు, భవనాలు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పంచాయతీరాజ్, ఇంధనం, పశుసంవర్ధక, అటవీ శాఖల ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జరిగిన నష్టాన్ని వారికి వివరించారు. అంతకు ముందు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కె రామకృష్ణారావు, వికాస్ రాజ్, అడిషనల్ డీజీ మహేష్ భగవత్, ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్, పశుసంవర్ధక శాఖ ముఖ్యకార్యదర్శి సవ్యసాచి ఘోష్, హౌసింగ్ కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాష్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంత రావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2 పోస్టుల భర్తీ

1,284 పోస్టులకు ఎంహెచ్‌ఎస్‌ఆర్బీ నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యశాఖలో 1,284 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ మేరకు బుధవారం మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్‌ఎస్‌ఆర్బీ) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. పోస్టుల్లో ప్రజా వైద్య సంచాలకులు, వైద్యవిద్య సంచాలకులు, కుటుంబ సంక్షేమ సంచాలకుల విభాగాల్లో 1,088 ఉన్నాయి. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో 183, ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ అండ్ రీజినల్ క్యాన్సర్ సెంటర్‌లో 13 పోస్టులను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. ఈ పోస్టుల కోసం అర్హులైన వారు ఈ నెల 21 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అక్టోబర్ 5 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అక్టోబర్ 7వ తేదీ ఉదయం 10 గంటల నుంచి అక్టోబర్ 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అప్లికేషన్లను ఎడిట్ చేసుకునేందుకు అవకాశమిచ్చారు. పరీక్షను నవంబర్ 10న నిర్వహించనున్నారు. వంద పాయింట్ల ఆధారంగా ఎంపిక చేస్తారు. కాగా రాత పరీక్షకు 80 పాయింట్లను కేటాయించారు. మరో 20 పాయింట్లను రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో చేసిన కాలానికి సంబంధించి ఇవ్వనున్నారు.

ఆరోపణలపై నోరు విప్పరే

న్యూఢిల్లీ : సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పూరి బుచ్‌పై అనేక ఆరోపణలు వచ్చినా ఆమె స్పందిం చరేమని అమెరికన్ రీసెర్చ్ సంస్థ హిండెన్‌బర్గ్ ప్రశ్నిం చింది. స్టాక్ మార్కెట్‌లోని లిస్టింగ్ కంపెనీలకు సేవలను అందించే కన్సల్టెన్సీ కంపెనీ అగోరా ప్రయివేట్ లిమిటెడ్‌లో మాధబికి 99 శాతం వాటా ఉందని కాంగ్రెస్ వెల్లడించిన విషయం తెలిసిందే. అదే విధంగా ఐసిఐసిఐ బ్యాంక్ నుంచి ఇప్పటికీ ఆదాయాలు పొందడం, అదానీకి చెందిన విదేశీ ఫండ్ కంపెనీలతో అంటకాగడం తదితర తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న మాధబి ఇప్పటికీ ఒక్క ప్రకటన చేయలేదు. దీనిపై తాజాగా హిండెన్ బర్గ్ సోషల్ మీడియాలో ప్రశ్నించింది. సెబీ హోల్ టైం డైరెక్టర్‌గా ఉన్న సమయంలోనూ నిబంధనలకు విరుద్ధంగా మాధబి లిస్టెడ్ కంపెనీల నుంచి భారీగా ఆదాయాలు పొందారని గుర్తు చేసింది. సింగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న బుచ్ కంపెనీ వివరాలు వెల్లడి కావాల్సి ఉందని తెలిపింది. అనేక వర్ధమాన విషయాలు, ఆరోపణలపై మాధబి స్పందించాలని హిండెన్‌బర్గ్ డిమాండ్ చేసింది.

బునాదిగాని కాల్వ నిర్మాణంపై

నిర్లక్ష్యం వీడాలి

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా అడ్డగూడూరు మండలం ధర్మారం వరకు గోదావరి జలాలు అందించే అవకాశముందన్నారు. దీనికి ప్రభుత్వం వెంటనే డీపీఆర్ రూపొందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి రెండు నెలల సమయం ఇస్తున్నామని బునాదిగాని కాలువ పూర్తి చేసి గోదావరి జలాలు అందించేందుకు నిధులు, కార్యాచరణ రూపొందించాలని అన్నారు. లేనిపక్షంలో ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం అదనపు కలెక్టర్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ అధ్యక్షత వహించగా.. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, నాయకులు సిర్పంగి స్వామి, దయ్యాల నరసింహ, బొల్లు యాదగిరి, మాయ కృష్ణ, గడ్డం వెంకటేష్, రాచకొండ రాములమ్మ, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, పైళ్ల యాదిరెడ్డి, పీఎన్ఎమ్ జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు తదితరులు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో భద్రకాళి చెరువు

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో
100 ఎకరాలు కబ్జా

- భారీ వరదలతో ముంపులో వరంగల్ నగరం
- సహకరించిన ఉన్నతాధికారులు
- తెర వెనుక రాజకీయ నేతలు
- చూసీచూడనట్టున్న అధికారులు



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

గ్రేటర్ వరంగల్ నగరం ప్రతియేటా భారీ వరదలకు ముంపునకు గురవుతోంది. నగరం నడిబొడ్డులో ఉన్న భద్రకాళి చెరువు చుట్టూ కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ (కుడా) వరద గట్టును నిర్మించడంతో వరద ఆ చెరువులోకి వెళ్లడం లేదు. వరదగట్టు చుట్టూ ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదను వరంగల్ రామన్నపేట-పోతననగర్ రహదారి గుండా విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మత్తడి దిగువకు పంపించాల్సి ఉంది. ఇప్పటికీ ఈ కాలువ నిర్మాణాలను మున్సిపాల్టీ అధికారులు పూర్తి చేయలేకపోయారు. భద్రకాళి చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న ప్రయివేటు పట్టాదారుల ప్రయోజనాలను కాపాడే విధంగా ఉన్నతాధికారులే వరదగట్టును నిర్మించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వరద గట్టు పైనే పలువురు రాజకీయ నేతల అండదండలతో అక్రమ కట్టడాలు వెలిశాయి. భద్రకాళి చెరువు మొత్తం విస్తీర్ణం 390 ఎకరాలు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను కలుపుకుంటే 550 ఎకరాలు ఉంటుంది. కానీ ప్రస్తుతం అంత భూమి లేదు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లోని సుమారు 100 ఎకరాల మేరకు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు నిర్మించారు. వీటిపై అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలతో వరదలతో జనం అల్లాడుతున్నా వారికి చీమకుట్టినట్టయినా లేదు.

100 ఎకరాల కబ్జా.. వెలసిన అక్రమ నిర్మాణాలు

భద్రకాళి చెరువు 550 ఎకరాల విస్తీర్ణం నుంచి 390 ఎకరాలకు చెరువు కుదించుకుపోయింది. మరో 50-60 ఎకరాలను కబ్జా చేయడానికి భూబకాసురులు సిద్ధంగా ఉన్నట్టు తెలిసింది. రాజకీయ నేతలుండటంతోనే ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో దురాక్రమణలు యధేచ్ఛగా సాగుతున్నాయి. వరంగల్ కోట చెరువులో కబ్జాను అడ్డుకున్న ఇరిగేషన్ అధికారులను వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే బెదిరించారని గతంలో వార్తలు వచ్చాయి. హన్మకొండ ప్రాంతంలో ఒక మాజీ ఎంపీ.. నర్సింగ్ కాలేజీ, ఒక మాజీ ఎమ్మెల్యే కార్పొరేట్ విద్యాసంస్థ, అపార్ట్‌మెంట్లు, ఫంక్షన్‌హాళ్లను నిర్మించారు. ఇదిలావుంటే.. ఎఫ్‌టీఎల్ పరిధిలోనే పోతన జానపద గిరిజన విద్యాపీఠాన్ని ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం నిర్మించింది. దీన్ని చూసుకునే చాలా మంది రెచ్చిపోయారని తెలిసింది. ఇప్పుడు ఆక్రమణలను తొలస్తామని చెప్పగానే ప్రభుత్వానికి ఒక నిబంధన, మాకో నిబంధన అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

40 ఎకరాల కబ్జాకు తీవ్ర యత్నం

గత ప్రభుత్వంలో భద్రకాళి చెరువు హన్మకొండ పద్మాక్షి గుట్టవైపున సుమారు 40 ఎకరాలు కబ్జా చేయడానికి భారీ స్కెచ్ వేశారని సమాచారం. ఈ వ్యవహారం వెనుక నాడు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల హస్తముంది. చెరువులో మరో వరద కట్ట నిర్మించి, యధేచ్ఛగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లోని 40 ఎకరాల భూమిని కబ్జా చేయడానికి వ్యూహం రచించారు. ఉన్నతాధికారుల వైపు నుంచి కూడా తీవ్ర ఒత్తిడి వచ్చినట్టు సమాచారం. ఇప్పటికే వరద భారీగా వచ్చి నగరం ముంపునకు గురవుతుందని, ఇక్కడ వరద గట్టు నిర్మిస్తే పరిస్థితి చేయి దాటిపోతుందని జిల్లాస్థాయి అధికారులు వారించడంతో ఈ కబ్జా పర్వానికి బ్రేక్ పడింది.

నాడు తాగునీటికోసం.. నేడు కబ్జాల కోసం..

గతంలో భద్రకాళి చెరువు వరంగల్ నగరవాసులకు తాగునీటికి ప్రధాన వనరు. ఈ క్రమంలోనే 1990 నుంచి భద్రకాళి చెరువును గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తమ పరిధిలోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఎస్సారెస్పీ నీటిని కాకతీయ కాలువ ద్వారా భద్రకాళి చెరువుకు తరలించి అక్కడి నుంచి ఫిల్టర్‌పాయింట్లలో ఫిల్టర్ చేసి తాగునీటిని సరఫరా చేసేవారు. మంచినీటి చెరువుగా ఉన్న భద్రకాళిలో వరద, మురుగునీరు కలవకుండా మున్సిపల్ అధికారులు రెండు దశాబ్దాల క్రితం చెరువు చుట్టూ వరద గట్టు నిర్మించారు. దాంతో ఎగువ నుంచి వచ్చే బొందివాగు, అగర్తల కాలువ, 12 మోరీల నుంచి వచ్చే మురుగును చెరువులో కలవకుండా నిరోధించగలిగారు. ఈ వరద, మురుగునీరు దిగువకు పోయేలా చేయడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారు. దాంతో గత మూడు, నాలుగేండ్లుగా కురుస్తున్న భారీ వర్షాలకు, భద్రకాళి చెరువు ఎగువ ప్రాంతం నుంచి 40 చెరువుల నుంచి వచ్చే వరదకు బ్యాక్ వాటర్‌తో నగరం ముంపునకు గురవుతుంది. హంటర్‌రోడ్డు, ఉర్సుగుట్ట జంక్షన్, సంతోషిమాత గుడి ప్రాంతాలు వరదముంపునకు గురవుతున్నాయి.

భద్రకాళి చెరువును పరిరక్షించాలి

భద్రకాళి చెరువును పరిరక్షించాలి. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో రాజకీయ నేతలు, అధికారుల అండతోనే అక్రమ నిర్మాణాలు వెలిశాయి. వరంగల్‌లో 'వాడ్రా'ను ఏర్పాటు చేసి ఆక్రమణలు తొలగించి భద్రకాళి చెరువును పరిరక్షించి, నగరం ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి.



- పెరుమల్ల లక్ష్మణ్, అధ్యక్షులు, చెరువుల పరిరక్షణ కమిటీ

అసంపూర్తిగా పనులు

చెరువులోకి వరద రాకుండా, బొందివాగు వరద, అగర్తల నుంచి వచ్చే మురుగును ప్రత్యేకంగా రెండు చాంబర్లు నిర్మించి వరంగల్-పోతన్‌నగర్ రోడ్డుకు లోపలి వైపు నుంచి ప్రత్యేకంగా కాలువలను నిర్మిస్తున్నారు. ఈ పనులు రెండేండ్లుగా పెండింగ్‌లోనే ఉన్నాయి. వరద కాలువ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే పలుచోట్ల కాలువకు గండ్లు పడ్డాయి. ఈ కాలువలకు రామన్నపేట నుంచి వచ్చే 12 మోరీల మురుగు కూడా కలుస్తుంది. ఇదిలావుంటే 'కుడా' నిర్మిస్తున్న భద్రకాళి జియో బయో డైవర్సిటీ పార్క్ ప్రవేశం వద్ద ఎడమ వైపునకు వచ్చే మురుగు చెరువులోకి గాని, బొందివాగు ప్రవాహం వైపు గాని వెళ్లడానికి అవకాశం లేదు. దాంతో దిగువ ప్రాంతంలో ఉన్న అభయాంజనేయ కాలనీ, విశాల్ మార్ట్ వెనుక కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. దీనికి ప్రత్యామ్నాయం చూపడంలో మున్సిపల్ అధికారులు విఫలమవుతున్నారు. భద్రకాళి చెరువుకు వాస్తవంగా 2.1 కిలోమీటర్ల మేరకు కట్ట నిర్మాణం ఉంది. ఇందులో పద్మాక్షి గుండం వైపున చెరువు కట్ట అభివృద్ధికి 'కుడా' అధికారులు చేపట్టిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పలువురు ఈ ప్రాంతంలో మా పట్టా భూములున్నాయని కోర్టునాశ్రయించడంతో పనులు ఆగిపోయాయి. అంతేకాదు, వరద, మురుగు దిగువకు వెళ్లేలా చేయడంలో మున్సిపాల్టీ, 'కుడా', నీటిపారుదల శాఖల మధ్య సమన్వయం చేయడంలో ఉన్నతాధికారుల వైఫల్యముంది.



రాజ్ కుమార్ పాల్ హ్యాట్రిక్

ఆసియా హాకీ ఛాంపియన్స్ ట్రోఫీ సెమీస్‌లో భారత్



హాంగ్జౌ(చైనా): ఆసియా హాకీ ఛాంపియన్‌ట్రోఫీలో భారత్ వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసుకొని సెమీస్‌కు చేరింది. బుధవారం మలేషియాతో జరిగిన మ్యాచ్‌లో యువ స్ట్రయికర్ రాజ్‌కుమార్ పాల్ హ్యాట్రిక్ గోల్స్‌తో మెరిసాడు. దీంతో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ చైనా వేదికగా జరుగుతున్న హీరో ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. బుధవారం మలేషియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 8-1గోల్స్ తేడాతో ఘన విజయం సాధించి వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసింది. తొలి మ్యాచ్‌లో చైనాను 3-0 తేడాతో మట్టికరిపించిన భారత్.. రెండో మ్యాచ్‌లో జపాన్‌ను 5-1 తేడాతో చిత్తు చేసింది. తాజాగా మలేసియాపై ఘన విజయంతో సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది. ఆరు జట్ల మధ్య జరుగుతున్న ఛాంపియన్ ట్రోఫీలో టాప్-4లో నిలిచిన జట్లు సెమీస్‌కు చేరనున్నాయి. 16న సెమీస్, 17న ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

రాజ్ కుమార్ హ్యాట్రిక్

మలేసియాతో మ్యాచ్‌లో రాజ్ కుమార్ పాల్ హ్యాట్రిక్ గోల్స్ సాధించాడు. 3, 25, 33వ నిమిషాల్లో రాజ్ కుమార్ గోల్స్ చేశాడు. భారత్ తరఫున రాజ్ కుమార్‌తో పాటు అరైజీత్ సింగ్ హుండల్ 6, 39 నిమిషంలో, జుగ్‌రాజ్ సింగ్ 7వ నిమిషంలో, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ 22వ నిమిషంలో, ఉత్తమ్ సింగ్ 40వ నిమిషంలో గోల్స్ కొట్టారు. మలేసియా సాధించిన ఏకైక గోల్‌ను అకీముల్లా అనువర్ 34వ నిమిషంలో సాధించాడు. ఈ టోర్నీలో భారత్ తమ తదుపరి మ్యాచ్‌ల్లో కొరియా, పాకిస్తాన్‌లతో తలపడనుంది. కొరియాతో మ్యాచ్ సెప్టెంబర్ 12న.. పాక్‌తో మ్యాచ్ సెప్టెంబర్ 14న జరగనున్నాయి.

టాప్-5లో రోహిత్‌కు చోటు

ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) ప్రకటించిన టెస్ట్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ టాప్-5లో చోటు దక్కించుకున్నాడు. ఐసిసి బుధవారం వెల్లడించిన టెస్ట్ ర్యాంకింగ్స్ బ్యాటర్ల జాబితాలో రోహిత్ శర్మ 751 రేటింగ్ పాయింట్లతో 5వ స్థానానికి ఎగబాకాడు. దీంతో సెప్టెంబర్ 2021 తర్వాత తొలిసారి రోహిత్ టాప్-5లోకి చేరుకున్నాడు. విరాట్ కోహ్లీ, యశస్వి జైస్వాల్ కూడా తమ తమ ర్యాంకులను మెరుగుపరుచుకున్నారు. జైస్వాల్ 740పాయింట్లతో 6వ స్థానంలో, విరాట్ కోహ్లీ 737పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచారు. తాజా ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్‌లో శ్రీలంక బ్యాటర్లు మెరుగైన ర్యాంకులకు చేరారు. ఇంగ్లండ్‌తో జరిగిన మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో శ్రీలంక జట్టు చివరి టెస్ట్‌లో ఘన విజయం సాధించింది.

ఇంగ్లండ్ ఆటగాడు జో రూట్ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అయితే, శ్రీలంకతో జరిగిన మూడో, చివరి టెస్ట్‌లో రెండుసార్లు విఫలం కావడంతో రేటింగ్ తగ్గింది. రూట్ 922 పాయింట్ల నుంచి 899 పాయింట్లకు పడిపోయినా అగ్రస్థానంలోనే ఉన్నాడు. ఇక న్యూజిలాండ్ ఆటగాళ్ల కేన్ విలియమ్సన్(859), డారిల్ మిచేల్(768) పాయింట్లతో రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. స్టీవ్ స్మిత్(ఆస్ట్రేలియా) 757పాయింట్లతో 4వ స్థానంలో నిలువగా.. ఐదో స్థానంలో రోహిత్ ఉన్నాడు. టాప్ 10లో పాకిస్తాన్ వికెట్ కీపర్, బ్యాట్స్‌మన్ మహ్మద్ రిజ్వాన్(720) తొమ్మిదో స్థానంలో నిలిచాడు.

ఆలిండియా బుచ్చిబాబు టోర్నీలో హైదరాబాద్ ఘన విజయం

- ఏడేండ్ల తర్వాత ఈ ట్రోఫీ సాధించిన తెలంగాణ జట్టు : ప్లేయర్లను అభినందించిన హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు
- టీమ్‌ను ఘనంగా సత్కరించేందుకు ఏర్పాట్లు



హైదరాబాద్: ఆలిండియా బుచ్చిబాబు ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్ లో హైదరాబాద్ జట్టు ఏడేళ్ల తర్వాత తొలిసారిగా ట్రోఫీ సాధించింది. బుధవారం తమిళనాడులోని దిండిగల్‌లో చత్తీశ్‌గఢ్‌తో ముగిసిన ఫైనల్లో హైదరాబాద్ జట్టు 243 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. సుదీర్ఘ విరామం తర్వాత హైదరాబాద్ జట్టు ఈ ట్రోఫీను సాధించడంపై హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, కార్యదర్శి దేవ్‌రాజ్ హర్షం వ్యక్తం చేశారు. టోర్నీ ఆసాంతం అద్భుతంగా ఆడి రాష్ట్రానికి ట్రోఫీ అందించినందుకు జట్టు మొత్తాన్ని అభినందించారు. ఫైనల్లో చెలరేగి, హైదరాబాద్ గెలుపులో కీలకపాత్ర పోషించిన సెంచరీ హీరో రోహిత్ రాయుడు (155 తొలి ఇన్నింగ్స్), హాఫ్ సెంచరీలతో అలరించిన అభిరథ్ రెడ్డి, కెప్టెన్ రాహుల్ సింగ్, బౌలింగ్‌లో చెలరేగిన తనయ్ త్యాగరాజ్, అనికేత్ రెడ్డిని ప్రత్యేకంగా ప్రశంసించారు. హైదరాబాద్ చేరుకున్నాక జట్టు సభ్యులను ఘనంగా సత్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని జగన్‌మోహన్ రావు తెలిపారు.

మొరాకో మగువా..



గోపీచంద్, కావ్యాథాపర్

గోపీచంద్, దర్శకుడు శ్రీను వైట్ల తొలి కలయికలో వస్తున్న చిత్రం 'విశ్వం'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్లపై టీజీ విశ్వప్రసాద్, వేణు దోనేపూడి నిర్మిస్తున్నారు. దోనేపూడి చక్రపాణి సమర్పిస్తున్నారు.

ఈ చిత్రంలోని 'మొరాకో మగువా' పాటతో మేకర్స్ మ్యూజికల్ జర్నీని స్టార్ట్ చేశారు. చేతన్ భరద్వాజ్ స్కోర్ చేసిన ఈ డైనమిక్ సాంగ్‌కు పృథ్వీ చంద్ర, సాహితీ చాగంటి ఎనర్జిటిక్ వోకల్స్ అందించారు. లైవ్లీ టెంపో, షిఫ్టింగ్ రిథమ్స్‌తో సాంగ్ అదిరిపోయింది. రాకేందు మౌళి లిరిక్స్ తెలుగు, ఇంగ్లీష్‌ని అద్భుతంగా బ్లెండ్ చేసింది. పాటలో గోపీచంద్, కావ్య థాపర్ రొమాంటిక్ కెమిస్ట్రీ, డ్యాన్స్ పెర్ఫార్మెన్స్‌తో కట్టిపడేశారు. ఎక్సోటిక్ లొకేషన్స్‌లో చిత్రీకరించిన విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. దీంతో ఈ సాంగ్ మ్యూజిక్ ప్రమోషన్స్‌కు చార్ట్ బస్టర్ స్టార్ట్ ఇచ్చింది. టీజర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ రావడంతో ఈ సినిమాపై భారీ బజ్ ఏర్పడింది. దసరా కానుకగా అక్టోబర్ 11న సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది అని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి క్రియేటివ్ ప్రొడ్యూసర్: కృతి ప్రసాద్, సహ నిర్మాత: వివేక్ కూచిబొట్ల, డీవోపీ: గుహన్, సంగీతం: చైతన్ భరద్వాజ్, ఎడిటర్: అమర్ రెడ్డి కుడుముల, ఆర్ట్ డైరెక్టర్: కిరణ్ కుమార్ మన్నె.

దియాగా సంయుక్త



సంయుక్త

హీరో శర్వానంద్ నటిస్తున్న తన 37వ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. 'సామజవరగమన'తో బ్లాక్‌బస్టర్ అందించిన రామ్ అబ్బరాజు దర్శకత్వంలో అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హిలేరియస్ రైడ్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో శర్వానంద్‌కు జోడిగా సాక్షి వైద్య, సంయుక్త హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. సంయుక్త పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ, పోస్టర్ ద్వారా ఆమె పాత్రను దియాగా పరిచయం చేశారు మేకర్స్. సంయుక్త సంప్రదాయ శాస్త్రీయ నృత్యం చేస్తూ కనిపించిన ఫస్ట్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంది. ఈ చిత్రానికి సంగీతం : విశాల్ చంద్ర శేఖర్, సినిమాటోగ్రఫీ : జ్ఞాన శేఖర్, కథ : భాను బోగవరపు, డైలాగ్స్ : నందు సావిరిగాన, ఆర్ట్ : బ్రహ్మ కడలి.

నవచిత్రం

మనసిలాయో..సందడి షురూ



రజనీకాంత్, మంజు వారియర్

'మెరుపై వచ్చిండే.. మడత పెట్ట వచ్చిండే.. అంటూ పక్కా మాస్ బీట్‌తో అమ్మాయి పాడే పాట వింటుంటే అందరూ స్టెప్పులేయాలనిపిస్తోంది. ఇంతకీ అంతలా అందరినీ మడత పెట్టేలా వచ్చిందెవరో తెలుసుకోవాలంటే 'వేట్టైయాన్ - ది హంటర్' సినిమా చూసేయాల్సిందేనంటున్నారు మేకర్స్. రజనీకాంత్ హీరోగా లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న భారీ బడ్జెట్ చిత్రమిది. అక్టోబర్ 10న భారీ స్థాయిలో విడుదల చేస్తున్నారు. టి.జె.జ్ఞానవేల్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు.

అనిరుధ్ రవిచందర్ నాలుగోసారి రజనీకాంత్ సినిమాకు మ్యూజిక్ అందిస్తున్నారు. 'మనసిలాయో..' అంటూ సాగే ఈ పాట ఎనర్జిటిక్ బీట్‌తో సాగుతుంది. రజనీకాంత్, మంజు వారియర్ మధ్య వచ్చే పాట ఇది. అలాగే ఇందులో మ్యూజిక్ డైరెక్టర్ అనిరుద్ సైతం స్టెప్పులేస్తూ కనిపించటం విశేషం. శ్రీనివాస మౌళి రాసిన ఈ పాటను నకష్ అజీజ్, అరుణ్ కౌండిన్య, దీప్తి సురేష్ పాడారు. ఆసక్తికరమైన మరో విషయమేమంటే ఈ పాట తమిళ వెర్షన్ కోసం లెజెండ్రీ ప్లే బ్యాక్ సింగర్ మలేషియా వాసుదేవన్ వాయిస్‌ను ఏఐలో క్రియేట్ చేసి ఇందులో ఉపయోగించటం విశేషం.

ఉత్సవంలా ఉంటుంది



దిలీప్ ప్రకాష్, రెజీనా కసాండ్రా లీడ్ రోల్స్‌లో అర్జున్ సాయి రచన, దర్శకత్వం వహించిన చిత్రం 'ఉత్సవం'. హార్న్‌బిల్ పిక్చర్స్‌పై సురేష్ పాటిల్ నిర్మిస్తున్నారు.

మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ సినిమా ఏపీ, తెలంగాణలో ఈనెల 13న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. డైరెక్టర్ అనిల్ రావిపూడి ముఖ్య అతిథిగా హాజరైన ఈ ప్రీరిలీజ్ ఈవెంట్ చాలా గ్రాండ్‌గా జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'ఈ సినిమా కాన్సెప్ట్ చెప్పినపుడే నాకు బాగా నచ్చింది. నాటకరంగం, రంగస్థలం బ్యాక్‌డ్రాప్‌లో డైరెక్టర్ అర్జున్ సాయి చాలా బ్యూటీఫుల్‌గా స్క్రిప్ట్ చేశారు. నాటకం గురించి ఈ జనరేషన్‌కి తక్కువ తెలుసుంటుంది. నాటకం నుంచి చాలా గొప్ప నటులు సినిమా రంగాన్ని ఏలారు. నాటకం అమ్మలాంటిది. సినిమా ఆ అమ్మ నుంచి జన్మ తీసుకున్న బిడ్డలాంటిది. ఈ సోషల్ మీడియా జనరేషన్‌లో నాటకాలు ఇంకా ఉన్నాయా అనే అనుమానం రావచ్చు. నాటక ప్రదర్శనలు ఇంకా జరుగుతున్నాయి. నాటకరంగం నుంచి ఇప్పటికీ చాలా మంది నటులు సినిమాలకి వస్తున్నారు. నా సినిమాల్లో కూడా చాలా మందికి వేషాలు ఇచ్చాను. అలాంటి నాటకరంగాన్ని నేపథ్యంగా ఎంచుకొని ఈ సినిమాని చాలా కష్టపడి చేశారు. మీ కష్టానికి తగిన ఫలితం రావాలి. అనూప్ మ్యూజిక్ అంటే నాకు ఇష్టం. బ్రహ్మానందం గ్లింప్స్ చూసి షాక్ అయ్యాను. ఉత్సవం పోస్టర్ చూస్తుంటే చాలా హ్యాపీగా ఉంది. ఉత్సవం మంచి విజయోత్సవం జరుపుకోవాలని కోరుంటున్నాను' అని అన్నారు.

'ఇది చాలా మంచి సినిమా.సినిమా చూసినప్పుడు ఉత్సవంలా ఉంటుంది. తప్పకుండా సినిమా చూడండి. మీ అందరికీ నచ్చుతుంది' అని నిర్మాత సురేష్ పాటిల్ చెప్పారు. డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ,'సినిమా చూశాను. చాలా ఫీల్‌గుడ్ ఫిలిం. ఈ మధ్యకాలంలో రంగమార్తాండ సినిమా చేశాం. అందులో వుండే ఫీల్ కి ఇది నెక్స్ట్ వెర్షన్. లవ్ సీన్స్ కూడా చాలా బాగా వచ్చాయి. ఫ్యామిలీ అంతా థియేటర్స్‌లో చూడాల్సిన సినిమా ఇది' అని తెలిపారు.

400 ఏళ్ళ గుడి నేపథ్యంలో..



సంయుక్త

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నూతన దర్శకుడు లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో మూన్‌షైన్ పిక్చర్స్‌పై మహేష్ చందు ఓ చిత్రాన్ని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. శివన్ రామకృష్ణ సమర్పిస్తున్నారు. 400 ఏళ్ల నాటి గుడి నేపథ్యంలో ఓ కల్ట్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో సంయుక్త ఫీమేల్ లీడ్‌లో నటిస్తున్నారు.

బుధవారం ఆమె బర్త్‌డే సందర్భంగా మేకర్స్ సంయుక్త పాత్రను సమీరాగా పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. మోడరన్ అమ్మాయిగా ఉన్న సంయుక్త పోస్టర్ అందర్నీ అలరిస్తోంది. ఈ సినిమా బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌ను మునుపెన్నడూ చూడని రీతిలో ప్రెజెంట్ చేస్తోంది. ఈ చిత్రానికి డీవోపీ: శివేంద్ర, సంగీతం: లియోన్ జేమ్స్, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్ ఆర్, ఆర్ట్: శ్రీనాగేంద్ర తంగాల.

శక్తివంతమైన మహిళ పాత్ర..



అభిరామి

హీరో రాజ్ తరుణ్ నటించిన న్యూ ఏజ్ ఎంటర్‌టైనర్ 'భలే ఉన్నాడే'. రవికిరణ్ ఆర్ట్స్ బ్యానర్‌పై ఎన్‌వి కిరణ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రానికి జె. శివసాయి వర్ధన్ డైరెక్టర్. దర్శకుడు మారుతి ప్రజెంట్ చేస్తున్నారు. మనీషా కంద్కూర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సీనియర్ హీరోయిన్ అభిరామి కీలక పాత్ర పోషించారు. ఈనెల 13న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా అభిరామి మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- మహారాజ, సరిపోదా శనివారం లాంటి సూపర్ హిట్స్ తర్వాత ఈ సినిమాతో మరోమారు ప్రేక్షకుల ముందుకు రావడం ఆనందంగా ఉంది. దర్శకుడు మారుతి కాల్ చేసి ఈ సినిమాలోని నా క్యారెక్టర్ గురించి చెప్పారు. నాకు చాలా నచ్చింది. వెంటనే చేయాలని డిసైడ్ అయ్యాను.
- ఇందులో నా క్యారెక్టర్ పేరు గౌరీ. బ్యాంక్ ఎంప్లాయ్. నిజ జీవితంలో మా అమ్మ, నాన్న కూడా బ్యాంకు ఉద్యోగులే కావడంతో ఈ క్యారెక్టర్ నాకు పర్సనల్‌గా కనెక్ట్ అయ్యింది. సింగిల్ మదర్, స్ట్రాంగ్ ప్రిన్సిపుల్స్ ఉన్న మహిళ క్యారెక్టర్ నాది. మదర్‌తో పాటు ఒక సిస్టర్‌లా కనిపించేలా నా క్యారెక్టర్‌ని డైరెక్టర్ తీర్చిదిద్దారు. సినిమా ఆద్యంతం నా క్యారెక్టర్ ఉంటుంది. తల్లీ కొడుకుల బంధం సినిమాకి సోల్‌గా ఉంటుంది. ఈ సినిమాకి నా క్యారెక్టర్ ఎమోషనల్ యాంకర్‌లా ఉంటుంది. అలాగే ఈ సినిమాలో సింగీతం శ్రీనివాసరావు, లీలా పాత్రల మధ్య నడిచే కథ కూడా అందంగా ఉంటూ అందర్నీ కచ్చితంగా అలరిస్తుంది.

కొత్త కాన్సెప్ట్‌తో కళింగ



ధృవ వాయు, ప్రగ్యా నయన్

'కిరోసిన్' సినిమాతో మంచి పేరు తెచ్చుకున్న ధృవ వాయు ఇప్పుడు 'కళింగ'తో హీరో, దర్శకుడిగా ప్రేక్షకుల ముందుకు రాబో తున్నారు. బిగ్ హిట్ ప్రొడక్షన్స్ పతాకంపై దీప్తి కొండవీటి, పృథ్వీ యాదవ్ నిర్మించిన ఈ సినిమా ఈనెల 13న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నేత, ఎంపీ రఘు నందన్ రావు ముఖ్య అతిథిగా విచ్చేశారు.

ఈ సందర్భంగా ధృవ వాయు మాట్లాడుతూ, 'నేను రాసిన కథకు, యాకూబ్ మంచి డైలాగ్స్ ఇచ్చారు. కెమెరామెన్ అక్షయ్ పగలూ రాత్రి తేడా లేకుండా నాతో పాటు పని చేశారు. ఎడిటర్ నరేష్ సినిమాను అద్భుతంగా మలిచాడు. విజువల్స్ బాగా వచ్చాయి. వాటికి తగ్గ ఆర్ఆర్‌తో విశ్వ శేఖర సినిమాని మరో స్థాయికి తీసుకెళ్ళారు. ఈ మూవీ టీజర్, ట్రైలర్ చూసిన చాలా మంది కాంతారనా, విరూపాక్షనా?, మంగళవారంలా ఉంటుందా? అని అడుగుతున్నారు. కానీ ఇదొక కొత్త కాన్సెప్ట్. చాలా కొత్త ఎక్స్‌పీరియెన్స్ వస్తుంది' అని అన్నారు.

'సినిమా అద్భుతంగా వచ్చింది. పాటలు, మ్యూజిక్ గురించి అంతా మాట్లాడుకుంటారు. ఆర్ఆర్ మ్యాజిక్‌ను థియేటర్లో చూడాల్సిందే' అని నిర్మాతలు దీప్తి కొండవీటి, పృథ్వీ యాదవ్ తెలిపారు. నాయిక ప్రగ్యా నయన్ మాట్లాడుతూ,'మా టీజర్, ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. అందరూ ఫోన్ చేసి ప్రశంసించారు. సినిమా చూశాక కూడా అలాంటి కాల్స్ వస్తాయి. నా పాత్రకు మంచి రెస్పాన్స్ వస్తుంది' అని చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

నథింగ్ సర్వీస్ సెంటర్ నెట్‌వర్క్ విస్తరణ

న్యూఢిల్లీ : లండన్‌కు చెందిన స్మార్ట్‌ఫోన్ల తయారీ బ్రాండ్ నథింగ్ భారత్‌లో తన సర్వీసు సెంటర్ నెట్‌వర్క్‌ను విస్తరించినట్టు ప్రకటించింది. తమ పెరుగుతున్న వినియోగదారుల సంఖ్యకు అనుగుణంగా ప్రస్తుత పండుగ సీజన్‌కు ముందు సర్వీసు సేవలను కూడా పెంచాలని యోచించామని పేర్కొంది. ఈ క్రమంలోనే అక్టోబర్‌లో హైదరాబాద్, చెన్నయ్‌లలో రెండు కొత్త సెంటర్లను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపింది. అదనంగా ఐదు మల్టీబ్రాండ్ సేవా కేంద్రాల్లోనూ తమ సర్వీసులను పొందవచ్చని పేర్కొంది. త్వరలోనే మరిన్ని రాబోతున్నాయని నథింగ్ ఇండియా మార్కెటింగ్ హెడ్ ప్రణయ్ రాయ్ తెలిపారు.

పెంపుడు జంతువుల ఫుడ్ కేటగిరిలోకి గ్రోవెల్ గ్రూపు

- కార్నివెల్ బ్రాండ్‌తో ప్రవేశం
- ఎనిమిది శాతం మార్కెట్ వాటాపై దృష్టి

హైదరాబాద్ : ఆక్వాకల్చర్ ఫీడ్, సీఫుడ్ ప్రాసెసింగ్‌లోని గ్రోవెల్ గ్రూపు కొత్తగా కార్నివల్ బ్రాండ్ పేరుతో పెంపుడు జంతువుల అహారోత్పత్తుల రంగంలోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. బుధవారం హైదరాబాద్‌లో గ్రోవెల్ ప్రమోటర్ ఎంఎస్ఆర్ కార్తీక్, గ్రోవెల్ పెట్ న్యూట్రిషన్ బిజినెస్ హెడ్ జెఎస్ రామకృష్ణ మీడియాతో మాట్లాడారు. తమ సంస్థ సహజమైన, సూపర్‌ఫుడ్ పదార్థాలతో కూడిన ప్రీమియం పెంపుడు జంతువుల ఆహారాన్ని అందిస్తుందన్నారు. "కార్నివెల్"ను ప్రారంభించడంతో వేగంగా అభివృద్ధి చెందుతున్న పెంపుడు జంతువుల ఆహార రంగంలో వ్యూహాత్మకంగా విస్తరించనున్నామన్నారు. ప్రస్తుతం భారత్‌లో ఈ మార్కెట్ విలువ రూ.3,500 కోట్లుగా ఉందని.. 2028 కల్లా రూ.8,300 కోట్లకు చేరొచ్చని అంచనా వేశారు. కాగా 2030 నాటికి కనీసం 8 శాతం మార్కెట్ వాటాను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామ న్నారు. తమ తొలి ప్లాంట్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని సింగరాయకొండలో ఏర్పాటు చేశామన్నారు. పెంపుడు జంతువులకు తాము ప్రత్యేకంగా శాఖహార ఉత్పత్తులను కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు.

సెల్లెకార్ గాడ్జెట్స్, పిజి ఎలక్ట్రోప్లాస్ట్‌తో జట్టు

హైదరాబాద్ : గృహోపకరణాల రంగంలోని సెల్లెకార్ గాడ్జెట్స్ లిమిటెడ్ తాజాగా పిజి ఎలక్ట్రోప్లాస్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. ఈ ఒప్పందం ద్వారా కొత్తగా ఎయిర్ కండీషనర్లు, కూలర్ల తయారీ భాగస్వామిగా వ్యవహరించనుందని సెల్లెకార్ గాడ్జెట్స్ తెలిపింది. దీంతో తమ ఉత్పత్తి పోర్ట్‌ఫోలియోలో విశేష విస్తరణకు దారితీయనుందని ఆశాభావం వ్యక్తం చేసింది.ఇరు సంస్థలు భారతీయ మార్కెట్ అవసరాలను అందించే నాణ్యతాయుత, శక్తి సామర్థ్యం గల ఉత్పత్తులను అందించడానికి నిబద్ధతను కలిగి ఉన్నాయని తెలిపాయి.

సామ్‌సంగ్‌లో 200 మందిపై వేటు..!

న్యూఢిల్లీ : దిగ్గజ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ ఇండియా తన 200 మంది ఉద్యోగులను ఇంటికి పంపించే పనిలో ఉంది. దేశంలో ఆ కంపెనీ వ్యాపారం మందగించడంతో కార్యాలయాల్లో ఎగ్జిక్యూటివ్‌లుగా పని చేస్తున్న పలువురిపై వేటు వేయాలని నిర్ణయించుకుందని సమాచారం. ఆ సంస్థలో మొత్తంగా 2000 పైగా ఎగ్జిక్యూటివ్‌లు పని చేస్తున్నారు. ఇందులో 10 శాతం మందికి ఉద్వాసన పలకనుంది. ఇటీవల ఆ సంస్థ అమ్మకాల్లో పతనం చోటు చేసుకోవడంతో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు సమాచారం.

15 వరకు అమెజాన్ వార్షికోత్సవ సేల్

బెంగళూరు : తమ 7వ వార్షిక సేల్‌ను ప్రారంభించామని అమెజాన్ బిజినెస్ తెలిపింది. సెప్టెంబర్ 15 వరకు కొనసాగుతుందని పేర్కొంది. ఈ సేల్‌లో వినియోగదారులు 70 శాతం వరకు డిస్కౌంట్ పొందవచ్చని తెలిపింది. 30 రోజుల వడ్డీరహితమైన క్రెడిట్ ఆప్షన్‌తో పాటు రూ.9999 క్యాష్‌బాక్‌ను అందిస్తున్నట్లు పేర్కొంది. స్మార్ట్ వాచీలు, హోమ్, కిచెన్ ఉపకరణాలు, ల్యాప్ టాప్స్, ఆఫీస్ ఫర్నిచర్, సెక్యూరిటి కెమేరాలు, స్మార్ట్ టివిలు తదితర ఉత్పత్తులపై రాయితీలు లభిస్తాయని అమెజాన్ బిజినెస్ డైరెక్టర్ సుచిత్ సుభాస్ తెలిపారు.

కార్బన్‌ను తగ్గించడమే లక్ష్యం

- ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్‌లో నిపుణులు

హైదరాబాద్ : కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) ఆధ్వర్యంలో ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్ 23వ ఎడిషన్ ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని హెచ్ఐసిసిలో సెప్టెంబర్ 11, 12 తేదీలలో ఈ సదస్సు జరుగుతోంది. ఈ సంవత్సరం "శక్తి సామర్థ్యం ద్వారా తక్కువ కార్బన్ ఆర్థిక వ్యవస్థకు మార్పును వేగవంతం చేయడం" అనే థీమ్‌ను ఎంచుకుంది. బుధవారం జరిగిన సమావేశంలో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బిఇఇ) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. జాతీయ ఇంధన సామర్థ్య విధానాలు, కార్యక్రమాలపై తన అభిప్రాయాలను తెలిపారు. సుస్థిర ఇంధన విధానాలను నడపడంలో పరిశ్రమలు కీలక పాత్ర పోశిస్తాయన్నారు. కర్బన ఉద్గార లక్ష్యాలను సాధించడంలో శక్తి సామర్థ్యాలు కీలక పాత్ర పోశిస్తాయన్నారు. ఈ సమ్మిట్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు, ప్రధాన సంస్థల నుండి 2000 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు.

అవివా నుంచి సిగ్నేచర్ ఇన్‌క్రీజింగ్ ఇన్‌కం ప్లాన్

న్యూఢిల్లీ : ప్రయివేటు రంగంలోని అవివా లైఫ్ ఇన్సూరెన్స్ కొత్తగా అవివా సిగ్నేచర్ ఇన్‌క్రీజింగ్ ఇన్‌కం ప్లాన్‌ను ఆవిష్కరించినట్లు వెల్లడించింది. ఇది నాన్-లింక్డ్, నాన్-పార్టిసిపేటింగ్, జీవిత బీమా సేవింగ్స్ ప్లాన్ అని ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. పదవీ విరమణ తర్వాత భద్రతను మెరుగుపర్చడానికి ఇది దోహదం చేస్తుందని తెలిపింది. ప్రతి 3వ సంవత్సరంలో ఆదాయంలో 15 శాతం పెంపుదలను అందిస్తోందని వెల్లడించింది. 100 ఏళ్ల వరకు సమగ్రమైన ఆర్థిక భద్రతను అందిస్తుందని ఆ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వినీత్ కపాహి తెలిపారు.

ఐఎంబీ పిటిషన్లు కొట్టేసిన హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని విలువైన భూములను క్రీడల అభివృద్ధి పేరుతో ఐఎంబీ భారత్ అనే సంస్థకు 2004లో నాటి సీఎం చంద్రబాబు ఇవ్వడాన్ని సవాలు చేసిన పిటిషన్లను శుక్రవారం హైకోర్టు కొట్టేసింది.. చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావులతో కూడిన డివిజన్ బెంచ్ పూర్వపు సంపాదకులు ఏబీకే ప్రసాద్, వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, లాయర్ శ్రీరంగారావు పన్నెండేండ్ల క్రితం వేసిన పిటిషన్లను డిస్మిస్ చేసింది. ఇదే తరహాలో వైఎస్ విజయమ్మ, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి వేసిన పిటిషన్ల గురించి చెప్పకుండా వేయడాన్ని తప్పుపట్టింది. విజయమ్మ పిటిషన్‌ను సుప్రీం కోర్టు సైతం కొట్టేసిందనీ, ఈ నేపథ్యంలో అదే వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశాలు జారీకి తగిన కారణాలు లేవని స్పష్టం చేసింది.

పబ్లిక్ గార్డెన్లో నిర్మాణం చేయం

నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్లో నిర్మాణాలు చేయబోమనీ, గ్రీనరీ కోసమే వినియోగిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. పబ్లిక్ గార్డెన్‌ను ఇతర అవసరాలకు వాడకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ చైర్మెన్ సయ్యద్ మునీర్ అహ్మద్ వేసిన పిటిషన్‌పై విచారణ అవసరం లేదని చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ జె శ్రీనివాసరావులతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. 40 ఎకరాల పబ్లిక్ గార్డన్‌లో తెలుగు వర్సిటీ, లలిత కళాతోరణం కట్టారనీ, ఇప్పుడు ప్రోటోకాల్ ఆఫీస్‌కు అర ఎకరం భూమి కేటాయించారని పిటిషనర్ చెప్పారు. ప్రోటోకాల్ ఆఫీసుకు 859 చదరపు గజాలే వినియోగిస్తామనీ, మిగిలిన భూమిని గార్డెన్ పచ్చదనం కోసమే వాడతామని ప్రభుత్వం చెప్పింది.

జంతు సంరక్షణపై పిటిషన్ మూసివేత

జంతు హింస నిరోధానికిగాను కేంద్ర జంతు సంరక్షణ మండలి ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగా నోడల్ ఆఫీసర్‌ను నియమించినట్టు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు చెప్పింది. నోడల్ అధికారిని నియమించలేదంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ అవసరం లేదని జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ప్రకటించారు.

విలీనం వద్దు.. పంచాయతీలే ముద్దు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 29 గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనం



- పలు గ్రామాల్లో ఆందోళనలు, ర్యాలీలు
- దొంగచాటున తీర్మానాలు చేశారని ఆరోపణ

నగర శివారు ప్రాంతాల్లోని గ్రామాలను మున్సిపాలిటీల్లో కలుపుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆర్డీనెన్స్ జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం నిర్ణయం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తమ గ్రామాలను మున్సిపాలిటీల్లో కలుపొద్దని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన బాట పట్టారు. దొంగచాటున తీర్మానాలు చేసి తమ గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. మున్సిపాలిటీల్లో చేరికతో తమపై పన్నుల భారం పెరుగుతుందని, ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూలి చేసుకుని బతికే తమపై అభివృద్ధి పేరుతో పొట్టగొట్టొద్దని కోరుతున్నారు. తమ గ్రామాలను పంచాయతీలుగానే కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు.

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

హైదరాబాద్ శివారు ప్రాంతంలోని 51 గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 8 మున్సిపాలిటీల్లో 29 గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ గెజిట్‌లో పొందుపరిచింది. ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల ఉన్న గ్రామాలను సైతం మున్సిపాలిటీల్లో కలిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతా నికి దగ్గరలో ఉన్న గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ.. ఓఆర్ఆర్ పరిధిలోని 51 గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని పలు గ్రామాలు ఈ విలీన జాబితాలో ఉన్నాయి.

రంగారెడ్డి జిల్లాలోని బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్, తారామతిపేట పంచాయతీలు పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో విలీనం చేయనుంది. బహదూర్‌గూడ, పెద్దగోల్కొండ, చిన్నగోల్కొండ, హమీదుల్లానగర్, రషీద్ గూడ, ఘన్సిమియాగూడను శంషాబాద్ మున్సిపాలిటీలో, నార్సింగి మున్సిపాలిటీలో.. మీర్జాగూడ గ్రామపంచాయతీ, తుక్కుగూడ మున్సిపాలిటీలో.. హర్షగూడ గ్రామపంచాయతీలు విలీనం కానున్నాయి. మేడ్చల్ మున్సిపాలిటీలో పూడూరు, రాయిలాపూర్ గ్రామపంచాయతీలు, దమ్మాయిగూడ మున్సిపాలిటీలో కీసర, యాద్గిరిపల్లి, అంకిరెడ్డిపల్లి, చీర్యాల, నర్సపల్లి, తిమ్మాయిపల్లిని కలపనున్నారు. నాగారం మున్సిపాలిటీలో.. బోగారం, గోదాముకుంట, కరీంగూడ, రాంపల్లి దాయార, పోచారం మున్సిపాలిటీలో వెంకటాపూర్, ప్రతాపసింగారం, కొర్రెముల, కాచివాని సింగారం, చౌదరిగూడ, ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో అంకుషాపూర్, ఔషాపూర్, మాదారం, ఏదులాబాద్, ఘనాపూర్, మర్పల్లిగూడ విలీనం కానున్నాయి. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మునీరాబాద్, గౌడవెల్లి పంచాయతీలు, తూంకుంట మున్సిపాలిటీలో బొంరాసిపేట, శామీర్‌పేట, బాబాగూడ పంచాయతీలు విలీనం కానున్నాయి.

ప్రభుత్వ నిర్ణయంపై వ్యతిరేకత

విలీనం పట్ల శంషాబాద్, శంకర్‌పల్లి మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. శంషాబాద్ మండలంలోని ఘన్సిమియాగూడ గ్రామస్తులు ఆందోళన బాట పట్టారు. ఇటీవల జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. తమకు తెలియకుండానే పంచాయతీ కార్యదర్శి దొంగచాటున విలీనంపై గ్రామ పంచాయతీ తీర్మానం చేశారని అన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే ఈ ఆందోళనల్లో కాంగ్రెస్ నాయకులు క్రియాశీలకంగా పనిచేయడం కొసమెరుపు. అలాగే శంకర్‌పల్లి మండలంలోని మిర్జాగూడ గ్రామస్తులు సైతం ఇదే విధంగా ఆందోళనలు చేపట్టారు

ఉపాధి కోల్పోవడంతో పాటు పన్నుల భారమూ..

గ్రామీణ ప్రాంత ప్రజలందరూ పేదలే. వీరు గ్రామీణ ఉపాధి హామీ పనులతోపాటు కూలి చేసుకుని బతుకుతుంటారు. ఈ గ్రామాలు మున్సిపాలిటీలో కలిస్తే ఉపాధి హామీ పనులు ఉండవు. దాంతో ప్రజలు ఉపాధిని కోల్పోయే ప్రమాదం ఉంది. పైగా పన్నుల భారమూ మీద పడుతుంది. గ్రామ పంచాయతీకి మున్సిపాలిటీకి పన్నులు చెల్లించడంలో చాలా తేడా ఉంటుంది. పంచాయతీ కంటే మున్సిపాలిటీల్లో రెట్టింపు స్థాయిలో పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిర్ణయంతో తమపై మరింత పన్నుల భారం పెరుగుతుందని విలీన గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి పన్ను, నల్లా పన్ను, కరెంట్ బిల్లులతోపాటు ఇతర పన్నులు సైతం తమపై పడతాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి మాటున తమపై పన్నుల భారం మోపొద్దని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయంపై పునరాలోచన చేయాలని విలీన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆసియా-పసిఫిక్ మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ చైర్మెన్‌గా రామ్మోహన్ నాయుడు

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న 40 సభ్య దేశాల ప్రతినిధులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీలో జరుగనున్న రెండో ఆసియా-పసిఫిక్ మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ లో సభ్య దేశాల చైర్మెన్ ఎన్నిక బుధవారం నిర్వహించారు. ఇందులో ఏపీఎంసీ చైర్మెన్‌గా కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును సింగపూర్ దేశం ప్రతిపాదించగా భూటాన్ దేశం మద్దతుతో ఆయా దేశాల ప్రతినిధులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశం తరపున దక్కిన ఈ గౌరవాన్ని బాధ్యతగా స్వీకరిస్తానని తెలిపారు. విమానయాన రంగాన్ని ప్రజలకు మరింతగా అందుబాటులో తీసుకురావడంతో పాటు సభ్య దేశాల మధ్య రవాణాను సులభతరం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు. ఆకాశ మార్గాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సభ్య దేశాలన్నీ ఉమ్మడిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

ఢిల్లీ లిక్కర్ స్కాంలో... సీబీఐ చార్జిషీట్‌పై విచారణ వాయిదా

- కోర్టు ముందు హాజరైన కవిత, సహనిందితులు

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో



ఢిల్లీ లిక్కర్ స్కాంలో సీబీఐ దాఖలు చేసిన సప్లమెంటరీ చార్జిషీట్‌పై విచారణను రౌస్ ఎవెన్యూ కోర్టు మరోసారి వాయిదా వేసింది. ఈ చార్జిషీట్‌లోని కొన్ని పేజీలను తెలుగు నుంచి ఇంగ్లీష్‌లోకి అనువాదించి ఇవ్వాలని సీబీఐ అధికారులను ఆదేశిస్తూ... తదుపరి విచారణను సెప్టెంబర్ 25కు వాయిదా వేస్తున్నట్టు ట్రయల్ కోర్టు వెల్లడించింది. ఈ కేసు వ్యవహారంలో జూన్ 7న కవితతో పాటు, మరో నలుగురిపై సప్లమెంటరీ చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ చార్జిషీట్‌ను జులై 22న కోర్టు పరిగణనలోకి తీసుకుంది. అలాగే అంతకు ముందు మనీష్ సిసోడియా, అమన్ డీప్ దళ్, బుచ్చిబాబు, అభిషేక్ బోయినపల్లి, ముత్తా గౌతమ్, సమీర్ మహేంద్రులపై సీబీఐ అదనపు చార్జిషీట్ వేసింది. ఈ చార్జిషీట్లపై బుధవారం సీబీఐ కోర్టు స్పెషల్ జడ్జ్ కావేరి బవేజా విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా కవితతో పాటు, ఈ కేసులోని సుమారు 40 మంది సహ నిందితులు వర్చువల్ మోడ్ లో కోర్టు ముందు హాజరయ్యారు. తొలుత సీబీఐ తరపు అడ్వొకేట్లు వాదిస్తూ... ప్రతివాదులకు అందించిన చార్జిషీట్‌లో క్లారిటీగా లేని పేపర్లను అందిస్తున్నట్లు కోర్టుకు నివేదించారు. మధ్యలో కవిత తరపు అడ్వొకేట్ జోక్యం చేసుకొని సీబీఐ చార్జిషీట్ కాపీల్లో పలు పేజీలు తెలుగులో ఉన్నాయని వాటిని పూర్తి స్థాయిలో ఇంగ్లీష్ లోకి అనువాదించేలా ఆదేశాలివ్వాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ కేసులో ఎక్కువ మంది హిందీ ప్రాంతానికి చెందిన వ్యక్తులు నిందితులుగా ఉన్నారని... అయితే కవిత పై దాఖలు చేసిన సప్లమెంటరీ చార్జిషీట్‌లో తెలుగు పేజీలను పొందుపరచడం వల్ల మిగితా నిందితులకు ఆ పేజీలు అర్థమయ్యే అవకా శం లేదన్నారు. దీని వల్ల కోర్టు విచారణ సందర్భంగా నిందితులకు అన్యా యం జరిగే ఆస్కారం ఉందన్నారు. ఇరువైపు వాదనలు విన్న స్పెషల్ జడ్జ్ కావేరి భవేజా... ప్రతివాదులు అడిగిన కాపీలను సప్లై చేయాలని సీబీఐకి ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 25కు వాయిదా వేస్తున్నట్టు వెల్లడించారు.

ఈడీ కేసులో పిళ్లై కి బెయిల్

ఢిల్లీ లిక్కర్ స్కాంలో సహ నిందితురాలు కల్వకుంట్ల కవితకు బినామీగా దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తోన్న హైదరాబాద్ బిజినెస్ మెన్ అరుణ్ రామ చంద్ర పిళ్లైకి బెయిల్ మంజూరైంది. మనీలాండరింగ్ కేసులో బెయిల్ కోరుతూ ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ ఏకసభ్య ధర్మాసనం... పిళ్లైకి బెయిల్ మంజూరు చేసింది. కాగా... అరుణ్ రామ చంద్ర పిళ్లైని 2023 మార్చిలో ఈడీ అరెస్ట్ చేసింది. పలుమార్లు పిళ్లై వాంగ్మూలాన్ని నమోదు చేసింది. అయితే... పిళ్లై, ఇతర అప్రూవర్లుగా మారిన సహనిందితులు కవితకు వ్యతిరేకంగా స్టేట్మెంట్లు ఇచ్చారు. వీటి ఆధారంగా కవితను దర్యాప్తు సంస్థలు అరెస్ట్ చేశాయి. ఈ సందర్భంగా పిళ్లైని కవితకు బినామీగా (ప్రాక్సీ, డూప్లీకేట్) గా ఆరోపించారు. అయితే... అనూహ్యంగా అరుణ్ రామచంద్ర పిళ్లై తాను ఇచ్చిన వాంగ్మూలాన్ని వెనక్కి తీసుకున్నారు. ఇటీవల కవిత బెయిల్ సందర్భంగా ఈ అంశాలపై కూడా సుప్రీంకోర్టులో వాదనలు జరిగాయి. మరోవైపు కవితతో పాటు, పిళ్లై కూడా ఆధారాలను ధ్వంసం చేశారని సీబీఐ, ఈడీ ఆరోపిస్తుంది. కాగా... ఈ కేసులో కీలకంగా ఉన్న సమీర్ మహేంద్రుకు కూడా గత వారం బెయిల్ వచ్చింది.

సీబీఐ కేసులో 4వ సప్లమెంటరీ చార్జిషీట్ దాఖలు

ఢిల్లీ లిక్కర్ స్కాం వ్యవహారంలో బుధవారం సీబీఐ 4వ సప్లమెంటరీ చార్జిషీట్‌ను దాఖలు చేసింది. ఈ స్కాంలో అరబిందో ఫార్మసీ డైరెక్టర్ పి శరత్ చంద్రారెడ్డి పాత్రపైనా ఈ అదనపు చార్జిషీట్ లో పొందుపరిచింది. కాగా, ఇప్పటి వరకు సీబీఐ మొత్తం చార్జిషీట్, 4వ సప్లమెంటరీ చార్జిషీట్లను దాఖలు చేసింది. ఇందులో కవితతో పాటు మరో నలుగురిపై పాత్రపై రెండో సప్లమెంటరీ చార్జ్‌లో మెన్షన్ చేసింది. ఇప్పటికే ఈ చార్జిషీట్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకోగా ట్రయల్స్ కూడా జరుగుతున్నాయి.

ఐలమ్మ, కొండా లక్ష్మణ్ పేర్లు పెట్టిన సీఎంకు ధన్యవాదాలు

- అధికార ప్రతినిధి డాక్టర్ లింగం యాదవ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రజా ప్రభుత్వంలో ఆయా విశ్వవిద్యాలయాలకు బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారి పేర్లు పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ లింగం యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. మహిళా విశ్వవిద్యాలయానికి తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్‌బాపూజీ పేర్లు పెట్టడం అభినందనీయమని చెప్పారు. ఇప్పటికే స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశారని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నందుకు సీఎం, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

గాజులు, చీరలు కేసీఆర్‌కు పంపండి

- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి బండ్రు శోభారాణి కౌంటర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గాజులు, చీరలు పంపాలనుకుంటే ముందుగా మాజీ సీఎం కేసీఆర్‌కు పంపించాలని మహిళా కార్పొరేషన్ చైర్మెన్ బండ్రు శోభారాణి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి కౌంటర్ ఇచ్చారు. ఇతర పార్టీ నాయకుల చేరికతో బీఆర్ఎస్ ఆవిర్భావించిందని గుర్తు చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆమె విలేకర్లతో మాట్లాడారు. కౌశిక్‌రెడ్డికి ఆమె చెప్పు చూపించారు. మహిళలను అడ్డం పెట్టుకుని ఎమ్మెల్యేగా గెలిచిన పాడి కౌశిక్‌రెడ్డి నీతులు చెబుతున్నారని విమర్శించారు. మహిళలను చులకన చేసి మాట్లాడే ముందుకు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మహిళలను కించపరిచేలా మాట్లాడుతున్నారనీ, వెంటనే క్షమాపణ చెప్పాలని భవానీరెడ్డి డిమాండ్ చేశారు.

'కథువా' మద్దతుదారుకు కాంగ్రెస్ టికెటా?

- కాంగ్రెస్‌కు కేటీఆర్ ప్రశ్న

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కథువా లైంగికదాడి కేసులో నిందితులకు మద్దతుగా నిలిచిన లాల్ సింగ్ అనే వ్యక్తికి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించటమా? సిగ్గు చేటు అంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ బుధవారం ట్వీట్ చేశారు. 'నారీ న్యాయ్' అంటూ గొప్పలు చెప్పే ఆ పార్టీ లైంగికదాడిని సమర్థించిన వ్యక్తికి ఏ విధంగా సీటును కేటాయిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నిత్యం చెప్పే 'నారీ న్యాయ్' అంటే ఇదేనా?నారీ న్యాయ్‌కు కాంగ్రెస్ చెప్పే నిర్వచనం ఇదేనా? అని ప్రశ్నించారు. కథువాలో ఆసిఫా బానోపై జరిగిన దారుణమైన లైంగికదాడిని సమర్థించిన వ్యక్తికి ఆ పార్టీ సీటు కేటాయించడం, మరోవైపు ఆ ఘటనపై బాధితుల తరపున పోరాడుతున్నట్టు చెప్పడం ఏంటని నిలదీశారు. ఇది కచ్చితంగా దేశంలోని ప్రతి మహిళను అవమాన పరచటమేనని పేర్కొన్నారు. 'నారీ న్యాయ్' నినాదం ఎంత డొల్ల అనేది ఈ ఒక్క సంఘటన ద్వారా అర్థమవుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిగ్గుమాలిన చర్యలను దేశం మొత్తం గమనిస్తోందని ఆయన హెచ్చరించారు.

అమెరికా రక్షణ బడ్జెట్‌ను మించిపోయిన రుణాలపై చెల్లింపు - మస్క్



అపారమైన అమెరికా ప్రభుత్వ ఫెడరల్ రుణంపై చేస్తున్న చెల్లింపులు ఇప్పుడు రక్షణ బడ్జెట్‌ను మించిపోయాయని టెస్లా, స్పేస్ ఎక్స్ సీఈఓ ఎలోన్ మస్క్ ఆల్-ఇన్ పాడ్‌కాస్ట్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. అమెరికా ట్రెజరీ జూలై చివరలో జాతీయ రుణం 35 ట్రిలియన్ డాలర్లను అధిగమించిందని ప్రకటించింది. ఈ రుణం ఆరు నెలల కాలంలో ఒక ట్రిలియన్ పెరిగింది. జూలై చివరలో అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ దేశం జాతీయ రుణం చరిత్రలో మొదటిసారిగా 35 ట్రిలియన్ డాలర్లను అధిగమించిందని, జనవరి నుంచి ఒక ట్రిలియన్ పెరిగిందని ప్రకటించింది.

కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ (సీబీఓ) 2034 నాటికి అమెరికా రుణం 50 ట్రిలియన్లకు మించి ఉంటుందని అంచనా వేసింది. ఇది అమెరికా స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) కంటే 122 శాతం కంటే ఎక్కువ. 2029 నుంచి 2034 వరకు దేశ సగటు వార్షిక స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటు దాదాపు 1.8 శాతంగా ఉంటుందని కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ అంచనా వేస్తోంది. డోనాల్డ్ ట్రంప్ పదవీకాలంలో 8.4 బిలియన్ డాలర్లతో పోలిస్తే ప్రస్తుత అమెరికా ప్రెసిడెంట్ జో బైడెన్ హయాంలో జాతీయ రుణం 4.3 బిలియన్‌ల డాలర్లు పెరిగిందని "కమిటీ ఫర్ ఎ రెస్పాన్సిబుల్ ఫెడరల్ బడ్జెట్ (సీఆర్ఎఫ్ బీ)" థింక్ ట్యాంక్ జూన్‌లో ప్రకటించింది.

జూన్‌లో అమెరికా ప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్) వార్షిక రక్షణ విధాన సంస్కరణ కు చెందిన బిల్లును ఆమోదించింది. ఇది గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 1శాతం పెరుగుదలను సూచిస్తూ రికార్డు స్థాయిలో 895 బిలియన్ల ఖర్చును ఆమోదించింది. "జాతీయ రుణంపై వడ్డీ చెల్లింపులు ఇప్పుడు మొత్తం రక్షణ శాఖ బడ్జెట్ కంటే ఎక్కువగా ఉండటమే కాకుండా పెరుగుతున్నాయి" అని మస్క్ చెప్పాడు. అమెరికా "చాలా త్వరగా దివాళా తీస్తోంది" అని ఆయన హెచ్చరించాడు. జోడించిన ప్రతి ట్రిలియన్ డాలర్ల రుణం "మా పిల్లలు, మనుమలు ఏదో ఒకవిధంగా చెల్లించవలసి ఉంటుంది" అని ఆ వ్యాపారవేత్త నొక్కిచెప్పాడు. ఈ వారం ప్రారంభంలో టెక్ బిలియనీర్ ఎలోన్ మస్క్ తన ఎక్స్ (గతంలో ట్విట్టర్) ప్లాట్‌ఫారమ్‌లో ఫైనాన్స్, ఎకనామిక్స్‌పై దృష్టి సారించిన ఖాతా ద్వారా ఒక పోస్ట్‌ను పంచుకున్నాడు. రాబోయే 12 నెలల్లో తన అప్పుపై 1.2 ట్రిలియన్లకు పైగా వడ్డీని అమెరికా చెల్లించాల్సి ఉంటుందని ఆ పోస్టు పేర్కొంది. ఇది ప్రభుత్వ ఆదాయంలో దాదాపు 25 శాతానికి సమానం.

ఈ నెల ప్రారంభంలో ప్రస్తుత ప్రభుత్వ వ్యయం రేటు అమెరికా దివాలా తీయడానికి దారితీస్తోందని, ప్రభుత్వ అధిక వ్యయం ద్రవ్యోల్బణాన్ని పెంచుతుందని మస్క్ హెచ్చరించాడు. అమెరికా లేబర్ డిపార్ట్‌మెంట్ 2021 తర్వాత మొదటిసారిగా వార్షిక ద్రవ్యోల్బణం మునుపటి నెలలో 3 శాతం కంటే తక్కువగా పడిపోయిందని ఆగస్టులో ప్రకటించింది. వస్తువుల, సేవల ధరలు 2.9 శాతం పెరిగాయి. అయితే గత 12 నెలల కంటే 3.2 శాతం పెరిగిన ప్రధాన ద్రవ్యోల్బణం ఆహారం, ఇంధన పరిశ్రమలను మినహాయించింది.

రష్యాతో చర్చలు కోరుతున్న ఎక్కువ మంది ఉక్రేనియన్లు


ప్రపంచ గమనం

వాల్ స్ట్రీట్ జర్నల్

మాస్కోతో వివాదానికి దౌత్యపరమైన పరిష్కారాన్ని కీవ్ కనుగొనాలనే ఉక్రేనియన్ల సంఖ్య పెరుగుతోందని వాల్ స్ట్రీట్ జర్నల్ పత్రిక రాసింది. "ఇటీవలి వరకు నిషేధించబడిన ప్రశ్నను కొందరు ఉక్రేనియన్లు అడుగుతున్నారు: చర్చలు జరపడానికి ఇది సమయం కాదా?" అని మంగళవారం ప్రచురించిన ఒక కథనంలో వాల్ స్ట్రీట్ పేర్కొంది. గత సంవత్సరం కీవ్ చాలా హైప్ చేసిన ఎదురుదాడి విఫలమైనప్పటి నుంచి ఉక్రెయిన్‌లో రష్యాతో చర్చలకు మద్దతు "పైపైకి దూసుకుపోతోంది" అని ఒపీనియన్ పోల్స్ చూపిస్తున్నాయి. రష్యా స్వాధీనం చేసుకున్న అన్ని భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి తమ దేశం పోరాడుతూనే ఉండాలని ఉక్రేనియన్లలో ఎక్కువమంది ఇప్పటికీ కోరుకుంటున్నారని వాదించినప్పటికీ, అది ఖచ్చితమైన గణాంకాలను అందించలేదు.

ఆగస్టు ప్రారంభంలో కీవ్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియాలజీ ప్రచురించిన మరో పోల్‌లో 57 శాతం మంది ప్రజలు రష్యాతో సంభాషణను ప్రారంభించాలని కోరుకున్నారని తేలింది. ఆగ్నేయ నగరమైన జాపోరోజీకి చెందిన 33 ఏళ్ల పాఠశాల ఉపాధ్యాయురాలిని ఈ పత్రిక ఉదహరించింది. శాంతి కోసం తన భర్త యుద్ధ రంగం నుంచి ఇంటికి తిరిగి రావడానికి తాను భూభాగంలోని ఏదైనా భాగాన్ని వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పింది. "ఈ యుద్ధంతో మనం ఎక్కడికి వెళ్లగలం?" అని ఆమె ఆశ్చర్యపోయింది.

రష్యాతో శాంతి ఒప్పందం గురించి చాలా సందేహాస్పదంగా ఉన్న సమూహం ఉక్రేనియన్ మిలిటరీ. ఇటీవలి సర్వేలో 18 శాతం క్రియాశీల-డ్యూటీ దళాలు, అనుభవజ్ఞులు మాత్రమే చర్చలకు అనుకూలంగా ఉన్నారని



ఆ పత్రికా కథనం తెలిపింది. అదే పోల్ ప్రకారం, 15 శాతం మంది సైనికులు, అనుభవజ్ఞులు కీవ్ మాస్కోతో అననుకూల ఒప్పందంపై సంతకం చేస్తే తాము సాయుధ నిరసనలో పాల్గొంటామని చెప్పారు. ఉక్రెయిన్‌పై కొత్త దాడికి సిద్ధం కావడానికి రష్యా పోరాటంలో విరామం ఉపయోగించవచ్చని, రాయితీలతో శాంతిని కోరుకోవడం అంటే మరణించిన తమ సహచరుల త్యాగం వ్యర్థం అని సైనికులు ఆందోళన చెందుతున్నారు.

కీవ్‌తో చర్చలను "ఎప్పుడూ తిరస్కరించలేదు" అని గత వారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పునరుద్ఘాటించాడు. అయితే అవి "కొన్ని అశాశ్వతమైన డిమాండ్‌ల ఆధారంగా కాకుండా, ఇస్తాంబుల్‌లో మార్చి 2022 చివరలో ఇరుపక్షాలు చివరిగా చర్చలలో కూర్చున్నప్పుడు అంగీకరించిన, వాస్తవానికి ప్రారంభించిన పత్రాల ఆధారంగా జరగాలి" ఆయన నొక్కి చెప్పాడు. టర్కీలో జరిగిన చర్చల సమయంలో ఉక్రెయిన్ సైనిక తటస్థతను ప్రకటించడానికి సిద్ధంగా ఉంది. దాని సాయుధ బలగాలను పరిమితం చేయటానికి ఒప్పుకుంది. రష్యన్ జాతి పట్ల వివక్ష చూపనని మాట ఇచ్చింది. అందుకు బదులుగా ఉక్రెయిన్ భద్రతా హామీలను అందించడంలో మాస్కో ఇతర ప్రముఖ శక్తులతో చేరి ఉండేదని పుతిన్ చెప్పాడు.

హింసను ప్రేరేపిస్తున్న చాట్‌బాట్స్

- తప్పుడు సమాచారంతో కంటెంట్
- నియంత్రణ లేకపోవటంతోనే ఇదంతా..
- హెచ్చరిస్తున్న టెక్ నిపుణులు

న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్నది. ఇంటర్నెట్ రాకతో ఇది మరింత ఊపందుకున్నది. సోషల్ మీడియా రాకతో పరిస్థితులు మరింతగా మారాయి. యూట్యూబ్, ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ యాప్స్ పుణ్యమా అని సామాన్య వ్యక్తులు సైతం రాత్రికి రాత్రే సెలబ్రిటీలుగా మారుతున్నారు. సోషల్ మీడియా వేదికగానే అభిమానులను సంపాదించుకొని, ఆ యాప్‌ల మీదనే సంపాదిస్తున్నారు. ఇక ఇటీవల మరింత అభివృద్ధి చెంది అందుబాటులోకి వచ్చిన చాట్‌బాట్స్ కంటెంట్‌ను సైతం అందిస్తున్నాయి. దీంతో వినియోగదారులు తమకు కావాల్సిన కంటెంట్‌ను క్షణాల్లో పొందుతున్నారు. విద్యార్హతలతో ఏ మాత్రమూ సంబంధం లేకుండా ఒక్క క్లిక్‌తోనే ఇదంతా సాధ్యమవుతున్నది. కృత్రిమ మేధ(ఏఐ)తో నడిచే ఈ చాట్‌బాట్స్ కీలక పాయింట్లను అందిస్తూ వినియోగదారులకు సేవలు అందిస్తున్నాయి.

మార్కెట్‌లో పలు కంపెనీలకు సంబంధించిన చాట్‌బాట్స్ అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా వచ్చే సమాచారమంతా నిజమని నమ్మలేమని టెక్ నిపుణులు అంటున్నారు. చాట్‌బాట్స్ కూడా తప్పులు చేయగలవనే



సందేశమూ సంబంధిత అప్లికేషన్లలో కనిపిస్తుందని చెప్తున్నారు. అయితే, ఈ చాట్‌బాట్స్ తప్పుడు సమాచారాన్ని ఇస్తున్నాయనీ, అవి కొంత కటాఫ్ డేట్ వరకు ఉన్న సమాచారాన్ని మాత్రమే అందదించగలవని అంటున్నారు. వీటి ద్వారా వచ్చే సమాచారం తప్పుడు సమాచారంతో పాటు ద్వేషం, హింస వంటి కంటెంట్‌ను అందిస్తూ నెటిజన్లను, వాటిని నమ్మే ఇన్‌ఫ్లుయెన్సర్ల ద్వారా వారి ఫాలోవర్లను తప్పుదారి పట్టిస్తున్నాయని టెక్ నిపుణులు చెప్తున్నారు. తీవ్రవాదానికి సానుకూలంగా ఉండే సమాచారాన్ని కూడా ఇవి అందిస్తున్నాయని కొన్ని సందర్భాలను వారు ఉదహరిస్తున్నారు.

గోరక్షణ పేరుతో దేశంలో హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్న హిందూత్వ శక్తుల తీరు కూడా ఇలానే ఉన్నదని ఇటీవల జరిగిన కొన్ని ఘటనలను ఉటంకిస్తున్నారు. కొంతమంది గోరక్షకులు ఈ విధంగానే చాట్‌బాట్స్‌తో తమకు అనుకూలమైన కంటెంట్‌ను పొందుతూ సోషల్‌మీడియాలో ఫాలోవర్లను సంపాదిస్తున్నారని చెప్తున్నారు. ఇటీవల యూపీలో అనిల్ కౌషిక్ అనే గోసంరక్షకుడు 12వ తరగతి విద్యార్థిని హత్య చేసిన తీరును వారు గుర్తు చేస్తున్నారు. అనిల్ కౌషిక్‌కు సోషల్ మీడియాలో విపరీతమైన ఫాలోవర్లు ఉన్నారనీ, చాట్‌బాట్ నుంచి కంటెంట్‌ను పొందుతూ ఫాలోవర్లలో క్రేజ్‌ను సంపాదించుకున్నాడని అంటున్నారు. ఈ విధమైన తీరు దేశంలో హింసకు కారణమవుతూ ఆందోళనకరమైన పరిస్థితులకు దారి తీస్తున్నదని సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ విధమైన అప్లికేషన్లపై ప్రభుత్వ నియంత్రణ అవసరమని వారు సూచిస్తున్నారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఈ తీరు ఆందోళనకరంగా ఉన్నదని అంటున్నారు. అక్కడి ప్రభుత్వాలు హిందూత్వశక్తుల పట్ల సున్నితంగా వ్యవహరిస్తున్నాయనీ, ఈ కారణంగానే దేశంలో కఠిన పరిస్థితులు నెలకొన్నాయని విశ్లేషకులు చెప్తున్నారు.

వినాయక నిమజ్జనంలో ఉద్రిక్తత

- కర్నాటకలో పలు దుకాణాలకు నిప్పు

బెంగళూరు: కర్నాటకలోని మాండ్యలోని నాగమంగళలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం తీవ్రస్థాయికి చేరడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పెయింట్ షాపులు, బైక్ షోరూమ్‌లు, బట్టల దుకాణాలు సహా పలు దుకాణాలకు అగంతకులు నిప్పు పెట్టడంతో అవి పూర్తిగా దగ్ధమయ్యాయి. రోడ్లపై పార్క్ చేసిన మోటార్ సైకిళ్లను కూడా లక్ష్యంగా చేసుకుని నిప్పంటించడంతో ఉద్రిక్తతలు మరింత పెరిగి ఇరు వర్గాల మధ్య హింసకు దారితీసింది. పరిస్థితిని నియంత్రించడానికి, పోలీసులు ఆ ప్రాంతంలో హై అలర్ట్ ప్రకటించారు .



దళిత క్రైస్తవులకు న్యాయం చేయండి

- కోదండరాంకు అణగారిన క్రైస్తవ జన సమాఖ్య వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దళితుల నుంచి క్రైస్తవులుగా మారిన వారికి న్యాయం చేయాలని అణగారిన క్రైస్తవ జన సమాఖ్య (ఉద్యమ పార్టీ) కోరింది. ఈ మేరకు బుధవారం సమాఖ్య జాతీయ కన్వీనర్ నాగళ్ల పోచయ్య ఇశ్రాయేల్, జాతీయ కో కన్వీనర్లు ఎం.వీ.జాన్సన్, ఆండ్ర్యూ జేవియర్ హైదరాబాద్ లోని టీజేఎస్ కార్యాలయంలో ఆ పార్టీ అధినేత, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంకు వినతిపత్రం సమర్పించారు. దళిత క్రైస్తవులను తిరిగి ఎస్సీ జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అప్పటి వరకు బీసీ-సీలో ఉన్న దళిత క్రైస్తవులకు ప్రత్యేక కమిషన్, మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసి న్యాయం చేయాలని సూచించారు. దళితుల నుంచి బుద్ధిస్టులుగా, సిక్కులుగా మారిన వారిని తిరిగి ఎస్సీ జాబితాలో చేర్చారని వారు గుర్తుచేశారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ వారి సమస్యలను, డిమాండ్లను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

జూనియర్ కాలేజీ ప్రిన్సిపాళ్లకు డీఐఈవో/నోడల్ అధికారిగా ఇన్‌చార్జీ బాధ్యతలు!

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న ప్రిన్సిపాళ్లకు సీనియార్టీ ఆధారంగా డీఐఈవో/నోడల్ అధికారులుగా ఇన్‌చార్జ్జీ లేదా ఎఫ్ఏసీ బాధ్యతలను ఇవ్వడానికి తగిన చర్యలు తీసుకోవాలంటూ ఇంటర్ విద్యాశాఖ సంచాలకులను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం హరిత బుధవారం మెమో జారీ చేశారు. ప్రిన్సిపాళ్లకు డీఐఈవో/నోడల్ అధికారులుగా ఇన్‌చార్జ్జీ లేదా ఎఫ్ఏసీ ఇవ్వాలని కోరుతూ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశానికి గతంలో వినతిపత్రం సమర్పించామని తెలంగాణ ఇంటర్మీడియెట్ గవర్నమెంట్ లెక్చరర్ల సంఘం (టిగ్లా) అధ్యక్షులు మైలారం జంగయ్య, ప్రధాన కార్యదర్శి మాచర్ల రామకృష్ణగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పుడు మెమో విడుదల చేయడం పట్ల కృతజ్ఞతలు ప్రకటించారు. దీనివల్ల ఇంటర్ విద్య వ్యవస్థాగతంగా బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలపై పర్యవేక్షణ పెరిగి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు పడతాయని తెలిపారు.

వీధి కుక్కల బెడదను నివారించండి

- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో స్వైరవిహారం చేస్తున్న వీధి కుక్కల బెడదను అరికట్టాలని మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పసి పిల్లలను కుక్కలు పీక్కు తినడం, కుక్కకాటుకు మరణాలు అనే వార్తలు గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో సర్వసాధారణంగా మారిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. హృదయ విదారక ఘటనలు జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఈ ఏడాది రాష్ట్రంలో 60 వేల మందికిపైగా కుక్క కాట్లకు గురి కాగా, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. కుక్క కాటుకు ఉపయోగించే యాంటీ రేబిస్ ఇంజక్షన్లను ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని విమర్శించారు. వాటి నివారణకు ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న పద్ధతులు, గత మూడేండ్లుగా కుక్క కాటు మరణం సంభవించని గోవా లాంటి రాష్ట్రాల నియంత్రణ విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. హైకోర్టు సూచన మేరకు రాష్ట్రంలో వీధి కుక్కల నియంత్రణకు కమిటీలు ఏర్పాటు చేయడంతో పాటు వాటి నివారణకు అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. కుక్క కాట్ల వల్ల మరణించిన వారికి రూ.5 లక్షలు, గాయపడ్డ వారికి రూ.50 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

జులానాలో వినేశ్ ఫొగట్ నామినేషన్

జులానా : హరాన్యా అసెంబ్లీ ఎన్నికలు నేపథ్యంలో జింద్ జిల్లాలోని జులానా స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఒలింపిక్స్ రెజ్లర్ వినేష్ ఫొగాట్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ నాయకులు, రోహతక్ ఎంపి దీపిందర్ సింగ్ హుడా, సోనిపట్ ఎంపి సత్పల్ బ్రహ్మచారితో కలిసి వినేష్ తన నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా దీపిందర్ సింగ్ హుడా విలేకరులతో మాట్లాడుతూ 'వినేష్ ఫొగాట్ భారీ విజయం' సాధిస్తారని అన్నారు. జులానాలో మాత్రమే కాకుండా హర్యానాలోనే కాంగ్రెస్ సంపూర్ణ మెజారిటీ సాధిస్తుందని చెప్పారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకునిరావాలని, బిజెపిని గద్దె దించాలని హర్యానా ప్రజలు నిర్ణయించుకున్నారని అన్నారు.



ఆప్ నాల్గో జాబితా

హరాన్యా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులతో ఆమ్‌ఆద్మీ పార్టీ నాల్గో జాబితాను విడుదల చేసింది. 21 మంది అభ్యర్థులతో బుధవారం ప్రకటించిన ఈ జాబితాలో జులానా నియోజకవర్గం నుంచి రెజ్లర్ కవితా దలాల్‌ను ఆప్ బరిలోకి దిపింది. ఈ స్థానం నుంచి కాంగ్రెస్ నుంచి ఒలింపిక్ రెజ్లర్ వినేష్ ఫొగట్, బిజెపి నుంచి యోగేశ్ బైరాగి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. అంబాలా నుంచి రాజ్ కౌర్ గిల్‌ను, కర్నాల్ స్థానం నుంచి సునీల్ బిందాల్‌ను, గురుగ్రామ్ నుంచి నిశాంత్ ఆనంద్‌ను ఆప్ పోటీకి నిలిపింది. నాల్గో జాబితాతో ఆప్ ఇప్పటి వరకూ 61 మంది అభ్యర్థులను ప్రకటించింది.

దేశవ్యతిరేక శక్తులతో రాహుల్‌గాంధీ భేటీ సిగ్గుచేటు : ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అమెరికా పర్యటనలో ఉన్న కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అక్కడి సమావేశాల్లో భారత వ్యతిరేక వ్యక్తులు, శక్తులతో సమావేశం కావడం సిగ్గుచేటని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. భారత్‌పై విషం చిమ్మే అమెరికా శాసనసభ్యులు ఇల్హాన్ ఒమర్‌తో రాహుల్ గాంధీ సమావేశమవ్వడాన్ని తప్పుబట్టారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పరిస్థితులు అనుకూలిస్తే భారతదేశంలో రిజర్వేషన్లను రద్దు చేస్తామని రాహుల్ వ్యాఖ్యానించడాన్ని ఖండించారు. రిజర్వేషన్ల విషయంలో రాహుల్ గాంధీ అసలురంగు, కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందని విమర్శించారు. విదేశీ పర్యటనల్లో భారతదేశం పట్ల, భారతదేశ ప్రజాస్వామ్యం పట్ల, భారత ప్రజలను అవమానించేలా విమర్శలు చేయడం రాహుల్ గాంధీకి పరిపాటిగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల తీర్పును సైతం అవమానించేలా రాహుల్ మాట్లాడటం ప్రజాస్వామ్యాన్ని కించపర్చడమేనన్నారు. బీజేపీ అధికారంలో ఉన్నంతవరకు రిజర్వేషన్లను రద్దు చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పించిన అంబేద్కర్ ను ఓడించిన దౌర్భాగ్య చరిత్ర కాంగ్రెస్ దేనని విమర్శించారు.

దొంగతనానికి వచ్చి విద్యుద్ఘాతంతో ఇద్దరు మృతి

- సోలార్ ప్లాంట్ ఫెన్సింగ్ కట్ చేస్తుండగా ఘటన

నవతెలంగాణ-మిడ్జిల్

సోలార్ ప్లాంట్‌లో రాగి తీగ దొంగతనానికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని బోయినపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లి ప్రగతి సోలార్ ప్లాంట్‌లో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయని యజమాని చుట్టూ రెండెం చెల ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్లాంట్ లోపల భాగంలో ఎలక్ట్రిక్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం రాత్రి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మొదటి ఫెన్సింగ్‌ను కట్ చేశారు. ఆ తర్వాత లోపలి భాగంలో ఉన్న ఎలక్ట్రిక్ ఫెన్సింగ్‌ని పట్టుకోగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతులు జోగు లాంబ జిల్లా ఇటిక్యాల మండలానికి చెందిన బాలస్వామి(42), అతని కుమారుడు జయ రాజు(17)గా పోలీసులు గుర్తించారు. మృతదేహాలను జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలో వైర్ కట్టర్లు, ఒక టవర్ లోపల రాళ్లు, గోనె సంచులు లభ్యమయ్యాయి. మృతులిద్దరూ రాగి తీగ దొంగతనానికి వచ్చి.. విద్యుద్ఘాతానికి గురైనట్టు ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ

కేసీఆర్ కల...బీఆర్ఎస్ ఘనత : మాజీమంత్రి హరీశ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తాజాగా నాలుగు మెడికల్ కాలేజీలకు అనుమతి రావడంతో ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కల నెరవేరిందని వైద్యారోగ్యశాఖ మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక 29 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు నిర్ణయించడంతో కాలేజీల సంఖ్య 34కు, సీట్ల సంఖ్య నేడు ఎంబీబీఎస్ 4,090కు చేరాయని తెలిపారు. ఏటా 10 వేల మంది డాక్టర్లను తయారు చేసే రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించిందని తెలిపారు. కేంద్రం 157 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు అనుమతించి తెలంగాణకు ఇవ్వకున్నా నాడు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటుకు నిర్ణయించినట్టు గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వం వాటి ఏర్పాటు కోసం నిధులు, భూకేటాయింపు, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి అనుమతులు మంజూరు చేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ ఏడాది ఎనిమిది కాలేజీలకుగానూ నాలుగు మెడికల్ కాలేజీలకు అనుమతులు నిరాకరిస్తే జరిగిన తప్పును ఆలస్యంగా గుర్తించారని చెప్పారు. ఎన్ఎంసీ నిబంధనల మేరకు అన్ని మౌలిక వసతులు, బోధనా సిబ్బందిని సమకూర్చుకుంటామని అనుమతి కోరుతూ కేంద్రానికి అప్పీల్ చేస్తే దాన్ని అంగీకరించి ఎన్ఎంసీ మార్గనిర్దేశనం చేసిందని వివరించారు.

వైద్యవిద్య కోసం విదేశాలకు వెళ్లే బాధను తప్పించామని తెలిపారు. అదే విధంగా స్థానిక రిజర్వేషన్ల కల్పనతో తెలంగాణ పిల్లలకు సీట్లు లభించాయని గుర్తుచేశారు. మెడికల్ కాలేజీల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించాలనీ, మౌలిక వసతులు, బోధన సిబ్బంది కొరత లేకుండా చూస్తూ ప్రతి ఏటా ఎన్ఎంసీ అనుమతులు (రెన్యువల్) కొనసాగేలా జాగ్రత్తలు తీసుకోవాలనీ, తద్వారా వైద్య విద్యార్థులకు నష్టం కలగకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

లక్ష్మాపూర్‌లో నీటి కటకట

- ట్యాంకర్లతో నీటి సరఫరా



నవతెలంగాణ-గజ్వేల్

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఉన్న మల్లన్న సాగర్ కాలనీకి చెందిన లక్ష్మాపూర్ గ్రామంలో నీటి కటకట నెలకొన్నది. గ్రామంలో నీటి సరఫరాకు సంబంధించిన పైప్‌లైన్ పగిలిపోయి మూడు రోజులైనా మరమ్మతులు చేయలేదు. దీంతో లక్ష్మాపూర్ గ్రామస్తులు తీవ్ర తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. మూడు రోజులుగా తాగునీరు రావడంలేదని గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకుపోయారు. ఆయన వాటర్ పైప్‌లైన్ మరమ్మతులు చేసే సిబ్బంది దృష్టికి తీసుకుపోయినా ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టలేకపోయారు. దాంతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో చాలా చోట్ల నీటి సరఫరా పైప్‌లైన్లు దెబ్బతింటున్నాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించి వెంటనే పనులు చేపడితే గ్రామాల్లో నీటి సమస్య ఉండదని గ్రామస్తులు తెలిపారు. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తే సరిపోవడం లేదని, వెంటనే పైప్‌లైన్ మరమ్మతులు చేసి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

వాల్మీకి నిధులను వాడుకున్న కాంగ్రెస్

నిజాలను నిగ్గు తేల్చాలి ..దోషులను కఠినంగా శిక్షించాలి : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కర్నాటకలో వెలుగులోకి వచ్చిన వాల్మీకి కుంభకోణానికి సంబంధించిన డబ్బులను మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ కాంగ్రెస్ నేతలు వాడుకున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. గిరిజనుల కోసం ఖర్చు చేయాల్సిన సొమ్మును ఎన్నికల ప్రచార నిమిత్తం వాడుకోవటం దారుణమని ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. వాల్మీకి కుంభకోణంలో కర్నాటక మాజీ మంత్రి బి.నాగేంద్ర కీలక సూత్రధారి అనే విషయాన్ని ఈడీ నిర్ధారించిందని తెలిపారు. ఆ స్కామ్‌లో ప్రధాన నిందితుడైన సత్యనారాయణ వర్మ హైదరాబాద్‌కు చెందిన ఓ బిల్డరని పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన ఇద్దరు కాంగ్రెస్ కీలక నేతలకు ఆయన అత్యంత సన్నిహితుడని తెలిపారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు సంస్థలు వాల్మీకి కుంభకోణానికి సంబంధించిన నిజానిజాలను నిగ్గు తేల్చాలనీ, దోషులను కఠినంగా శిక్షించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

జమ్ముకాశ్మీర్ ఎన్నికల్లో ఇంజనీర్ రషీద్ ప్రచారం

- తీహార్ జైలు నుంచి విడుదల

న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్ ఎన్నికల్లో అవామీ ఇత్తెహాద్ పార్టీ (ఎఐపి) తరపున పార్లమెంటు సభ్యులు ఇంజనీర్ రషీద్ ప్రచారం చేయ నున్నారు. ఉగ్రవాదు లకు నిధులు సమకూర్చారన్న ఆరోపణలతో తీహార్ జైలులో విచారణ ఖైదీగా ఉన్న ఆయన మధ్యంతర బెయిల్‌పై బుధవారం విడుదలయ్యారు. ఎన్నికల్లో ప్రచారం కోసం ఆయనకు కోర్టు వచ్చే అక్టోబర్ 2 వరకూ మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఇంజనీర్ రషీద్‌గా ప్రాచుర్యం పొందిన షేక్ అబ్దుల్లా రషీద్ ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో బారాముల్లా నియోజకవర్గం నుంచి జమ్ముకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాపై విజయం సాధించిన సంగతి తెలిసిందే.

జీఓలు ఇచ్చి చేతులు దులుపుకుంటే కాలేజీలు రావు

- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీఓలు ఇచ్చి చేతులు దులుపుకుంటే మెడికల్ కాలేజీలు రావని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఎద్దేవా చేశారు. మెడికల్ కాలేజీల ఏర్పాటు బీఆర్ఎస్ ఘనత అంటూ వైద్యారోగ్యశాఖ మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చేసిన ప్రకటనకు మంత్రి కౌంటర్ ఇచ్చారు. గత పాలకులు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు హడావిడిగా 8 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు జీవోలు ఇచ్చారని బుధవారం ఆయన ట్వీట్ చేశారు. మెడికల్ కాలేజీలకు బిల్డింగ్ లేదు, హాస్టల్ లేదు, హాస్పిటల్ లేదు, స్టాఫ్‌ను నియమించలేదని తెలిపారు. ఎక్విప్‌మెంట్ కొనకుండానే కాలేజీలు ఏర్పాటు చేశామని బీఆర్ఎస్ నేతలు డబ్బా కొట్టుకున్నారని విమర్శించారు. ఎన్ఎంసీ తనిఖీల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన డొల్లతనమంతా బయటపడిందని తెలిపారు. సరైన సౌకర్యాలు లేకపోవడంతో కాలేజీలు ఇచ్చేది లేదని ఎన్ఎంసీ తేల్చి చెప్పినా, యుద్ధప్రాతిపదికన ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా మెడికల్ కాలేజీలను, హాస్పిటళ్లను తయారు చేసినట్టు తెలిపారు. ఫస్ట్ అప్పీల్‌లో ఒప్పించి ములుగు, గద్వాల, నారాయణ పేట్, నర్సంపేట్ కాలేజీలకు అనుమతులు తీసుకొచ్చినట్టు చెప్పారు. యాదాద్రి, మెదక్‌లో ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం 220 బెడ్ల హాస్పిటళ్లను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. వనస్థలిపురం, మల్కాజ్‌గిరిలో ఉన్న 50 బెడ్ల దవాఖాన్లను 220 బెడ్లకు అప్‌గ్రేడ్ చేసి టీచింగ్ హాస్పిటళ్లుగా తీర్చిదిద్దామన్నారు. తాము అధికారంలోకి వచ్చేనాటికి కుత్బుల్లాపూర్, మహేశ్వరంలో అసలు దవాఖానాలే లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెకండ్ అప్పీల్‌లో కేంద్ర ఆరోగ్యశాఖను ఒప్పించి యాదాద్రి, మెదక్, కుత్బుల్లాపూర్, మహేశ్వరం కాలేజీలకు అనుమతులు తీసుకొచ్చామని తెలిపారు.

పీజీఈసెట్‌లో 7,128 మందికి సీట్ల కేటాయింపు

- 19 వరకు కాలేజీల్లో చేరేందుకు అవకాశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంఈ/ఎంటెక్‌తోపాటు ఎంఫార్మసీ, ఎంఆర్క్, ఫార్మా-డీ(పీబీ) కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన పీజీఈసెట్ మొదటి విడత కౌన్సెలింగ్‌లో బుధవారం సీట్లు కేటాయించారు. ఈ మేరకు పీజీఈసెట్ ప్రవేశాల కన్వీనర్ పి రమేష్‌బాబు ఒక ప్రకటన విడుదల చేశారు. పీజీఈసెట్ కన్వీనర్ కోటాలో ఎంటెక్, ఎంఈలో 5,891 సీట్లు, ఎంఫార్మసీ, ఎంఫార్మ్‌లో 3,395 సీట్లు, ఎంఆర్క్‌లో 168 సీట్లు కలిపి మొత్తం 9,454 సీట్లున్నాయని వివరించారు. 10,923 మంది అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని తెలిపారు. ఎంటెక్, ఎంఈలో 4,330 మంది, ఎంఫార్మసీ, ఎంఫార్మ్‌లో 2,747 మంది, ఎంఆర్క్‌లో 51 మంది కలిపి మొత్తం 7,128 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. గురువారం నుంచి ఈనెల 19 వరకు కేటాయించిన కాలేజీల్లో అభ్యర్థులు చేరేందుకు అవకాశముందని తెలిపారు. ఈనెల 23 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

హైకోర్టు తీర్పును అమలు చేయాలి

- బీఆర్ఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎమ్మెల్యేలు దానం నాగేందర్‌తో పాటు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులపై నాలుగు వారాల్లో చర్యలు తీసుకోవాలన్న హైకోర్టు తీర్పును అమలు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కె.పి.వివేకానంద, పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో వారు మీడియాతో మాట్లాడారు. కాలయాపన చేయకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చినట్టు తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు తన గౌరవాన్ని తగ్గించుకునేలా మాట్లాడుతున్నారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పీఏసీకి దొంగచాటుగా అరెకెపూడి గాంధీతో నామినేషన్ వేయించారని విమర్శించారు. హరీశ్‌రావు వేసిన నామినేషన్ ఏమైందో చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేల భవిష్యత్‌కు సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ సమాధి కట్టారని విమర్శించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ పూటకో పార్టీ మారే దానం నాగేందర్ బిచ్చగాడనీ, కడయిం శ్రీహరి పచ్చి మోసగాడ నీ, అరికెపూడి గాంధీ నకిలీ గాంధీ అని విమర్శించారు.

వ్యక్తిత్వ విలువలు, సమాజ వికాసాన్ని పెంచేలా విద్యా విధానం

- కాలానుగుణంగాసంస్కరణలు తీసుకొస్తాం : మంత్రి సీతక్క
- సచివాలయంలో క్యాబినెట్ సబ్‌కమిటీ తొలి భేటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వ్యక్తిత్వ విలువలు, సమాజ వికాసాన్ని పెంచేలా రాష్ట్రంలో మెరుగైన విద్యావిధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందనీ, ఆ దిశగా తమ ప్రభుత్వం ముందుకెళ్తున్నదని మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) చెప్పారు. కాలానుగుణంగా విద్యావ్యవస్థలో సంస్కరణలు, సిలబస్‌లో మార్పులు రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. విద్యా వ్యవస్థలో తీసుకరావాల్సిన సంస్కరణల కోసం ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో భేటీ అయ్యింది. కమిటి చైర్మెన్ మంత్రి శ్రీధర్ బాబు, సభ్యులు మంత్రి సీతక్క ఆధ్వర్యంలో సాగిన సమావేశంలో విద్యా వ్యవస్థలో తీసుకరావాల్సిన మార్పులపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..విద్యార్థులకు మంచి మార్కులతో పాటు మంచి నడవడిక నేర్పేలా మార్పులు జరగాలని ఆకాంక్షించారు. అమ్మాయిలు, మహిళలు అంటే చిన్న చూపు పొగొట్టేలా, లింగ సమానత్వం సాధించే దిశలో సిలబస్‌లో పాఠాలను చేర్చాలని సూచించారు. ఇప్పటికే ఉపాధ్యాయ ఖాళీలను భర్తి చేస్తున్నామనీ, ఏండ్లుగా ఉన్న పదోన్నతుల అంశాన్ని పరిష్కరించామన్నారు. గత ప్రభుత్వం ఎంఈఓలను, డీఈఓలను నియమించకపోవడంతో పర్యవేక్షణ లేకుండా పోయిందని చెప్పారు. పర్యవేక్షణ అధికారులను నియమించి నిరంతరం పర్యవేక్షణ కొనసాగే చర్యలు తీసుకుంటామన్నారు. బీటెక్, ఎంటెక్ ఫీజులకన్నా కేజీ చిన్నారుల ఫీజులు కొన్ని పాఠశాలల్లో అధికంగా ఉన్నాయనీ, ఫీజులను నియంత్రించేలా నిబంధనలు రూపొందిస్తామని హామీనిచ్చారు. విద్యా వ్యవస్థ మెరుగుదల కోసం ఇంటిగ్రేటెట్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. అత్యాధునిక ప్రమాణాలతో కూడిన విద్య పేదలకు అందేలా...దేశానికే ఆదర్శంగా నిలిచే సరికొత్త విద్యా విధానం రూపొందిస్తామన్నారు. సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రి, విద్యాశాఖ అదనపు కార్యదర్శి లలిత, డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ శృతి ఓజా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సబ్‌కమిటీలో చర్చించిన అంశాలివే..

- పాఠశాల నుంచి యునివర్సిటీ స్థాయి వరకు విద్యా రంగంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, తేవాల్సిన సంస్కరణలపై ప్రాథమికంగా సబ్‌కమిటీ చర్చించింది.
- కోచింగ్ సెంటర్ల నిర్వహణ విషయంలో కేంద్రం మార్గదర్శకాలను పాటించాలని సబ్‌కమిటీ నిర్ణయించింది. గైడ్‌లైన్స్ పాటించని కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని తీర్మానించింది.
- నూతన జాతీయ విద్యావిధానాన్ని రాష్ట్రంలో అమలు చేయాలా? వద్దా? అనే దానిపై ఇతర రాష్ట్రాల్లో అమలు తీరును పరిశీలించి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించింది.
- ఉద్యోగ అవకాశాలు మెరుగు పనిచేలా పాలిటెక్నిక్ కళశాలలను అప్ గ్రేడ్ చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది.
- ఇంటర్ కాలేజీ నుంచి యూనివర్సిటీ వరకు అన్ని స్థాయిలో లెక్చరర్ల నియామకం కోసం కాలేజీ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేసే అంశంపై చర్చించింది.
- డిగ్రి విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచేందుకు పాలిటెక్నిక్ కాలేజీల మాదిరిగా ఇంటర్న్‌షిప్‌ను చేర్చే అంశాన్ని పరిశీలించింది.
- విద్యారంగంలో తీసుకురావాల్సిన సంస్కరణలపై చర్చించింది.